సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 272

శుక్రవారం 16-6-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



బ్రిజ్‌భూషణ్‌కు ఊరటనిస్తూ..
'పోక్సో'ను తొలగించేందుకు సిద్ధమైన పోలీసులు - 13లో



లాభాలకు 'ఫెడ్' బ్రేక్
18,700 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ.. మళ్లీ 63 వేల దిగువకు సెన్సెక్స్ - 13లో



తీరాన్ని తాకిన బిపర్‌జోయ్
బిపర్‌జోయ్ తుపాను గుజరాత్‌లో తీరాన్ని తాకింది. దీని ప్రభావంతో గుజరాత్‌లో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.
వివరాలు 6లో ▸



పార్లమెంట్‌లో లైంగిక వేధింపులు
పార్లమెంట్ భవనం సాక్షిగా తనను ఎంపీ డేవిడ్ వాన్ లైంగికంగా వేధించారని ఆస్ట్రేలియా ఎంపీ లిడియా థోర్ప్ ఆరోపించారు.
వివరాలు 6లో ▸



'ఐరాస'లో 'మెమోరియల్ వాల్'
ఐరాస ప్రధాన కార్యాలయంలో 'మెమోరియల్ వాల్' నెలకొల్పాలన్న భారత్ తీర్మానాన్ని సాధారణ సభ ఆమోదించింది.
వివరాలు 6లో ▸



పవార్ 'పవర్' గేమ్!
సుప్రియాను వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తూ ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఆడిన 'పవర్' గేమ్ సొంత పార్టీలోనే చీలికలు తెచ్చేలా ఉంది.
వివరాలు 6లో ▸

మారుమూలలకూ.. డిజిటల్ విప్లవం

ఒకేసారి 100 జియో సెల్ టవర్లు ప్రారంభం

- 209 మారుమూల గ్రామాలకు సెల్, ఇంటర్నెట్ సేవలు
- సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్‌లో సేవలు వేగవంతం
- ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలకు మరింత భరోసా
- మొత్తంగా 5,459 ఆవాసాలకు సెల్ సేవలు అందించాలని లక్ష్యం
- 2,849 ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు 2,463 చోట్ల స్థలాలు అప్పగింత
- డిసెంబర్ నాటికి అన్ని ప్రాంతాల్లోనూ టవర్ల ఏర్పాటుకు కార్యాచరణ
- నాలుగేళ్లుగా గిరిజనోద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- విద్య, వైద్యం, ఆరోగ్యం, రోడ్లు, వ్యవసాయానికి ఊతం
- వీటన్నింటికీ తోడుగా 4జీ సేవలు
- వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలతో స్వయంగా మాట్లాడిన సీఎం జగన్



సీఎం జగన్‌కు టీమిండియా జెర్సీ బహూకరిస్తున్న క్రికెటర్ భరత్. చిత్రంలో ఆయన కుటుంబసభ్యులు 2లో

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగేళ్లుగా గిరిజన సంక్షేమాభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకెన్నడూ లేని విధంగా విశేషంగా కృషి చేస్తోంది. గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేకంగా దృష్టి సారించింది. కనీస మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసింది. వ్యవసాయం, విద్య, వైద్యం, ఆరోగ్యం, రహదారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

మిగతా 2వ పేజీలో ▶

'ఆడుదాం ఆంధ్ర'

రాష్ట్రంలో ప్రతి ఏటా క్రీడా సంబరాలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 46 రోజుల పాటు క్రీడా పోటీలు

2లో

ఆడిటర్ సహా.. విశాఖ ఎంపీ భార్య, కొడుకు కిడ్నాప్

నాలుగు గంటల్లోనే కథ సుఖాంతం

- రెండు రోజులు క్రితం ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లో చొరబడిన దుండగులు
- అతడితోనే ఫోన్ చేయించి తల్లిని రప్పించిన కిడ్నాపర్లు
- ఆమె ద్వారా ఆడిటర్ జీవీని పిలిపించి నిర్బంధం
- ముగ్గురి మెడపై కత్తిపెట్టి డబ్బులివ్వాలని బెదిరింపులు
- రూ.1.75 కోట్లు ఇచ్చినా.. ఇంకా కావాలంటూ డిమాండ్
- జీవీ మొబైల్‌ను ట్రాక్ చేయాలని సీపీకి ఎంపీ విజ్ఞప్తి
- దీంతో గురువారం ఉదయం వెలుగులోకి వచ్చిన కిడ్నాప్ వ్యవహారం
- సినీ ఫక్కీలో కిడ్నాపర్లను నాలుగు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు
- రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, రాజేష్ అరెస్టు.. మరో ఐదుగురి కోసం గాలింపు



నిందితుడు హేమంత్ కుమార్ (ఫైల్)

దొండపర్తి (విశాఖ దక్షిణ)/విశాఖ విద్య: విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య, కుమారుడితో పాటు ప్రముఖ ఆడిటర్ జీవీ కిడ్నాప్ వ్యవహారం గురువారం రాష్ట్రంలో సంచలనం రేకెత్తించింది. సినీ ఫక్కీలో దుండగులు ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లోకి చొరబడి.. ముగ్గురి మెడపై కత్తిపెట్టి డబ్బులు డిమాండ్ చేశారు. 48 గంటల పాటు నిర్బంధించారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. కానీ, పోలీసులు నాలుగు గంటల్లోనే కిడ్నాపర్ల ఆచూకీ కనిపెట్టి సినిమా స్టైల్లో వెంబడించి రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, రాజేష్‌లను అరెస్టుచేయడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది. వారి చెర నుంచి ఎంపీ ఎంవీవీ భార్య జ్యోతి, కుమారుడు శరత్, ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జీవీ) సురక్షితంగా బయటపడ్డారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో మరో ఐదుగురి పాత్ర కూడా ఉన్నట్లు

మిగతా 5వ పేజీలో ▶

ఫ్యాక్ట్ చెక్



'కిట్ల'పై పిట్ట కథలు!

- ఎక్కడా వృథా జరగకున్నా 'ఈనాడు' బురద రాతలు
- పేద పిల్లలకు మేలు జరుగుతుంటే ఓర్వలేని ఎల్లో మీడియా
- జేవీకే–4 సరఫరా టెండర్లలో పక్కాగా లెక్కలు
- 39.96 లక్షల కిట్లకే సరఫరా ఆర్డర్ పెట్టిన సమగ్ర శిక్ష
- గతేడాది మిగిలిపోయినవి ఈ విద్యా సంవత్సరంలో వినియోగం

3లో



టిడ్కో ఇళ్లపై పచ్చ పైత్యం!

- ఎన్పీఏగా మారింది చంద్రబాబు జమానాలోనే..
- అప్పటి రుణాలపై వడ్డీని కూడా వైఎస్ జగన్ ప్రభుత్వమే చెల్లిస్తోంది
- లబ్ధిదారులపై ఎలాంటి భారం లేకుండా చర్యలు

2లో

గుడివాడలో గృహ యజ్ఞం

- సకల హంగులతో 8,912 టిడ్కో ఇళ్లు సిద్ధం
- 77 ఎకరాల్లో నిర్మాణం పూర్తి
- మరో 7,728 మందికి ఇళ్ల పట్టాల అందజేత
- నేడు పంపిణీ చేయనున్న సీఎం
- రూపాయికే 300 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లు
- 365, 430 చ.అ. ఇళ్లకు చెల్లించే ముందస్తు వాటాలో 50% రాయితీ
- రాష్ట్రవ్యాప్తంగా అక్కచెల్లెమ్మలకు రూ.3 లక్షల కోట్ల సంపద

2లో



తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు

ప్రతిభకు పట్టం

ఘనంగా 'జగనన్న ఆణిముత్యాలు' పురస్కారాల ప్రదానం

- పదో తరగతిలో తొలి మూడు స్థానాల్లో 678 మంది
- ఇంటర్‌లో మొదటి స్థానంలో 662 మంది
- పేదల విద్య కోసం సీఎం పరితపిస్తున్నారని సర్వత్రా ప్రశంసలు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుని 2022–23లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో గురువారం ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట సత్కరించింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఈ కార్యక్రమం కన్నులపండువగా సాగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఈ వేడుక ఘనంగా జరిగింది. జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్, ఏపీ మోడల్, బీసీ రెసిడెన్షియల్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, కేజీబీవీ మేనేజ్‌మెంట్ల పరిధిలోని సంస్థల్లో పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సన్మానించారు. ఇలా నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పదో తరగతి విద్యార్థులు 678 మందిని, ఇంటర్‌లో వివిధ మేనేజ్‌మెంట్ జూనియర్ కాలేజీల్లో ఆయా గ్రూపుల వారీగా అత్యధిక మార్కులు సాధించి

మిగతా 2వ పేజీలో ▶

ఏపీ ఐసెట్‌లో 94 శాతం ఉత్తీర్ణత

- టాప్–10 ర్యాంకుల్లో తొమ్మిది ర్యాంకులు అబ్బాయిలకే..
- మొదటి ర్యాంకు టి. జగదీష్ కుమార్‌రెడ్డికి..
- ఏపీఐసెట్ ఫలితాలు విడుదల



మొదటి ర్యాంకు టి. జగదీష్ కుమార్‌రెడ్డి

అనంతపురం: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్–2023 ఫలితాల్లో అబ్బాయిలు సత్తా చాటారు. టాప్–10 ర్యాంకుల్లో తొలి తొమ్మిది ర్యాంకులు వరుసగా అబ్బాయిలే దక్కించుకోగా, 10వ ర్యాంకు అమ్మాయి కైవసం చేసుకుంది. ఏపీ ఐసెట్ ఫలితాలను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గురువారం విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కే. హేమచంద్రారెడ్డి వర్చువల్ విధానంలో హాజరుకాగా, ఏపీ ఐసెట్ చైర్మన్, ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఏపీ ఐసెట్ రాష్ట్ర కన్వీనర్ పి. మురళీకృష్ణ ఫలితాలను వెల్లడించారు. ఏపీ ఐసెట్‌కు మొత్తం 49,122 మంది

మిగతా 3వ పేజీలో ▶

రూ.242.03 కోట్ల 'మార్గదర్శి' చరాస్తులు అటాచ్

- వీటిలో 40 మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు, డిపాజిట్లు
- చిట్టీల మొత్తం చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్న 'మార్గదర్శి'
- చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకు సీఐడీ కఠిన చర్యలు
- మొత్తం రూ.1,035.53 కోట్ల అటాచ్‌మెంట్‌కు నిర్ణయం
- ఇంతకు ముందు రూ.793.50 కోట్ల చరాస్తులు అటాచ్



5లో

2024, 2029లో అవకాశం ఇవ్వండి



- నచ్చలేదంటే దిగిపోతా
- మూడేళ్లలో బంగారు ఆంధ్రప్రదేశ్ చేస్తా
- సమస్యలు తెలుసుకునేందుకే వారాహి యాత్ర
- గొల్లప్రోలులో పవన్ కళ్యాణ్

3లో

నువ్వొకటైతే నేను రెండు!



- మాటిమాటికీ చెప్పులు చూపిస్తావా.. మాకు లేవా పవన్?.. మాజీ మంత్రి పేర్ని నాని ఆగ్రహం
- ఊపిరి ఉన్నంత వరకూ నీ తప్పులు ఎత్తిచూపుతూనే ఉంటా
- ప్రజల్ని నమ్ముకుంటే అసెంబ్లీకి.. బాబును నమ్ముకుంటే వచ్చేది చిల్లరే
- ఆ లారీకి పెట్టాల్సిన పేరు వారాహి కాదు.. నారాహి
- 'నా తల్లిని తిట్టిస్తారా? లోకేశ్‌ను, టీడీపీని వదిలి పెట్టన'ంటూ మళ్లీ కలవడం నీచం కాదా పవన్?

3లో

మళ్లీ గెలిపించండి.. మీ రుణం తీర్చుకుంటా!



'కుప్పం అభివృద్ధి చెందాలంటే నన్ను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించండి. లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే మీ రుణం తీర్చుకుంటా' అని కుప్పం నియోజకవర్గ ప్రజలకు టీడీపీ అధినేత చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్, ఎన్టీఆర్ లాగే ప్రధాని నరేంద్ర మోదీ కూడా చరిత్రకారుడని కొనియాడారు.

3లో

రుతుపవనం.. మరింత ఆలస్యం

- రెండు రోజుల పాటు ఏపీలో చురుగ్గా కదిలి నెమ్మదించిన నైరుతి
- బంగాళాఖాతంలో అనుకూలించని వాతావరణం
- బిపర్‌జోయ్ తుపాను ప్రభావం
- మందగించిన రుతుపవనాల విస్తరణ
- మరో వారం పట్టవచ్చున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: జూన్ నెల సగం గడిచిపోయింది.. రోహిణికార్తె ముగిసి వారమవుతోంది.. అయినా నైరుతి రుతుపవనాలు రాలేదు. మరోపక్క రోహిణి కార్తెని మించి ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే వారం, పది రోజులకుపైగా రుతుపవనాలు ఆలస్యం కాగా.. నైరుతి ఆగమనానికి మరో వారం వరకు సమయం పట్టవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. రుతుపవనాలు రాకపోవడంతో వానలు పడక వ్యవసాయంపై ప్రభావం పడుతోంది. పంటల సాగు ఆలస్యమవుతోంది. ఇలాగైతే పంటల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా మే చివరిలోనే కేరళకు రావాల్సిన నైరుతి రుతుపవనాలు వారానికి పైగా ఆలస్యమయ్యాయి. ఈ నెల 8న కేరళను తాకాయి. క్రమంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు విస్తరించాయి. ఆ తర్వాత మందకొడిగా మారిపోయాయి. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి, అల్పపీడనాలు వంటివి ఏర్పడితే రుతుపవనాలు వేగంగా విస్తరిస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈసారి బంగాళాఖాతంలో అలాంటి పరిస్థితులేవీ లేవు. పైగా అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపర్‌జోయ్ తుపాను ప్రభావంతో నైరుతి మందకొడిగా మారిందని అంటున్నారు. గత పదేళ్లలో రుతుపవనాల రాకను పరిశీలిస్తే 2014, 2016, 2019 సంవత్సరాల్లో ఆలస్యంగా వచ్చాయి. 2019లో కూడా జూన్ 8న దేశంలోకి ప్రవేశించినా.. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో, వేగంగా కదిలి పది రోజుల్లోనే రాష్ట్రంతో సహా దేశంలోని మెజారిటీ రాష్ట్రాలకు విస్తరించాయి. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు.

అధిక ఉష్ణోగ్రత.. ఉక్కపోత

నైరుతి మందగమనంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఇంకా అధికంగానే నమోదవుతున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారం తర్వాత గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తగ్గిపోతాయి. కానీ ఈసారి చాలాచోట్ల 40 డిగ్రీల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. దీనికితోడు వాతావరణంలో తేమ శాతం పెరగడం వల్ల ఉక్కపోత కూడా బాగా ఉంది. ఈ పరిస్థితి మరో వారంపాటు ఉండొచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఇదండీ సంగతి



మీరు మాత్రం పట్టు వదలని భట్టి విక్రమార్కుడిలా మీరు చెప్పదలుచుకుంది.. చెప్పిండి సార్!

క్లుప్తంగా...

క్రికెటర్ కేఎస్ భరత్‌కు సీఎం జగన్ అభినందన

- టీమిండియా జెర్సీని సీఎంకు బహూకరించిన భరత్
- రాష్ట్రంలో క్రీడాకారులకు ప్రోత్సాహం బాగుందని వెల్లడి

సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇండియన్ క్రికెట్ ప్లేయర్ కోన శ్రీకర్ భరత్ గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. టీమ్ సభ్యుల ఆటోగ్రాఫ్‌లతో కూడిన జెర్సీని ముఖ్యమంత్రికి భరత్ బహూకరించారు. ఈ సందర్భంగా భరత్‌ను ముఖ్యమంత్రి జగన్ అభినందించారు. అనంతరం కేఎస్ భరత్ మీడియాతో మాట్లాడారు. 'వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత భారత జట్టుకు ఏపీ నుంచి మొదటిగా ప్రాతినిధ్యం వహించడం, టెస్ట్ జట్టుకు కీపర్‌గా వ్యవహరించడం నాకు ఎంతో గర్వంగా ఉంది. ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రితో పంచుకున్నాను. ఆయన కూడా చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకున్నట్లు వివరించాను. ఒక క్రికెటర్‌గా మీ మద్దతు నాకు అవసరం అని చెప్పాను. దేశం గర్వపడేలా.. మన రాష్ట్ర పేరు, ప్రతిష్టలు నిలబెట్టాలని సీఎం జగన్ సూచించారు. ఏపీలో మౌలిక వసతులు బాగా పెరుగుతున్నాయి. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం చాలా బాగుంది. ఇలాంటి ప్రోత్సాహం వల్ల భవిష్యత్‌లో నాలాంటి క్రీడాకారులు మరింత మంది వెలుగులోకి వస్తారు' అని భరత్ చెప్పారు. సీఎంతో జరిగిన సమావేశంలో కేఎస్ భరత్ తల్లిదండ్రులు మంగాదేవి, శ్రీనివాసరావు, కోచ్ క్రిష్టారావు, ఎంపీ మిథున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో భరత్

క్రికెటర్ కేఎస్ భరత్ గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా.. ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విద్యావ్యవస్థ దేశానికి ఆదర్శం

- డిసెంబర్ 21న ట్యాబ్‌ల పంపిణీ
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: విద్యావ్యవస్థలో నాలుగేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న గొప్ప సంస్కరణలు దేశంలోనే ఆదర్శవంతంగా నిలుస్తున్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన 'జగనన్న ఆణిముత్యాలు' నియోజకవర్గ స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యావ్యవస్థ దేశానికే ఆదర్శమని చెప్పారు. ఇటువంటి గొప్ప సంస్కరణలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదన్నారు. డిజిటల్ విద్యావిధానంతో మన విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దే బృహత్తర క్రతువును సీఎం జగన్ సాగిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ ఏడాది డిసెంబర్ 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ట్యాబ్‌లు పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించేందుకు ఉత్తర్వులు జారీచేశామన్నారు. రాష్ట్రంలోని జెడ్పీ హైస్కూళ్లలో నైట్ వాచ్‌మన్‌లుగా పురుషులను నియమించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్, డీఈవో లింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం

▶ మొదటి పేజీ తరువాయి

మొదటి స్థానంలో నిలిచిన 662 మంది విద్యార్థులను సన్మానించారు. విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ వేడుక నిర్వహిస్తోంది. విద్యార్థులకు నగదు పురస్కారం, మెడల్, మెరిట్ సర్టిఫికెట్, పాఠశాలకు మెమెంటో ఇవ్వడంతోపాటు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లోనూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆనందోత్సాహాల మధ్య అట్టహాసంగా కొనసాగింది. ఎక్కడికక్కడ ఈ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యా రంగం అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషిని సర్వత్రా ప్రశంసించారు. విప్లవాత్మక పథకాలు, కార్యక్రమాలతో విద్యా రంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారని కొనియాడారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో మంత్రి రజిని

'ఆడుదాం ఆంధ్ర'

సాక్షి, అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడా సంబరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. యువతను ప్రొఫెషనల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు. భారత జట్టుకు, ఐపీఎల్ జట్లకు ఏపీ నుంచి క్రికెట్ క్రీడాకారులు ఎంపికయ్యేలా, మన రాష్ట్రం నుంచీ ఐపీఎల్ జట్టును పంపే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఇందులో భాగంగా యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేలా గ్రామ/వార్డు సచివాలయాలు, మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతి ఏటా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను చేపట్టాలని అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. బాలబాలికలకు బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోతో పాటు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయాలన్నారు. మారథాన్, యోగ, టెన్నీకాయిట్, గ్రామీణ సంప్రదాయ క్రీడలను కూడా ప్రోత్సహించాలన్నారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో క్రీడలు, యువజన సర్వీసుల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ఏటా రాష్ట్రంలో 46 రోజుల పాటు క్రీడా సంబరాలు నిర్వహించాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల మైదానాలు, మున్సిపల్ స్టేడియాలు, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, వర్సిటీ మైదానాలను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రతి నియోజకవర్గానికి ఒక ఇండోర్ స్టేడియం నిర్మించాలని, దీనిపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

రాష్ట్రంలో ప్రతి ఏటా క్రీడా సంబరాలు

- ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 46 రోజుల పాటు క్రీడా పోటీలు
- ప్రతి నియోజకవర్గంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళిక
- భారత జట్టు, ఐపీఎల్ జట్లకు మన క్రీడాకారులను పంపడంపై దృష్టి
- భవిష్యత్తులో ఐపీఎల్‌కు ఏపీ నుంచి క్రికెట్ జట్టును పంపే దిశగా అడుగులు
- యువతను ప్రొఫెషనల్ క్రికెటర్లుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక
- ఇందుకు సీఎస్‌కే, ముంబై ఇండియన్స్ జట్ల సహాయం

మైదానాలను గుర్తించాలి

ప్రస్తుతం పోటీల నిర్వహణకు ప్రతి మండలంలో మైదానాలను ముందుగానే గుర్తించాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. ఈ పోటీల్లో మండల స్థాయికి వచ్చే సరికి ప్రొఫెషనలిజానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామ స్థాయిలో ఆడేవారికి కూడా క్రీడా సామగ్రిని సమకూర్చడం.. గెలుపొందిన వారికి బహుమతులతో పాటు స్పోర్ట్స్ కిట్లను అందించాలని సూచించారు. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా సామగ్రిని పెంచడంపై దృష్టి సారించాలని, భవిష్యత్తులో సచివాలయాల పరిధిలో స్పోర్ట్స్ కిట్లను అందించి యువతను క్రీడల దిశగా ప్రోత్సహించేలా అడుగులు ముందుకు వేయాలన్నారు. ముఖ్యంగా హైస్కూల్, ఆ పై స్థాయిలో తప్పనిసరిగా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి గుల్జార్, శాప్ ఎండీ కె.హర్షవర్ధన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



క్రీడలు, యువజన సర్వీసుల శాఖపై సమీక్షలో సీఎం జగన్

ప్రొఫెషనల్ క్రికెటర్లుగా తయారు చేయాలి

ఏపీలోని క్రికెట్ క్రీడాకారులకు ఆటలో మెలకువలు అందించేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) బృందం మార్గ నిర్దేశం చేస్తుంది. భవిష్యత్తులో ముంబై ఇండియన్స్ జట్టు సహాయం కూడా తీసుకుంటాం. తద్వారా మెరుగైన క్రికెట్ సాధన, నిర్వహణ సాధ్యపడుతుంది. ప్రస్తుతం సీఎస్‌కేకు మూడు క్రికెట్ స్టేడియాల్లో శిక్షణ కార్యక్రమాలు అప్పగిస్తాం. తద్వారా ఆటలో ప్రొఫెషనలిజం బాగా పెరుగుతుంది. రాష్ట్రానికి చెందిన అంబటి రాయుడు, కేఎస్ భరత్ వంటి క్రికెటర్లు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వీరి సేవలను సమర్థవంతంగా వినియోగించుకునేలా అధికారులు ప్లాన్ చేసుకోవాలి. తొలుత జిల్లా, తర్వాత నియోజకవర్గ స్థాయిలోనూ ప్రొఫెషనల్‌గా క్రికెట్ ఆడించే పరిస్థితిని తీసుకురావాలి. – సీఎం వైఎస్ జగన్

మారుమూలలకూ డిజిటల్ విప్లవం

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకుంది. వీటన్నింటికీ తోడు మారుమూల గిరిజన గ్రామాల్లో సైతం మొబైల్, ఇంటర్నెట్ సర్వీసులను అందుబాటులోకి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. గురువారం ఒకేసారి 100 సెల్ టవర్లను ప్రారంభించింది. తద్వారా ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను లబ్ధిదారుల ముంగిటకు మరింత త్వరితగతిన తీసుకెళ్లడానికి నాంది పలికింది. సమగ్ర గిరిజనాభివృద్ధే లక్ష్యంగా నాలుగేళ్లుగా చిత్తశుద్ధితో అడుగులు ముందుకు వేస్తున్న సీఎం జగన్.. ఆయా ప్రాంతాల్లో డిజిటల్ సేవలు విస్తరింప చేయాలన్న తాపత్రయంతో ప్రత్యేకంగా దృష్టి సారించారు. సెల్ ఫోన్ సేవలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ ద్వారా ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్‌లో మెరుగైన, నాణ్యతతో కూడిన సేవలు అందుతాయని భావించారు. ప్రధానంగా పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని విశ్వసించారు. ఇందులో భాగంగా మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు ముమ్మరంగా కసరత్తు చేశారు. ఇందుకు గిరిజన, అటవీ ప్రాంతాల్లో ఉన్న అడ్డంకులను అధిగమించేందుకు వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలతో స్వయంగా మాట్లాడారు. మార్గదర్శకాలను సులభతరం చేసుకుని.. సెల్‌టవర్ల ఏర్పాటు కార్యక్రమాన్ని రాష్ట్రంలో వేగవంతం చేశారు. అవసరమైన మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయించారు. మొత్తంగా రాష్ట్రంలో సెల్ సర్వీసులు లేని 5,459 ఆవాసాలకు సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యూఎస్‌ఓఎఫ్) ద్వారా సెల్ టవర్ల ఏర్పాటు కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మొత్తం ప్రాజెక్టు కింద కొత్తగా 2,849 ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు గాను ఇప్పటికే 2,463 చోట్ల స్థలాలు అప్పగించింది. డిసెంబర్ నాటికి అన్ని ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించింది.

ఆవాసాలన్నింటికీ ఇంటర్నెట్ కనెక్టివిటీ

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు 4జీ సేవలందించేందుకు ఒకేసారి 100 జియో టవర్స్‌ను గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ నాటికి రాష్ట్రంలో సెల్ సర్వీసులు లేని ఆవాసాలన్నింటికీ ఇంటర్నెట్ కనెక్టివిటీ రానుందని తెలిపారు. తద్వారా ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, ప్రభుత్వ పాఠశాలలు అన్నింటికీ మరింతగా కనెక్టివిటీ లభించడంతో పాటు మెరుగైన, నాణ్యతతో కూడిన సేవలు అందుతాయన్నారు. సెల్ టవర్స్ ఏర్పాటు ద్వారా రేషన్ పంపిణీ, ఇ–క్రాప్ బుకింగ్ సులభమవుతుందని.. ఆయా ప్రాంతాలకు ఆర్థికంగా కూడా మరింత లబ్ధి కలగనుందని చెప్పారు. సంక్షేమాభివృద్ధి పథకాలను అత్యంత పారదర్శకంగా, లంచాలకు, వివక్షకు తావులేకుండా అక్కచెల్లెమ్మలకు మరింత సమర్థవంతంగా అందించగలుగుతామన్నారు. ప్రజలకు ఇంకా మంచి చేసే అవకాశం రావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సెల్ టవర్లు ఏర్పాటు చేసేందుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ విభాగానికి, జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం ప్రారంభమైన సెల్ టవర్ల ద్వారా 209 గ్రామాలకు 4జీ సేవలు అందనున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 85 టవర్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 10 టవర్లు, అన్నమయ్య జిల్లాలో 3 టవర్లు, వైఎస్సార్ జిల్లాలో 2 టవర్లను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో వీటిని 5జీ సేవలుగా అప్‌గ్రేడ్ చేయనుంది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన సెల్ టవర్ల పరిధిలో 150 ఎంబీపీఎస్ డౌన్లోడ్, 50 ఎంబీపీఎస్ అప్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

గిరిజనులతో ముచ్చటించిన సీఎం

అల్లూరి సీతారామరాజు జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం సికలబాయి, పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కుంటంబడేవలస గ్రామాల్లో టవర్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తొలిసారిగా ఆయా గ్రామాల్లో వచ్చిన సెల్ టవర్ నెట్‌వర్క్ ద్వారా ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ప్రజలు నేరుగా ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు, పాడేరు, కురుపాం ఎమ్మెల్యేలు చెట్టి ఫల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పుష్ప శ్రీవాణి, కలెక్టర్లు సుమిత్‌కుమార్, నిశాంత్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్, ప్రజలు.. సీఎంతో మాట్లాడారు. వారందరినీ సీఎం ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, ఐటీ సెక్రటరీ కోన శశిధర్, రిలయన్స్ జియో ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా సెల్ టవర్లను ప్రారంభిస్తున్న సీఎం జగన్

గిరిజన సంక్షేమాభివృద్ధికి పెద్దపీట

- గిరిజనుల సంక్షేమానికి వైఎస్ జగన్ ప్రభుత్వం 2022 డిసెంబర్ నాటికి రూ.17,651 కోట్లు ఖర్చు చేసింది. గిరిజనులు ధైర్యంగా పంటలు పండించుకునేందుకు వీలుగా చరిత్రలో ఇదివరకెన్నడూ లేని విధంగా 4.88 లక్షల ఎకరాలకు 2.49 లక్షల అటవీ హక్కు పత్రాలు, డీకేటీ పట్టాలు అర్హులైన గిరిజనులకు పంపిణీ చేశారు.
- నాడు–నేడులో భాగంగా గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల రూపురేఖలు మార్చింది. పాడేరు, పార్వతీపురంలో మెడికల్ కళాశాలలు, కురుపాంలో ఇంజనీరింగ్ కళాశాల, సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, బుట్టాయగూడెం, దోర్నాలలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు.. విజయనగరం వద్ద గిరిజన వర్సిటీ ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా విద్యకు కేటాయించిన బడ్జెట్‌లో గిరిజనుల విద్య కోసం 37.66% కేటాయిస్తూ వస్తోంది.
- ఈ ఒక్క ఏడాదే రూ.4,123.39 కోట్ల బడ్జెట్ కేటాయించింది. గిరిజన ఉప ప్రణాళిక కోసం రూ.6,929.09 కోట్లు కేటాయించింది. విశాఖ జిల్లా చింతపల్లి మండలం రాజంగిలో రూ.35 కోట్లతో గిరిజన స్వాతంత్య్ర సమర యోధుల మ్యూజియం నిర్మిస్తోంది. మారుమూల గ్రామాలకు వందల కిలోమీటర్ల మేర రహదారి సౌకర్యం కల్పించింది.

మీ వల్లే గిరిజనుల్లో వెలుగు



ఎక్కడో మారుమూల ఒడిశాకు అతి సమీపంలో ఉన్న గ్రామాలకు సైతం ఇప్పుడు ఇంటర్నెట్ కనెక్టివిటీ అందడం చాలా సంతోషకరం. మా ఐటీడీఏ డివిజన్‌లోనే 86 టవర్లు ప్రారంభించడం ఒక చరిత్ర. మా ప్రాంత ప్రజలందరి తరఫునా మీకు పాదాభివందనం. గతంలో సిగ్నల్స్ లేక ఆఫ్‌లైన్‌లో పని చేయలేక.. ఆన్‌లైన్ ఉన్నచోట డేటా డౌన్‌లోడ్ చేయాల్సి వచ్చేది. గ్రామస్తుల సమస్యలు ఎవరికైనా అత్యవసరంగా చెప్పాలంటే చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్య తప్పింది. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధితో పాటు రోడ్లు.. సెల్ కనెక్టివిటీ కల్పించడం శుభ పరిణామం. గత పాలకులు మా ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తే.. మీరు (సీఎం) పారదర్శకంగా చక్కటి పాలన అందిస్తున్నారు. గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపిన మీ మేలు ఎవరూ మరచిపోరు.

– కె.భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, పాడేరు

ఈ రోజు పెద్ద పండుగ



మీ (సీఎం) చొరవ వల్ల గిరిజన ప్రాంతాలు సైతం అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి. వంద సెల్ టవర్లు ప్రారంభించడం మా మారుమూల ప్రాంతాల్లో పెద్ద పండుగగా భావిస్తున్నాం. ఈ టవర్ల వల్ల మాకు వేగవంతమైన సేవలు అందుతాయి. 104, 108, ఆర్బీకే వ్యవస్థల సేవలను చక్కగా వినియోగించుకోవడానికి దోహద పడుతుంది. గత టీడీపీ ప్రభుత్వం మా గిరిజన ప్రాంతాలను అంధకారంలోకి నెట్టివేసింది. ఇప్పుడు మీ వల్ల మా గిరిజనులు అభివృద్ధికి నోచుకుంటున్నారు. అందరికీ ఆధార్ కార్డులు కూడా ఇస్తుండడంతో ప్రభుత్వ సేవలు ప్రతి గడపకూ చేరుతున్నాయి.

– చెట్టి ఫల్గుణ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, అరకు

కష్టాలు తప్పించారు

సెల్ టవర్ అందుబాటులోకి రావడం వల్ల భీమవరం సచివాలయ పరిధిలో 16 గ్రామాలకు నెట్‌వర్క్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. వలంటీర్లు సకాలంలో పింఛన్లు పంపిణీ చేసేందుకు అవకాశం ఏర్పడింది. సెల్ నెట్‌వర్క్ లేకపోవడం వల్ల గతంలో వలంటీర్లు సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని హుకుంపేట వెళ్లి డేటా ఎంట్రీ చేసేవారు. ఆ తర్వాతే పింఛన్లు పంపిణీ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు భీమవరం, అండిభ పంచాయతీల పరిధిలో నాలుగు టవర్లు నిర్మించడం ద్వారా ఆ ఇక్కట్లు తప్పాయి. తద్వారా పింఛను, వైఎస్సార్ బీమా, ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ, మ్యుటేషన్ల ప్రక్రియ వేగవంతం అవుతుంది.

– శాంతికుమారి, హార్టికల్చర్ అసిస్టెంట్, భీమవరం, అల్లూరి సీతారామరాజు జిల్లా

గిరిజనుల పక్షపాత సీఎం



అన్నా.. మీరు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ప్రతి ఆలోచనా, ప్రతి పథకం మా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి దోహదపడ్డాయి. మీరు గిరిజన పక్షపాత ముఖ్యమంత్రి అనడంలో ఎలాంటి సందేహం లేదు. మా గిరిజన ప్రాంతాల స్కూల్స్, ఆస్పత్రుల రూపురేఖలు మార్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా మాకు అందించారు. నా కుటుంబ సభ్యులంటూ మమ్మల్ని అభివర్ణించిన నాయకుడు మీరే. మీరు మా గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.

– పాముల పుష్ప శ్రీవాణి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, కురుపాం

ఇప్పుడు ఫోన్ చేస్తే 108 వస్తుంది



అన్నా.. మేం నేరుగా మీతో మాట్లాడుతున్నామంటే సెల్ టవరే కారణం. మాకు గతంలో రోడ్లు, కరెంట్, సెల్ టవర్ సౌకర్యాలు లేవు. అవన్నీ మీరు ఇచ్చారు. చాలా సంతోషం. గతంలో గర్భవతులను ఆస్పత్రులకు తీసుకెళ్లాలంటే డోలీలే దిక్కు. కానీ ఇప్పుడు మేము 108కు ఫోన్ చేస్తే మా ప్రాంతానికీ వెంటనే వస్తుంది. మాకు వైద్యం అందుతుంది. మేం మీకు రుణపడి ఉంటాం.

– పాలక సంధ్య, పెదఖర్జ, గుమ్మలక్ష్మీపురం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా

గుడివాడలో గృహ యజ్ఞం

సాక్షి, అమరావతి/విజయవాడ: రాష్ట్రంలోని అతి పెద్ద టిడ్కో లే–అవుట్లలో ఒకటైన కృష్ణా జిల్లా గుడివాడ మునిసిపాలిటీ పరిధిలోని మల్లాయపాలెంలో 77 ఎకరాల్లో నిర్మించిన 8,912 టిడ్కో ఇళ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు. మరో 178.63 ఎకరాల్లో సిద్ధం చేసిన 7,728 మందికి ఇళ్ల పట్టాలు, కడుతున్న 4,500 ఇళ్లకు పట్టాలను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,43,600 మంది లబ్ధిదారులకు 300 చ.అ. టిడ్కో ఇళ్లను ప్రభుత్వం కేవలం రూపాయికే అన్ని హక్కులతో అందజేస్తోంది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా పేద అక్కచెల్లెమ్మలకు రూ.9,406 కోట్ల మేర లబ్ధి చేకూరుతోంది. గత ప్రభుత్వంలో ఇదే ఇంటికి 20 ఏళ్లపాటు నెలకు రూ.3 వేల చొప్పున అసలు, వడ్డీలతో కలిపి ఒక్కొక్కరు రూ.7.20 లక్షలు చెల్లించాల్సిన దుస్థితి. అంటే నిరుపేదలు చెల్లించాల్సిన అక్షరాల రూ.10,339 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. 365 చ.అ. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు 44,304 మందికి ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున, 74,312 మంది 430 చ.అ. లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున ముందస్తు వాటాగా చెల్లించాల్సిన రూ.482 కోట్ల భారాన్ని కూడా జగనన్న ప్రభుత్వమే భరించడంతోపాటు మరో రూ.4,626 కోట్లను సబ్సిడీగా ఇచ్చింది. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లు ప్రతిపాదించిన ప్రాంతాల్లో తాగునీటి సదుపాయం, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక వసతులను నిర్లక్ష్యంగా వదిలేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాకే ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోంది. దీంతో ఒక్కో లబ్ధిదారుడికి అదనంగా మరో రూ.60 వేల వరకు లబ్ధి చేకూరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 2.62 లక్షల మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు సబ్సిడీ రూపంలో రూ.11,672 కోట్లు, ముందస్తు వాటా చెల్లింపులో 50 శాతం రాయితీగా రూ.482 కోట్లు, ఉచిత రిజిస్ట్రేషన్ల రూపంలో రూ.1,200 కోట్లు, మౌలిక వసతులకు మరో రూ.3,247 కోట్లు కలిపి మొత్తంగా రూ.16,601 కోట్ల మేర ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది. గుడివాడ నియోజకవర్గంలో 84 వైఎస్సార్–జగనన్న లేఅవుట్లలో రూ.657 కోట్ల విలువైన 13,145 ఇళ్ల పట్టాలు ఇచ్చింది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల కింద రూ.239 కోట్లు విలువైన 8,859 ఇళ్లు మంజూరు చేసింది. మౌలిక వసతులకు మరో రూ.87 కోట్లు వెచ్చించింది. గుడివాడలో రూ.983 కోట్ల విలువైన ఇళ్ల స్థలాలు, ఇళ్లు, మౌలిక వసతులకు ఖర్చు చేసింది.

లక్షల ఇళ్ల పంపిణీ సీఎం జగన్‌కే సాధ్యం

టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సాక్షి, అమరావతి: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని గొప్ప సాహసం మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారని, లక్షల మందికి ఇళ్లస్థలాలు, ఇళ్లు కేటాయించడం పేదల ప్రగతి పట్ల ఆయన నిబద్ధతకు నిదర్శనమని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ చెప్పారు. సీఆర్డీఏ పరిధిలో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం తుళ్లూరులో రెండోవిడతగా మూడువేల మంది లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా సీఎం జగన్ మొక్కవోని దీక్షతో పేద ప్రజల పక్షాన నిలబడ్డారని చెప్పారు. న్యాయపరమైన సమస్యలను అధిగమించి సీఆర్డీఏ పరిధిలో 50,793 మందికి ఇళ్లస్థలాలు కేటాయించారన్నారు. ఇన్ని వేలమందికి ఇంటిపత్రాలు ఇవ్వడం దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని సాహసమని పేర్కొన్నారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా చేసిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, వైఎస్సార్‌సీపీ స్థానిక కోఆర్డినేటర్ కత్తెర సురేష్ పాల్గొన్నారు.

ఏపీకి జాతీయ అవార్డులు

సాక్షి, న్యూఢిల్లీ: నీటివనరుల సంరక్షణ, నిర్వహణ కార్యకలాపాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్రం ఇస్తోన్న జాతీయ జల అవార్డుల్లో ఏపీ మూడో ఉత్తమ రాష్ట్రంగా ఎంపికైంది. పలు అవార్డులను కైవసం చేసుకుంది. నీటివనరుల నిర్వహణపై సమగ్ర విధానాన్ని అవలంబించే దిశగా వాటాదారులను ప్రోత్సహించే లక్ష్యంతో సమీకృత జాతీయ జల అవార్డులను కేంద్రం ప్రారంభించింది. శనివారం ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో 4వ జాతీయ జల అవార్డులను ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అందజేయనున్నారు.

టిడ్కో ఇళ్లపై పచ్చ పైత్యం!

సాక్షి, అమరావతి: పట్టణ నిరుపేదలు ఇళ్లు పొందాలంటే నిర్దిష్ట మొత్తం చెల్లించాలని షరతు విధించి టిడ్కో లబ్ధిదారులపై బ్యాంకు రుణాల భారాన్ని మోపిన చంద్రబాబు ఏ ఒక్కరికీ సొంత గూడు కల్పించిన దాఖలాలు లేవు. ప్రచార ఆర్భాటం మినహా ఏ ఒక్కటీ పూర్తి చేయలేదు. పేదల కనీస అవసరాల పట్ల అంత దారుణంగా వ్యవహరించినా ఎల్లో మీడియా నాడు ప్రశ్నించిన పాపాన పోలేదు! ఇప్పుడు సీఎం జగన్ ప్రభుత్వం అన్ని సదుపాయాలతో టిడ్కో ఇళ్లను తీర్చిదిద్ది పేదలకు అప్పగిస్తుంటే బరి తెగింపు రాతలకు తెగబడుతోంది!

నాడు గత ప్రభుత్వంలో లబ్ధిదారుల పేరిట బ్యాంకు రుణాలను తీసుకున్నారు. ఇందులో 300 చ.అ. విస్తీర్ణం లబ్ధిదారులు 7,510 మందికి రూ.95 కోట్లు, 365, 430 చ.అ. యూనిట్ల లబ్ధిదారులు 5,058 మందికి మరో రూ.87 కోట్లు చొప్పున మొత్తం రూ.182 కోట్లు తీసుకున్నారు. ఇందులో అత్యధికంగా ఎన్‌పీఏగా మారింది చంద్రబాబు సర్కారు హయాంలోనే కావడం గమనార్హం.



నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 1,43,600 మంది 300 చ.అ. లబ్ధిదారులకు ఇళ్లను ఉచితంగానే అందిస్తోంది. మరో 65,671 మంది (365, 430 చ.అ.) లబ్ధిదారులకు రూ.1,778 కోట్లు బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి.

టీడీపీ సర్కారు ఎన్‌పీఏగా మార్చిన 300 చ.అ లబ్ధిదారుల రుణాలు రూ.110 కోట్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2021, 2022లో చెల్లించింది. 365, 430 చ.అ. లబ్ధిదారుల పేరిట గత ప్రభుత్వం తీసుకున్న బ్యాంకు రుణాలపై రూ.40 కోట్ల వడ్డీని లబ్ధిదారుల తరపున ఏపీ టిడ్కో చెల్లించింది. దీంతో పాటు చంద్రబాబు జమానాలో రుణాలు తీసుకున్న 5,058 మంది 365, 430 చ.అ. లబ్ధిదారుల్లో 2 వేల మందికి ఇళ్లను ఇచ్చారు. దీంతో గత ప్రభుత్వంలో ఎన్‌పీఏగా మారినవారి సంఖ్య 3,058కి తగ్గింది.



నాడు గత ప్రభుత్వం లబ్ధిదారుల పేరుతో బ్యాంకు రుణాలు తీసుకున్నప్పటికీ ఏ ఒక్కరికీ ఇళ్లను కేటాయించలేదు.

నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 65,671 మంది 365, 430 చ.అ. యూనిట్ల లబ్ధిదారుల్లో 31,558 మందికి ఇళ్లను అప్పగించడంతో వారెవరూ ఎన్‌పీఏలుగా మారలేదు. బ్యాంకు రుణాలు తీసుకున్న మరో 33,752 మందికి ఇళ్లను ఆగస్టు నాటికి అందజేయాలని నిర్ణయించారు. అంటే వారు కూడా ఎన్‌పీఏ పరిధిలో లేరు. ఫేజ్–2 టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల్లో 361 మంది మాత్రమే నవంబర్ నాటికి రూ.12.65 కోట్ల మేర ఎన్‌పీఏగా మారనున్నట్లు అంచనా. వీరికి డిసెంబర్‌లో ఇళ్లను ఇవ్వనున్నారు. అంటే కేవలం ఒక్క నెల మాత్రమే ఎన్‌పీఏగా మారే అవకాశం ఉంది. అయితే ఆ భారం లబ్ధిదారులపై పడకుండా ప్రభుత్వమే చెల్లించనుంది.

తప్పుడు కథనాలు..



రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 2.62 లక్షల టిడ్కో ఇళ్లను పట్టణ పేదలకు అందిస్తోంది. ఇందులో 300 చ.అడుగుల్లో నిర్మించిన 1.43 లక్షల ఇళ్లను నిరుపేదలకు ఒక్క రూపాయికే ఇస్తున్నాం. వీటిపై ఎలాంటి రుణం తీసుకోలేదు. మిగిలిన 1.19 లక్షల ఇళ్లల్లో 60 వేల యూనిట్ల నిర్మాణం పూర్తైంది. వీటిని త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తాం. మిగిలిన ఇళ్ల విషయంలో కూడా లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏ కేటగిరిలోనూ ఇళ్ల లబ్ధిదారులపై భారం ఉండదు. ఎల్లో మీడియా పనిగట్టుకొని తప్పుడు కథనాలు రాస్తూ ప్రజల్లో అయోమయం కల్పించేందుకు ప్రయత్నిస్తోంది. టిడ్కో ఇళ్ల విషయంలో టీడీపీ నిర్లక్ష్యం, తప్పిదాలను కూడా ప్రచురించాలి.

– డాక్టర్ ఆదిమూలపు సురేష్, మంత్రి

క్లుప్తంగా...

రామోజీ.. మీ మైండ్‌సెట్ మార్చుకోండి: మంత్రి బొత్స



సాక్షి, విశాఖపట్నం : రామోజీరావు ముందు మీ మైండ్ సెట్ మార్చుకోండి.. లేదంటే మీ 'ఈనాడు' పత్రిక చించుకోవడానికే పనికొస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విద్యాకానుక కిట్లు వృథా అయ్యాయనేది అవాస్తవమని.. ఆడిట్‌లో జరిగే కరస్పాండెన్స్‌తో వార్తలు రాస్తారా? ఇదేనా మీ జర్నలిజం? అంటూ ఆయన ఘా టుగా స్పందించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడారు. బొత్స ఏమన్నారంటే..విద్యాకానుక కిట్లు ఏ ఒక్కటీ మిగల్లేదు. గతంలో 5.46 లక్షల నోటు పుస్తకాలు, 1.46 లక్షల బెల్టులు, 69,181 లక్షల బూట్లు, 23,679 డిక్షనరీలు మిగిలాయి. వాటిని ఈ ఏడాది వినియోగించాం. తప్పేముంది? ఈ ఏడాది యూనిఫాం డిజైన్ మార్చాం. గతంలో కన్నా ఒక జత అదనంగా అందజేశాం. వాటన్నింటినీ వినియోగించాం. ఈ ఏడాదిలో 39.96 లక్షలు వరకూ జగనన్న విద్యాకానుక కిట్లను కొనుగోలు చేశాం. ఇందులో దాపరికాల్లేవు.

ఐదు లక్షల విద్యార్థులకు ట్యాబ్‌లు..

రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మంది 8వ తరగతి విద్యార్థులకు, 20వేల మంది టీచర్లకు ట్యాబ్‌లు ఇచ్చాం. వాటి కొనుగోలుకు పారదర్శకంగా టెండర్లు పిలిచి ఇచ్చాం.

తైతక్కలాడే పవన్ మనకు అవసరమా?

అనంతరం.. కేంద్రమంత్రి అమిత్ షా ఇటీవల విశాఖలో చేసిన వ్యాఖ్యలపై బొత్స స్పందిస్తూ.. 'రూ.5 లక్షల కోట్లు అంటే 'ఉన్ని కోట్లు' అనుకుంటున్నారా? విదేశాల్లో నల్ల ధనం ఉంది.. మనిషికో లక్ష ఇస్తామని చెప్పినట్లు అనుకున్నారా?అంటూ వ్యాఖ్యానించారు. అలాగే, 'పవన్‌కళ్యాణ్ యాత్ర ప్రారంభించి 24 గంటలు దాటింది.. ఏమైనా ఆటంకాలు వచ్చాయా? రక్తపు మరకలు ఎవరికి అంటాయి? ఆ మాటలెందుకు? అసలు తైతక్కలాడే పవన్ మనకు అవసరమా? అని మేం కూడా అనగలం. కానీ, ఇలాంటి మాటలు మేం మాట్లాడం'.. అంటూ బొత్స మీడియా ప్రశ్నకు బదులిచ్చారు.

ఏపీపీజీఈసెట్-23 ఫలితాల విడుదల

86.72శాతం ఉత్తీర్ణత



ఫలితాల జాబితాను విడుదల చేస్తున్న ఎస్వీయూ వీసీ, సెట్ కన్వీనర్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీపీజీఈసెట్-23 ప్రవేశ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) ప్రవేశ పరీక్షను నిర్వహించింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి వర్చువల్‌లో పాల్గొనగా ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి గురువారం ఫలితాలను విడుదల చేశారు. ఏపీ పీజీఈసెట్-23 ప్రవేశ పరీక్షను మే 28 నుంచి 30 వరకు నిర్వహించగా.. రాష్ట్ర వ్యాప్తంగా 7,167 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 5,970 మంది హాజరైనట్లు వీసీ తెలిపారు. వీరిలో 5,177 (86.72శాతం) మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 15 రోజుల్లోనే ఫలితాలను అందించిన ఏపీపీజీఈసెట్ కన్వీనర్, ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్వీఎస్ సత్యనారాయణను ఈ సందర్భంగా అభినందించారు. సెట్ కన్వీనర్ ఆర్వీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ పీజీలో కంప్యూటర్ సైన్స్, సివిల్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్, మెకానికల్, కెమికల్, జియో ఇన్ఫర్మేటిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెటలర్జీ, నానో టెక్నాలజీ, ఫార్మసీ, బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు త్వరలో ప్రారంభమవుతాయన్నారు.

ప్రొ. హరగోపాల్‌పై దేశద్రోహం కేసు

తెలంగాణ

సాక్షి, హైదరాబాద్/ఎస్ఎస్ తాడ్వాయి: ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్‌పై పోలీసులు దేశద్రోహం కేసు పెట్టిన విషయం తాజాగా బయటపడింది. ప్రజాప్రతినిధులను చంపేందుకు కుట్ర చేశారంటూ బీరెల్లి కుట్ర కేసులో హరగోపాల్‌తోపాటు మరో 152 మందిపై ములుగు జిల్లా తాడ్వాయి మండల పోలీస్ స్టేషన్‌లో 2022 ఆగస్టు 19న కేసులు నమోదైన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్-1967 (ఉపా), ఆర్మ్స్ యాక్ట్‌తోపాటు మొత్తం పది రకాల చట్టాల కింద ఈ కేసులు నమోదయ్యాయి. 2022 ఆగస్టు 19న తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరెల్లి గ్రామంలో తెల్లవారుజామున నిషేధిత మావోయిస్టు పార్టీ దళ సభ్యులతో సుమారు 20 సంఘాలకు చెందిన నేతలు సమావేశమవుతున్నట్లు సమాచారం మేరకు కూంబింగ్ చేపట్టగా వారంతా అడవిలోకి పారిపోయారని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అక్కడ లభించిన విప్లవ సాహిత్యం, పలు వస్తువుల ఆధారంగా సమావేశానికి వచ్చిన వారిపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వాన్ని కూలదోయడానికి, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులను హత్య చేయడానికి వారంతా మావోయిస్టు పార్టీతో కలసి కుట్ర చేసినట్లు అభియోగాలు మోపారు. మావోయిస్టు పుస్తకాల్లో హరగోపాల్ పేరు ఉందని పేర్కొంటూ పోలీసులు ఆయన పేరును ఈ కేసులో చేర్చినట్లు తెలుస్తోంది.

'కిట్ల'పై పిట్ట కథలు!

ఫ్యాక్ట్ చెక్

ఎక్కడా వృథా జరగకున్నా 'ఈనాడు' బురద రాతలు

సాక్షి, అమరావతి: బడి గంట మోగిన రోజే పిల్లలకు పుస్తకాల నుంచి యూనిఫామ్ దాకా ఉచితంగా అందచేస్తూ చదువుల పట్ల ఆసక్తిని పెంపొందించిన చరిత్ర గతంలో ఎప్పుడైనా ఉందా? తొలిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాకానుక ద్వారా ఇందుకు చొరవ చూపారు. ఒకపక్క పిల్లలను బడికి పంపించే తల్లులకు అమ్మ ఒడి ద్వారా డబ్బులిస్తూనే మరోపక్క జగనన్న విద్యాకానుక కిట్ల ద్వారా నాణ్యమైన వస్తువులను ఉచితంగా సమకూరుస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దారు. ఇవన్నీ ఎల్లో మీడియాకు కంటగింపుగా మారాయి. ఇక యథాప్రకారం కిట్లలో కిటుకు.. విద్యాకానుక కిట్లు వృథా అంటూ బురద చల్లింది. ఆడిట్ అనంతరం తలెత్తిన ప్రశ్నలకు సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకోవడం సహజమే. కాకపోతే ఆ ప్రక్రియ పూర్తి కాకుండానే ఈనాడు తన పాఠకులకు ఆదరబాదరగా యథాప్రకారం అబద్ధాలను వడ్డించేసింది!!

ఆరోపణ: విద్యార్థుల వాస్తవ సంఖ్యను పరిగణలోకి తీసుకోకుండా అంచనాలకు మించి టెండర్లు పిలిచారు. మిగిలిన కిట్లు ఏం చేయాలో ఆలోచించలేదు.

వాస్తవం: 2023-24లో 43.10 లక్షల మంది విద్యార్థులు ఉండవచ్చనే అంచనాలతో ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. టెండర్లు పిలిచినా సరఫరాదారులకు కేవలం 39.96 లక్షల కిట్లకు మాత్రమే సప్లయ్ ఆర్డర్ ఇచ్చారు. గతేడాది మిగిలిన (జేవీకే 3) సామగ్రిని ఈ ఏడాది జేవీకే 4లో వినియోగించారు. మిగులు వివరాలన్నీ జేవీకే యాప్‌లో నమోదు చేశారు.

ఆరోపణ: పాఠశాల విద్యాశాఖ అస్తవ్యస్థ నిర్ణయాలతో ప్రజాధనం వృథా అయినట్లు ఆడిట్ విభాగం నిగ్గు తేల్చింది.

వాస్తవం: విద్యాశాఖ, ఆడిటింగ్ విభాగానికి మధ్య సమాచార మార్పిడి అంశాలను పూర్తిగా వక్రీకరించి కథనాలను ప్రచురించారు. ఆడిట్ విభాగం వ్యక్తం చేసిన సందేహాలపై పాఠశాల విద్యాశాఖ స్పష్టత ఇచ్చిన అనంతరం పునఃపరిశీలన జరిపి నివేదికను ఖరారు చేస్తుంది. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే తప్పులు జరిగిపోయాయంటూ ఈనాడు తీర్పులిచ్చేసింది.

ఆరోపణ: జ్యుడిషియల్ ప్రివ్యూ నిబంధనను ట్యాబ్‌ల కొనుగోలులో పాటించలేదు.

వాస్తవం: ఇది ముమ్మాటికీ అబద్ధం. ట్యాబ్‌ల కొనుగోలులో ప్రభుత్వం జ్యుడిషియల్ ప్రివ్యూ నిబంధనను తు.చ. తప్పకుండా పాటించింది. దీనికి సంబంధించిన డాక్యుమెంట్ కూడా ఉంది. జ్యుడిషియల్ ప్రివ్యూ ప్రక్రియ పాటించిన తర్వాతే కొనుగోలు చేస్తున్నారు.

ఆరోపణ: ట్యాబుల మెమరీ కార్డుల్లోకి కంటెంట్ లోడ్ కోసం రూ.22.04 కోట్లు అదనంగా ఖర్చు చేశారు.

వాస్తవం: దేశంలో ఎక్కడా లేని విధంగా పాఠశాలల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం చేపడుతోంది. విద్యార్థులకు, టీచర్లకు ట్యాబులు పంపిణీ చేసింది. కేవలం పరికరాలు కొనడమే కాకుండా పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా చర్యలు తీసుకుంది. ఇంటర్నెట్, సరైన బ్యాండ్ విడ్త్ లేకున్నా, ఇంటర్నెట్ ఆధారిత సాంకేతిక లోపాలు తలెత్తినా ట్యాబులు ఉపయోగపడేలా ఆఫ్‌లైన్ మోడ్‌లో పాఠాలు నేర్చుకునేలా మెమరీ కార్డులు అమర్చి వీడియో పాఠ్యాంశాలను లోడ్ చేసి ఇచ్చింది. స్కూలు ముగిశాక ఇంట్లో ఇంటర్నెట్ లేకున్నా విద్యార్థులు పాఠాలు పునశ్చరణ చేసుకోవడానికి మెమరీ కార్డు, వీడియో పాఠ్యాంశాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఆరోపణ: ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలు వచ్చాక గ్రీన్ చాక్‌బోర్డులు ఎందుకు?

వాస్తవం: ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలకు అటు ఇటుగా గ్రీన్ చాక్ బోర్డులు ఉన్నాయి. అవసరమైనప్పుడు సంప్రదాయ పద్ధతుల్లో పాఠ్యాంశాలను బోధించినప్పుడు వీటిని టీచర్లు వినియోగించుకుంటారు. ఇందులో ఈనాడుకు వచ్చిన ఇబ్బంది ఏమిటి? అవి వృథా అవుతాయని ఏ విధంగా నిర్ణయానికి వచ్చారు?

ఆరోపణ: ఏటా అదనంగా విద్యాకానుక కిట్లు కొనడంతో ప్రజాధనం వృథా అయింది.

వాస్తవం ఇదీ: జేవీకే-3లో మిగిలిన సామగ్రిని 2023-24లో వినియోగిస్తున్నారు. 2022-23లో 5,46,923 నోట్ బుక్స్ మిగలడంతో 2023-24లో (జేవీకే 4) సత్యసాయి, అన్నమయ్య, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో పంపిణీ చేశారు. ఆ మేరకు జేవీకే 3 మిగులును పరిగణలోకి తీసుకుని ఈ ఏడాది వాస్తవ విద్యార్థుల సంఖ్య ఆధారంగా విద్యాశాఖ సప్లయ్ ఆర్డర్ ఇచ్చింది.

- బెల్టులు: గతేడాది మిగిలిన 1,46,485 బెల్టులను కర్నూలు, కోనసీమ, అన్నమయ్య జిల్లాల్లో పంపిణీ చేసింది.
- బూట్లు: గతేడాది 69,181 బూట్లు మిగిలాయి. వీటిలో బాగున్న వాటిని సైజుల వారీగా జేవీకే యాప్‌లో అప్‌లోడ్ చేసి పంపిణీ చేశారు. పాడైన బూట్లను సరఫరాదారులకు తిరిగి పంపించారు.
- యూనిఫాం: 2,56,797 మిగులు యూనిఫాంలను కేజీబీవీలకు, ఏపీ మోడల్ స్కూల్, ఏపీ ఆర్ఎస్ స్కూళ్లలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు పంపిణీ చేశారు.
- డిక్షనరీలు: గతేడాది మిగిలిన 23,679 పిక్టోరియల్, 29,488 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను ఈదఫా పంపిణీ చేశారు.
- బ్యాగులు: గత ఏడాది బ్యాగుల్లో 6,13,003 పాడైపోవడంతో సరఫరాదారులకు వెనక్కి పంపి సొంత ఖర్చుతో రీప్లేస్ చేశారు.

నువ్వొకటైతే నేను రెండు..!

మాటిమాటికీ చెప్పులు చూపిస్తావా.. మాకు లేవా పవన్?: మాజీ మంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: 'మాటిమాటికీ చెప్పు చూపిస్తూ మక్కెలు విరగ్గొడతానని హెచ్చరిస్తున్నావ్! నువ్వేం పెద్ద మగోడివా? మాకు లేవా చెప్పులు..? నేను నీకు రెండు చెప్పులు చూపిస్తున్నా! ఇప్పుడు నీకన్నా పెద్ద మగాడిని కదా! జాగ్రత్త..! మక్కెలిరిగిపోతాయ్..!' అని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని నాని(వెంకట్రామయ్య) తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ తీరును తూర్పారబట్టారు. తనను విమర్శించిన వారిని తన ప్రభుత్వం వచ్చిన తర్వాత తాట తీసి నేల మీద కూర్చోబెడతానని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడంపై పేర్ని నాని ఘాటుగా ప్రతిస్పందించారు. 'రంగాను చంపిన వారితో చేతులు కలిపితే ఆ రక్తపు మరకలు నీ చేతికి అంటవా? నా ఊపిరి ఉన్నంతవరకూ నీ తప్పులను ఎత్తిచూపుతూ నీకు వ్యతిరేకంగానే ఉంటా! నీకు చేతనైంది చెయ్! నా జన్మంతా ఎదురు చూస్తా.. కనీసం నా వెంట్రుక కూడా పీకలేవు! రాస్కో పీకే..!' అంటూ సవాల్ విసిరారు. 'నారాహి లారీ ఎక్కి చంద్రబాబును సీఎంగా చేయడం కోసం మోసపూరిత మాటలు చెబుతున్న పవన్ కళ్యాణ్‌ను అందరూ గమనించండి. నా కాపు సోదరులంతా తస్మాత్ జాగ్రత్త' అని సూచించారు.

- పవన్ కళ్యాణ్ రాజకీయాల కంటే తన లారీపై ఎక్కువగా దృష్టి పెట్టినట్లున్నారు. కొండగట్టు, బెజవాడ కనకదుర్గమ్మ ఆలయాలు, జనసేన ఆఫీసు, అన్నవరంలో పూజలు, హోమాలు చేశారు. వారాహి అని అమ్మవారి పేరు పెట్టి రాజకీయాలకు వాడుకోవడం ఏమిటి? నిజానికి ఆ లారీకి పెట్టాల్సిన పేరు 'నారాహి'! తన ప్రసంగాలు వింటుంటే తనకే ఆశ్చర్యమేసిందని కత్తిపూడిలో పవన్ అన్నారు. ఇక ప్రజలకెంత ఆశ్చర్యమేయాలి?
- పాలించే నాయకులకు గులాంగిరీ చేయనని, బాధ్యతగా లేకుంటే చొక్కా పట్టుకుని అడుగుతా అని పవన్ చెబుతున్నారు. మరి టీడీపీ-బీజేపీ-జనసేన ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చొక్కాను ఎన్నిసార్లు పట్టుకున్నారు? ప్రధాని మోదీ కోటు ఎన్నిసార్లు పట్టుకున్నారు? వంతాడలో లేటరైట్ పేరుతో చంద్రబాబు అల్యూమినియాన్ని దోచుకున్నపుడు ఆయన చొక్కా పట్టుకున్నారా? కనీసం ఇప్పుడైనా పట్టుకున్నారా?
- పదేళ్లుగా తానొక్కడినే జనసేనను నడుపుతున్నానని పవన్ అంటున్నాడు. ఆ పార్టీని నడిపేది చంద్రబాబే! ఆఫీసు స్థలం ఎవరిచ్చారు? 2014లో నువ్వు పోటీ చేస్తే నేను ఓడిపోతానని చంద్రబాబు అన్నట్లు పవనే చెప్పారు. చంద్రబాబు కోసం, చంద్రబాబు చేత, చంద్రబాబు కొరకు నిన్ను అడ్డం పెట్టి నడుపుతున్న పార్టీ జనసేన అని చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు.
- సీఎం జగన్ సొంత డబ్బులేమీ ప్రజలకు ఇవ్వడం లేదుగా అని పవన్ విమర్శిస్తున్నాడు. గతంలో చంద్రబాబు తాను వేసిన రోడ్లపై అంతా నడుస్తున్నారని, తాను వేసిన పంపుల్లో నీళ్లు తాగుతున్నారు, తానిచ్చిన గ్యాస్ మీద వంట చేసుకుంటున్నారని ప్రజలను గద్దించినప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడికి వెళ్లారు?
- తన సినిమాలను ఆపాలని చూస్తున్నారని, సినిమా టికెట్లపై ప్రభుత్వం ఆదాయం ఆర్జిస్తోందని పవన్ అంటున్నారు. 2019 తరువాత విడుదలైన భీమ్లానాయక్, వకీల్ సాబ్ సినిమాలను ఎవరు ఆపారు? ఏ సినిమాకు బ్లాక్‌లో టికెట్లు అమ్ముకోలేదు?
- నేడు శ్రీశ్రీ వర్ధంతి. 'ఏదీ తనంతట తానే నీ దరికి రాదు! శోధించి, సాధించాలి! అదే ధీరగుణం..!' అని శ్రీశ్రీ అన్నారు. ఈ గుణం సీఎం జగన్‌ది. ఈ మాటలు ఆయనకు సరిగ్గా సరిపోతాయి. పవన్ కళ్యాణ్ మాత్రం ఎవరైనా సీఎం పదవిని గోదానం.. భూదానం.. కందులు మాదిరిగా దానం చేస్తారేమోనని అడుక్కుంటున్నారు.
- ప్రజల్ని నమ్ముకుంటే అసెంబ్లీకి వెళ్తారు గానీ వ్యూహాలను నమ్ముకుంటే కాదు! వ్యూహాలను, చంద్రబాబును నమ్ముకుంటే చిల్లరొస్తుంది కానీ అసెంబ్లీలో సీటు రాదు.
- ఇసుక దోపిడీ అని తాను ప్రశ్నించడంతో ఇంట్లో చిన్న పిల్లల్ని కూడా వదలకుండా దాడి చేస్తున్నారంటూ పవన్ చెబుతున్నాడు. మేం అంత నీచానికి ఒడిగట్టం.
- పశ్చిమ గోదావరిలో 15 శాసనసభా స్థానాల్లో టీడీపీని గెలిపించి అధికారంలోకి తీసుకొస్తే తన తల్లిని అవమానించారని, లోకేశ్‌ని, టీడీపీని క్షమించేది లేదన్న పవన్ ఇప్పుడు మళ్లీ వారికి తొత్తుగా మారిపోవడం కంటే నీచం మరొకటి ఉంటుందా?

2024, 2029లో అవకాశం ఇవ్వండి

గొల్లప్రోలులో పవన్ కళ్యాణ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ/పిఠాపురం: 2024, 2029లో జనసేనకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ కోరారు. పదేళ్లపాటు తనకు అవకాశం ఇవ్వాలని, నచ్చలేదు అంటే దిగిపోతానని చెప్పారు. వారాహి యాత్ర రెండో రోజు గురువారం పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసేన అధికారంలోకి వస్తే మూడేళ్లలో రాష్ట్రాన్ని బంగారు ఆంధ్రప్రదేశ్ చేస్తామని చెప్పారు. స్వార్థం లేని రాజకీయ నాయకులు మీకు కావాలని అన్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికులకు కూడా సరైన గుర్తింపు లేదన్నారు. మీరు నమ్మితే ఈ ప్రాంతాన్ని సిల్క్ సిటీగా చేస్తానని చెప్పారు. దళారులు, దోపిడీ లేకుండా చేబ్రోలులోనే మార్కెట్ యార్డు సిద్ధం చేస్తామన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి అండగా నిలబడతానన్నారు. ఈ ప్రభుత్వంలో పొద్దున్న అమ్మఒడి ఇచ్చి సాయంత్రానికి నాన్నను సారా ప్యాకెట్లకు తీసుకెళ్తున్నారన్నారు. కుల రాజకీయాలకు స్వస్తి చెప్పే బాధ్యత జనసేనదని అన్నారు. ప్రజల వద్దకు వెళ్లకుండా వారి సమస్యలు తెలుసుకోకుండా ప్రభుత్వంతో పోరాడలేమనే ఉద్దేశంతోనే జనవాణి, వారాహితో యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక యువతి విజయవాడ జనసేన కార్యాలయంలో తన వద్దకు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు స్ఫూర్తిగా జనం సమస్యలు తెలుసుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలు తీర్చడానికే జనవాణి పేరున వారాహిపై యాత్రలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతల తిట్లను సాదరంగా స్వీకరిస్తున్నానన్నారు. ఇక ముందు సమాధానం మాటల్లో ఉండదని, చేతల్లో ఉంటుందని చెప్పారు. అనంతరం పవన్ చేబ్రోలు పట్టు పరిశ్రమ కేంద్రంలో పట్టు సాగు చేస్తున్న రైతులు, చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారికి తమ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధే లక్ష్యం: నారా లోకేశ్

ఆత్మకూరు: టీడీపీకి తొలి నుంచి యువత అండగా ఉండి గెలిపిస్తుందని అలాంటి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా తమ పార్టీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం అనంతసాగరం మండలం బొమ్మవరం సైట్ క్యాంపు వద్ద గురువారం యువతతో లోకేశ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సోమశిల ముంపు ప్రాంతం నుంచి యువతకు పూర్తి స్థాయి ఉపాధి కల్పించలేదని, అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని లోకేశ్‌ను పలువురు నిలదీశారు. దీంతో ఆయన దాని గురించి తనకు పూర్తిగా అవగాహన లేదని పూర్తి వివరాలు తెలుసుకొని సరైన న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేసి వాటి ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కలిగించేలా తమ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డి, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిగ నేతలు టీడీపీని వీడాలి

- ఎమ్మెల్సీలు డొక్కా, ఇజ్రాయెల్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి సూచన

- మాదిగలకు టీడీపీ చేసిన మేలు ఒక్కటైనా ఉందా?
- ఎన్నికల భయంతో కులాల కుంపట్లు చంద్రబాబుకు అలవాటే
- ఆత్మగౌరవాన్ని పెంచేలా సీఎం జగన్ పాలన
- విద్య, సంక్షేమ పథకాలతోపాటు రాజ్యాధికారంలో వాటా
- ఇద్దరు మాదిగలు, ముగ్గురు మాలలకు కీలక శాఖలు

సాక్షి, అమరావతి: ఎన్నికల భయంతో కులాల కుంపట్లు రాజేయడం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు అలవాటేనని ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, బొమ్మి ఇజ్రాయెల్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మండిపడ్డారు. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాలకు తమను వాడుకోవటాన్ని నిరసిస్తూ టీడీపీకి చెందిన మాదిగ నేతలంతా ఆ పార్టీని వీడి బయటకు రావాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలో ఉండగా మాదిగలకు ఒక్కటైనా మేలు చేసిందా? అని ప్రశ్నించారు. మాల మాదిగలను గౌరవిస్తూ, రాజ్యాధికారంలో వాటా కల్పిస్తూ సీఎం జగన్ ఐదు కీలక శాఖలను కేటాయించారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలతోపాటు ఉన్నత చదువులు అభ్యసించేలా తోడుగా నిలిచి దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని దురహంకారంతో మాట్లాడిన చరిత్ర చంద్రబాబుదని ధ్వజమెత్తారు. ఈమేరకు గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు.

దూషించేందుకే ఆ సమావేశం



చంద్రబాబుకు దళితుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు. మాదిగలకు టీడీపీ చేసిన మేలు ఒక్కటైనా ఉందా? టీడీపీ అధినాయకత్వాన్ని దళితులంతా నిలదీయాలి. టీడీపీకి చెందిన మాదిగ నాయకులంతా సంక్షేమంపై చర్చించకుండా సీఎం జగన్‌ను వ్యక్తిగతంగా దూషించేందుకే సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఏడాది రాగానే కులాల కుంపట్లు రాజేయడం చంద్రబాబుకు అలవాటే. విద్య, సంక్షేమ పథకాలతో దళితుల జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారు. ఇద్దరు మాదిగలు, ముగ్గురు మాలలకు కీలక శాఖలు అప్పగించారు. పేద పిల్లలకు ఇంగ్లీషు మీడియం విద్యను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. 30 లక్షల మందికిపైగా ఉచితంగా ఇళ్ల స్థలాలను అందించారు. అమరావతి ప్రాంతంలో మరో 50 వేల మందికి ఇళ్ల స్థలాలిచ్చారు. ఒకేసారి అంతమందికి ఉచితంగా ఇళ్ల స్థలాలిచ్చిన పరిస్థితి దేశంలో ఎక్కడైనా ఉందా?

– డొక్కా మాణిక్య వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

దళిత ద్రోహులంతా టీడీపీలోనే

చంద్రబాబు ఆది నుంచీ దళితులకు వ్యతిరేకమే. ఎన్నికల భయంతో మాదిగల ఓట్ల కోసం ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా మాదిగల పట్ల ఎంత నీచంగా వ్యవహరించారో, ఎలా అవమానించారో మాదిగ జాతి మరిచిపోలేదు. మాదిగలు, మాలలకు పెద్దపీట వేస్తూ ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. మాదిగల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం విద్యను అభ్యసిస్తున్నారు. దీనిపై కూడా కోర్టులకెక్కి అడ్డుపడ్డ దళిత ద్రోహి చంద్రబాబు. పేదల ఇళ్లను సమాధులతో పోల్చిన వ్యక్తి చంద్రబాబే. ఆయన అధికారంలో ఉండగా ఏ ఒక్క పేదవాడికైనా సెంటు స్థలమిచ్చారా? దళితులను అవమానించిన ద్రోహులంతా టీడీపీలోనే ఉన్నారు. దళితులంతా సీఎం జగన్ వెంటే నడుస్తారు.



–కొమ్మూరి కనకారావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్

జగన్ అంటే సోషల్ ఇంజనీరింగ్



పేద బిడ్డలను ప్రోత్సహిస్తూ విద్యా వ్యవస్థలో సీఎం జగన్ తెచ్చిన సమూల మార్పులు టీడీపీ నేతలకు కనపడటం లేదా? దళిత నేతలు ఇప్పటికైనా చంద్రబాబు నైజాన్ని గ్రహించి టీడీపీని వీడి బయటకు రావాలి. సోషల్ ఇంజనీరింగ్ అంటే సీఎం జగన్... జగన్ అంటేనే సోషల్ ఇంజనీరింగ్! సచివాలయ వ్యవస్థ, వలంటీర్లు, ఆర్బీకేలు, అమ్మ ఒడి, చేయూత, చేదోడు, ఆసరా లాంటి విప్లవాత్మక చర్యలే ఇందుకు నిదర్శనం. దళితులకు హిందూ దేవాలయాల్లో ప్రవేశం ఎందుకని నాడు ఇదే టీడీపీ పెద్దలు అభ్యంతరం చెప్పారు. ఆలయాల్లో ప్రవేశాలతోపాటు మాల మాదిగలు, రెల్లి కులస్తులకు ఆలయ పాలకవర్గాల్లో సభ్యులుగా నియమించడంతోపాటు నిర్వహణ బాధ్యత కూడా అప్పగించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏరోజైనా మాల, మాదిగ, రెల్లి, యానాది కులాలకు చెందిన వారిని వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీలకు చైర్మన్‌గా నియమించారా? నామినేటెడ్ పనులు, పదవుల దగ్గర్నుంచి ముఖ్యమంత్రికి సలహాదారులుగా మాదిగలు, మాలలు ఉన్న పరిస్థితిని మనమంతా చూస్తున్నాం. హామీలను నిలబెట్టుకోలేని చంద్రబాబు మినీ మేనిఫెస్టో అంటూ ఓ చెత్త బుట్టను ప్రకటించారు.

– బొమ్మి ఇజ్రాయెల్, ఎమ్మెల్సీ

'విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం'

సాక్షి, అమరావతి : విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయాన్ని ఆర్జించే దిశగా రైతులు ముందుకు సాగాలని నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాలం రవీంద్ర సూచించారు. ఏపీ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్, నర్సరీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సంయుక్తంగా 'మామిడి, పనస పంటలు – ప్రత్యామ్నాయ ఆలోచనలు' అనే అంశంపై విజయవాడలో నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాపులో రవీంద్ర పాల్గొన్నారు. మామిడి, పనస వంటి ఉద్యాన పంటలను కుటుంబ పరిశ్రమలుగా మార్చడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల చలపతిరావు మాట్లాడుతూ ఇదే విధంగా పంటలవారీగా క్షేత్ర స్థాయిలో రైతులకు అర్థమయ్యే రీతిలో రాష్ట్రమంతా వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. కర్ణాటకకు చెందిన పనస పంట నిపుణుడు శివన్న మాట్లాడుతూ గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువ ఉండటం వల్ల మధుమేహ రోగులకు పనస మేలు చేస్తోందన్నారు. మ్యాంగో మ్యాన్ నాగుమళ్ల అప్పాజీ మాట్లాడుతూ మామిడి రైతులకు చేయూతనివ్వాలని కోరారు.

మళ్లీ గెలిపించండి.. మీ రుణం తీర్చుకుంటా!

కుప్పం ఓటర్లకు చంద్రబాబు విజ్ఞప్తి

- అంబేడ్కర్, ఎన్టీఆర్, మోదీ చరిత్ర కారులని కితాబు

సాక్షి, తిరుపతి: 'కుప్పం ఎమ్మెల్యేగా నన్ను వరుసగా గెలిపిస్తూ వస్తున్నారు. మళ్లీ గెలిపించండి. లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే మీ రుణం తీర్చుకుంటా. కుప్పం అభివృద్ధి చెందాలంటే మరోసారి గెలిపించండి' అని టీడీపీ అధినేత చంద్రబాబు కుప్పం నియోజకవర్గ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం కుప్పం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. ఇప్పటికే ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఇక్కడి ఓటర్ల చలవతోనే 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నానని చెప్పుకొచ్చారు. తాను కుప్పం వచ్చినప్పుడు ఒకటి రెండు ల్యాండ్ ఫోన్లు మాత్రమే ఉండేవని, అప్పుడే టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ తీసుకువస్తాననంటే అందరూ నవ్వుకున్నారన్నారు. ఆనాటి ఆలోచనే నేడు ప్రతి ఒక్కరి చేతిలోకి మొబైల్ ఫోన్లు వచ్చాయని తెలిపారు. ఈ టెక్నాలజీ తాను ముందే గ్రహించానని చెప్పుకువచ్చారు. అంబేడ్కర్, ఎన్టీఆర్ లాగే ప్రధాని నరేంద్ర మోదీ కూడా చరిత్ర కారుడని కొనియాడారు. ఎన్టీఆర్ తెచ్చిన హంద్రీ-నీవాను తాను 95% పూర్తి చేస్తే, ఈ నాలుగేళ్లలో కేవలం 4%పనులను పూర్తి చేయలేక పోయారని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేశారు. కేవలం తనపై కక్షతోనే నీళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ నిలిచిపోయిందని చంద్రబాబు ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పిల్ల కుంకలని, దౌర్జన్యం చేసి మునిసిపాలిటీ గెలిస్తే కుప్పం అసెంబ్లీని గెలుస్తామని విర్రవీగుతున్నారని అన్నారు. తనను తక్కువ అంచనా వేయకండని, ఇలాంటి వారిని వేల మందిని చూశానని చెప్పారు. టీడీపీకి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివని చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో ఏ చక్రానికి పంచర్ అయినా సైకిల్ ముందుకు నడవదని చెప్పారు. సీఎం జగన్‌రెడ్డి పాలనలో ఇసుక, మద్యం, ఖనిజ సంపద దోపిడీకి గురవుతున్నాయని విమర్శించారు.

ఏపీ ఐసెట్‌లో 94శాతం ఉత్తీర్ణత



ఏపీఐసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న ఏపీ ఐసెట్ రాష్ట్ర చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఏపీ ఐసెట్ రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ

ఏపీ ఐసెట్‌లో టాప్-10 ర్యాంకర్లు వీరే..

విద్యార్థి	జిల్లా	ర్యాంకు
తపాలా జగదీష్ కుమార్‌రెడ్డి	తిరుపతి	1
వేదాంత సాయి వెంకట కార్తీక్	సికింద్రాబాద్	2
పుట్లూరు రోహిత్	అనంతపురం	3
చింతా జ్యోతి స్వరూప్	విజయనగరం	4
కనూరి రేవంత్	విశాఖపట్నం	5
మహమ్మద్ అప్తాబుద్దీన్	పశ్చిమ గోదావరి	6
దేవరపల్లి దేవ్ అభిషేక్	విశాఖపట్నం	7
జమ్ము ఫణీంద్ర	కాకినాడ	8
పి. రోహన్	బాపట్ల	9
ఏ. మహాలక్ష్మి	పశ్చిమ గోదావరి	10

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 44,343 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 41,799 (94.26 శాతం) మంది అర్హత సాధించారు. అబ్బాయిలు 24,864 మంది దరఖాస్తు చేసుకోగా.. 22,290 మంది హాజరయ్యారు. 21,041 (94.39 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే, అమ్మాయిలు 24,298 మంది దరఖాస్తు చేసుకోగా, 22,053 మంది హాజరయ్యారు. ఇందులో 20,758 (94.26 శాతం) మంది అర్హత సాధించారు.

ఐదు మార్కులు అదనం

ఇక ఏపీ ఐసెట్‌లో మొత్తం 2,400 అభ్యంతరాలు వచ్చాయి. ఇందులో కేవలం ఐదు అభ్యంతరాలను మాత్రమే పరగణనలోకి తీసుకుని వాటికి జవాబు రాసిన విద్యార్థులకు ఐదు మార్కులు అదనంగా కలిపినట్లు ఏపీ ఐసెట్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ పి. మురళీకృష్ణ తెలిపారు.

ఉన్నత విద్యలో సంస్కరణలు..

ఫలితాల విడుదల అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరీక్షలన్నీ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. తొలిసారి ఏపీ ఐసెట్ బాధ్యతలు ఎస్కేయూకు అప్పగించామని, యూనివర్సిటీ పటిష్టంగా నిర్వహించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం చేస్తున్న ఖర్చును నైపుణ్య, మానవవనరులల అభివృద్ధిపై పెట్టుబడిగా పరిగణిస్తోందన్నారు. జాబ్ ఓరియంటెడ్ కోర్సులు, నూతన విద్యావిధానం, ఉన్నత విద్యలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతి విద్యార్థి ప్రపంచ స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. ఫలితంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల చేరిక, ఉత్తీర్ణత శాతం పెరుగుతోందన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ఏ. మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ఏపీ ఐసెట్ కో-కన్వీనర్లు రాంగోపాల్, రఘునాథరెడ్డి, శోభాలత, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఓ విశ్వాసులారా! మీలో ఎవరూ ఇతరులెవరినీ ఎగతాళి చేయరాదు. బహుశా వారే శ్రేష్ఠులు కావచ్చు!
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 16 జూన్ 2023

మనం మారాల్సిందే!

గణాంకాలు వాస్తవ పరిస్థితికి సూచికలు. అనేక సందర్భాల్లో భవిష్యత్ దృశ్యాన్ని ముందుగా కళ్ళ ముందు నిలిపి, గాఢనిద్ర నుంచి మేల్కొలిపే అలారం మోతలు. భారతదేశంలో మధుమేహ రోగుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందనీ, అధిక రక్తపోటు సహా జీవనశైలి వ్యాధుల బారిన పడే వారి సంఖ్య అధికమవుతోందనీ తాజా దేశవ్యాప్త సర్వే వెల్లడించిన అంశాలు అలాంటివే. లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఈ సర్వేలోని అనేక విషయాలు ఇటు ప్రజల్నీ, అటు ప్రభుత్వాలనూ అప్రమత్తం చేస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న మధుమేహం, స్థూలకాయం, అధిక రక్తపోటు లాంటి జీవనశైలి వ్యాధులపై తక్షణ కార్యాచరణ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి.

మధుమేహం, అసాంక్రమిక వ్యాధుల (ఎన్సీడీ)పై అతి పెద్ద సర్వే ఇది. ఇందులో 2008 నుంచి 2020 మధ్యకాలంలో దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 20 ఏళ్ళు, ఆ పైబడిన వయసువాళ్ళను దాదాపు 1.13 లక్షల మందిని సర్వే చేశారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిధులతో భారత వైద్య పరిశోధన మండలితో కలసి మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్ ఈ అధ్యయనం నిర్వహించింది. ఈ సర్వేలో వెల్లడైన అంశాలు ఆందోళన రేపుతున్నాయి. 2017లో భారతీయుల్లో 7.5 శాతం మందికే మధుమేహం ఉండేది. 2021 నాటికి ఆ సంఖ్య 11.4 శాతానికి, మరో మాటలో 10.1 కోట్ల మందికి పెరిగింది. అలాగే 15.3 శాతం మంది, అంటే 13.6 కోట్ల మంది మధుమేహం వచ్చే ముందస్తు లక్షణాలతో జీవితం సాగిస్తున్నారు. అంటే 'టైప్–2 డయాబెటిస్' అన్న మాట. ఇక, దేశంలో 28.6 శాతం (25.4 కోట్ల మంది) సాధారణ స్థూలకాయంతో, 39.5 శాతం (35.1 కోట్ల మంది) ఉదర ప్రాంత స్థూలకాయంతో ఉన్నట్టు తేలింది. చెడ్డ కొవ్వు (ఎల్డీఎల్ కొలెస్ట్రాల్)తో 18.5 కోట్ల మంది అనారోగ్యం పాలవుతున్నారు. నూటికి 35.5 మందిని అధిక రక్తపోటు వేధిస్తోంది.

అసాంక్రమిక వ్యాధులు దేశంపై ఎంతటి భారం మోపుతున్నాయో కనుగొనేందుకు గాను దేశంలోని ప్రతి రాష్ట్రాన్నీ అధ్యయనంలో భాగం చేసిన తొలి విస్తృత స్థాయి అధ్యయనం ఇది. దేశంలో ఎక్కువగా మధుమేహం ఉన్న రాష్ట్రాలు – గోవా (26.4 శాతం), పుదుచ్చేరి (26.3 శాతం), కేరళ (25.5 శాతం). అలాగే, షుగర్ వ్యాధిపీడితులు తక్కువగా ఉన్న ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, అరుణాచల్ ప్రదేశ్‌లలో సైతం వ్యాధిపీడితుల సంఖ్య సత్వరన పెరిగే అవకాశం ఉందని ఈ అధ్యయనం హెచ్చరిక. ముందుగా అనుకున్నదాని కన్నా భారత జనాభాలో మధుమేహం అధికంగా ఉందని ఈ సర్వేతో తేలిందని పరిశోధకులు చెబుతున్నారు. 'ఇది గడియారం ముల్లు ముందుకు కదులుతున్న టైమ్ బాంబ్' అని ఈ అధ్యయన సారథి అంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ప్రపంచంలో ప్రతి 11 మంది వయోజనుల్లో ఒకరిని మధుమేహం పీడిస్తోందని లెక్క. షుగర్‌తో గుండె పోటు, అంధత్వం, కిడ్నీల వైఫల్యం ముప్పుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చేస్తున్న హెచ్చరిక సరేసరి. ఈ నేపథ్యంలో కాయకష్టం, క్రమబద్ధమైన జీవనశైలి ఉండే గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే, ఆధునిక జీవనశైలి నిండిన పట్టణాల్లోనే మధుమేహం ఎక్కువగా ఉందనేది ఈ అధ్యయన ఫలితం. ఇది ఓ కీలక సూచిక. మనం మార్చుకోవాల్సింది ఏమిటో చెప్పకనే చెబుతున్న కరదీపిక. మధుమేహం, అధిక రక్తపోటు, స్థూలకాయం వగైరా వంశపారంపర్యం, ఆహారపుటలవాట్లు, జీవనశైలి ద్వారా వస్తాయనేది నిపుణుల మాట. జన్యుపరంగా కుటుంబంలోనే ఉంటే ఏమో కానీ, ఇతరులు మాత్రం తినే తిండి, బతికే తీరులో జాగ్రత్తల ద్వారా ఈ అనారోగ్యాలు రాకుండా జాగ్రత్తపడవచ్చు. ఒకవేళ వచ్చినా... జీవనశైలి మార్పులతో యథాపూర్వ ఆరోగ్యాన్ని పొందవచ్చు. వైద్యులు పదేపదే చెబుతున్న సంగతే తాజా అధ్యయనం సైతం తేల్చింది. ఈ మాటను ఇకనైనా చెవికెక్కించుకోవాలి.

మారిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడు అనివార్యంగా జీవన శైలి మారింది. అది మన ఆహారపుటలవాట్లలో మార్పు తెచ్చింది. చివరకు తెలియకుండా మన ఆరోగ్యాన్ని మనమే బలిపెట్టుకొనే దశకు చేరుకున్నాం. అందుకే ఇకనైనా అనారోగ్యం తెచ్చే ఆహారపుటలవాట్లు, జీవనశైలి సహా అనేకం మనం మార్చుకోవాలి. మరోపక్క అందుకు తగ్గట్టు ప్రజల్లో చైతన్యం పెంచే బాధ్యత ప్రభుత్వాల పైనా ఉంది. అది ఈ అధ్యయనం చెబుతున్న పాఠం. అలాగే, దేశంలో ఆరోగ్య రక్షణ రంగంలో చేయాల్సిన ప్రణాళిక, చేపట్టాల్సిన చర్యలకు ఈ తాజా సర్వే ఫలితాలు మార్గదర్శకమే. అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో మధుమేహ ధోరణి ఒక స్థిరీకరణ దశకు చేరుకుంటే, అనేక ఇతర రాష్ట్రాల్లో అది పెరుగుతోంది. ఫలితంగా ఆయా రాష్ట్రాల తక్షణ చర్యలకీ అధ్యయనం ఉపకరిస్తుంది.

మరోపక్క అన్నిచోట్లా, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య వసతులు మరింత అందుబాటులో ఉండేలా చూడాలి. ఫాస్ట్‌ఫుడ్ మోజు, సోమరితనం వల్ల పిల్లల్లోనూ జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న వేళ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు ముఖ్యం. ఆరోగ్యకరమైన తిండి, శారీరక శ్రమ వల్ల టైప్–2 మధుమేహాన్ని నూటికి 60 కేసుల్లో తగ్గించవచ్చట. అందుకని ప్రభుత్వాలు పౌరసరఫరా వ్యవస్థ ద్వారా చిరుధాన్యాలు పంపిణీ చేసి, ప్రజలను ఆరోగ్యదాయక ఆహారం వైపు మళ్ళించవచ్చు. ప్రజల్ని అటువైపు ప్రోత్సహించడంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలూ చైతన్యశీల పాత్ర పోషించాలి. ఈ జీవనశైలి వ్యాధులు జాతిని నిర్వీర్యం చేసి, అభివృద్ధిని కబళించే ప్రమాదం పొంచి వుంది గనక తక్షణమే తగిన విధానాల రూపకల్పన అవసరం. పరిస్థితులు చేయి దాటక ముందే నష్ట నివారణ చర్యలకు నడుంకట్టడం వివేకవంతుల లక్షణం.

మన ప్రజాస్వామ్యం కాగితపు పులా?

విశ్లేషణ



మల్లెపల్లి లక్ష్మయ్య

ఉదార ప్రజాస్వామ్య సూచికలో మన దేశం 97వ స్థానంలో, ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థల్లో 108వ స్థానంలో ఉందని 'వి–డెమ్' నివేదిక చెబుతోంది. బయటి ప్రపంచంలో ప్రజాస్వామ్యం అంటే భావప్రకటనా స్వేచ్ఛ, ఓటు ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యం లాంటి అంశాలు పరిగణనలోకి వస్తాయి. కానీ భారత్ లాంటి దేశంలో ప్రభుత్వాల విధానాలు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని నిర్ణయించలేవు. వేల సంవత్సరాలుగా పాతుకుపోయిన కుల వ్యవస్థ ఈ దేశ పాలననూ, ప్రగతినీ నిర్ణయిస్తున్నది. ప్రజాస్వామిక విధానాలకు ఊతం ప్రజల భావాల్లో ఉంది. కులవ్యవస్థను నిర్మూలించే దిశగా ఒక బలమైన ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళకపోతే, ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఒక కాగితపు పులిగా మాత్రమే మిగిలిపోతుంది.

భారతదేశం పెద్ద ప్రజాస్వామ్య దేశం. మానవ హక్కులూ, ప్రజాస్వామ్య భావాలూ, సమానత్వ అంశాలూ మేళవింపుగా ఉన్న ఆధునిక రాజ్యాంగం కలిగిన దేశం కూడా. అయితే ఇటీవల ప్రజాస్వామ్య దేశం తన ఉదార ప్రజాస్వామ్య వ్యవస్థ నుంచి నియంతృత్వ పోకడలకు దగ్గరవుతున్నట్టు, 'వి–డెమ్' తన పరిశోధనలో తేల్చింది. ఉదార ప్రజాస్వామ్య సూచికలో మన దేశం 97వ స్థానంలో, ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థల్లో 108వ స్థానంలోకి వెళ్ళింది. మత స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, మహిళా స్వేచ్ఛ, ఆదిమ తెగలు, ఇతర వర్గాలకు సంబంధించిన స్వేచ్ఛల్లో మనం ఇతర దేశాలకన్నా వెనుకబడి ఉన్నామన్న విషయాన్ని చాలా మంది చాలాసార్లు ప్రస్తావించారు.

బయటి ప్రపంచంలో ప్రజాస్వామ్యం అనగానే ఒక ఐదారు అంశాలు ప్రస్తావనకు వస్తాయి. భావప్రకటనా స్వేచ్ఛ, ఓటు ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకునే స్వేచ్ఛతో పాటు పత్రికా స్వాతంత్ర్యం లాంటి అంశాలు పరిగణనలోకి వస్తాయి. స్వీడన్ విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వి–డెమ్ (విభిన్న ప్రజాస్వామ్యాలు) సర్వే కూడా ప్రభుత్వ పాలనకు సంబంధించిన అంశాలనే పేర్కొంటుంది. అయితే భారత్ సహా మరికొన్ని దక్షిణాసియా దేశాలలో ఈ పరిశీలన మాత్రమే సరిపోదు. ఇక్కడ ప్రభుత్వాల విధానాలు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని నిర్ణయించలేవు. వేల సంవత్సరాలుగా పాతుకుపోయిన కుల వ్యవస్థ ఈ దేశ పాలననూ, ప్రగతినీ నిర్ణయిస్తున్నది.

మూల కారణం

ప్రస్తుతం మన దేశంలో మోదీ పాలన నియంతృత్వాన్ని అమలు చేస్తున్నదనే విషయం ఎక్కువగా చర్చకు వస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతున్నది. రాజ్యాంగ విలువలకు స్థానం లేకుండా పోతున్నది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో, ముఖ్యంగా ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీని విధించి అణచివేతను కొనసాగించారు. కానీ ఇందిరాగాంధీ నియంతృత్వానికీ, మోదీ నియంతృత్వానికీ గుణాత్మకమైన తేడా ఉన్నదన్న విషయాన్ని గమనించాల్సి ఉంది. ఇందిరాగాంధీ తన పాలనను కాపాడుకోవడానికి తాత్కాలికంగా నిర్బంధాన్ని అమలు జరిపారు. తదనంతరం తన తప్పు తెలుసుకొని ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు. మోదీ పాలన ప్రజాస్వామ్యాన్ని పాతరేసి, ప్రజలను విభజించి, రాజ్యాంగం ప్రకటించిన 'మేమంతా భారతీయులం' అనే భావనకు చరమగీతం పాడుతున్నది. రెండువేల సంవత్సరాలకు పైగా కొనసాగుతున్న కుల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి కావాల్సిన చర్యలన్నింటినీ తీసుకుంటున్నది.

అయితే మోదీకి గానీ, భారతీయ జనతా పార్టీకి గానీ ఆ ధైర్యం కలగడానికి, అంత బహిరంగంగా రాజ్యాంగాన్ని ఉల్లంఘించడానికి పునాది ఇక్కడి కుల వ్యవస్థలో ఉంది. దానితో పాటు రోజురోజుకీ



గుత్తాధిపత్యం వైపు వెళ్ళిపోతున్న ఆర్థిక వ్యవస్థ. ఇప్పుడు ఏర్పడిన ఈ ప్రమాదాన్ని రాజ్యాంగ ముసాయిదాను సమర్పించిన 1949 నవంబర్ 25 రోజున బాబాసాహెబ్ అంబేడ్కర్ బహిరంగంగా దేశం ముందుంచారు. ''ఒక మనిషి, ఒక ఓటు, ఒక విలువ ద్వారా మనం రాజకీయ సమానత్వాన్ని సాధించాం. కానీ సామాజిక, ఆర్థిక రంగాల్లో ఇంకా ఆ తేడాలు కొనసాగుతూనే ఉన్నాయి. సాధ్యమైనంత త్వరలో ఆ వ్యత్యాసాలను తొలగించుకోకపోతే, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది'' అంటూ ఆనాడు చేసిన హెచ్చరిక ఈరోజు మరింత సత్యంగా కనపడుతున్నది.

సోదరభావం కీలకం

ఇతర దేశాల ప్రజాస్వామ్య భావనకూ, భారత దేశంలోని ప్రజాస్వామ్య అవగాహనకూ తేడా ఉన్న విషయాన్ని కూడా అంబేడ్కర్ స్పష్టంగా చెప్పారు. 1936లో రాసిన కుల నిర్మూలనలోనే ఆయన తన ఆలోచనలను ప్రపంచం ముందు పెట్టారు. ప్రజాస్వామ్యం అనగానే అది ఎన్నికలు, పాలన, ప్రభుత్వాల విధానాలు అని అనుకోవడం పొరపాటనీ, అది ప్రజల మధ్య ఉండే సంబంధాలను నిర్వచిస్తుందనీ కూడా అంబేడ్కర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి మూడు ముఖ్యమైన అంశాలను పేర్కొన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం కీలకమని చెపుతూ, ఇందులో అత్యంత ముఖ్యమైనది సోదరత్వం అంటారు. ఇది భారత దేశంలో కొరవడిన అంశమని తేల్చారు.

గత డెబ్బై అయిదు సంవత్సరాలుగా అటు కాంగ్రెస్ గానీ, ఇతర పార్టీలు గానీ అంబేడ్కర్ హెచ్చరికలను పట్టించుకోలేదు. కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది. కులవ్యవస్థను నిర్మూలించే ఎటువంటి ప్రయత్నాన్ని గానీ, ప్రణాళికను గానీ కాంగ్రెస్ తన సుదీర్ఘ పాలనలో ఏనాడూ చేయలేదు. కేవలం ఆర్థిక తోడ్పాట్ల వంటివి మాత్రమే ఈ దేశంలో దళితులు, ఆదివాసుల జీవితాల్లో సమూలమైన మార్పులు తీసుకురాలేవనీ, కులవ్యవస్థను కూకటి వేళ్ళతో పెకిలించగలిగే పక్కా ప్రణాళిక అవసరమనీ గుర్తించడంలో కాంగ్రెస్ వైఫల్యం చెందింది. అదే ఇప్పుడు బీజేపీకి ఆయుధంగా మారింది.

ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోకూడదు. భారత దేశంలో ప్రభుత్వాల కన్నా ప్రజలే బలవంతులు. ప్రజల్లో తరతరాలుగా నాటుకొని పోయిన కుల వ్యత్యాసాలు, కుల అసమానతలు ఇక్కడి ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధం. గత పదేళ్ళలో ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో బీజేపీ ప్రభుత్వం మనగలుగుతుందంటే కులాలలోని విభేదాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడమే. దానితో పాటు, హిందూ మతంలోని పలు అంశాలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నది. గ్రామాల్లో ఏ కులాలైతే ఆధిపత్యంలో ఉన్నాయో వాటిని తమ బలంగా మార్చుకోవడం, అత్యధిక జనాభా కలిగిన కులాలను సమీకరించడం చూస్తే బీజేపీ ఎత్తుగడ ఏమిటో అర్థం చేసుకోవడం సులభం అవుతుంది.

అదే సమయంలో గత వందల ఏళ్ళుగా ముస్లింలు, హిందువుల మధ్య ఉన్న వైషమ్యాలను ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో చాలా బలంగా వాడుకుంటున్నది. ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయిన మాట నిజమే కానీ, దాని బలమేమీ తగ్గలేదు. కులాల పట్ల ప్రజల్లో ఉన్న భావాలను రెచ్చగొట్టడం ఇటీవలి కాలంలో ప్రభుత్వాల విధానాల్లో, న్యాయస్థానాల తీర్పుల్లో స్పష్టంగా కనపడుతున్నది. ఇటీవల దళితుల్లో పెరిగిన చైతన్యం అత్యాచారాల విషయంలో కేసులు నమోదు కావడానికి ఉపయోగపడింది. ఎస్సీ, ఎస్టీల కేసుల విషయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధిపత్య కులాలకు అండగా నిలబడే ప్రయత్నం చేసింది బీజేపీ. తమ పార్టీ పునాదిగా ఉన్న ఆధిపత్య కులాలను మరింత సంతృప్తి పరిచేందుకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల పేరుతో అసలు రాజ్యాంగాన్నే అపహాస్యం చేసింది.

చివరగా ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఈ దేశంలో ఉదారవాద ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పాలన వంటి విధానాలు ఏవి అమలు జరగాలన్నా కుల వ్యవస్థ ప్రధానమైన అవరోధం. దీనికి ప్రభుత్వాల బాధ్యత కన్నా, ప్రజల్లో కుల భావనలను తొలగించడం ముఖ్యం. ప్రజల్లో కుల అసమానతల పట్ల సానుకూలత ఉన్నంత వరకూ, గ్రామాల్లో ఇంకా ఈ కులవ్యవస్థ కొనసాగుతున్నంత వరకూ ప్రజాస్వామ్యమనే భావనకు ఆస్కారమే లేదు. తాత్కాలికంగా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామిక విధానాలకు ఊతం ప్రజల భావాల్లో ఉంది. అంబేడ్కర్ చెప్పినట్టు, ప్రజాస్వామ్యం, అంటే సమానత్వంతో కూడిన సామాజిక జీవన గమనం కోసం... ప్రభుత్వాల నిర్బంధాలు, నియంతృత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే... ప్రజల్లో ఉన్న కులవ్యవస్థను నిర్మూలించే దిశగా ఒక బలమైన ప్రజాస్వామ్య ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళకపోతే, ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఒక కాగితపు పులిగా మాత్రమే మిగిలిపోతుంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు I మొబైల్: 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇప్పుడే ఇలా ఉంటే...



రాజస్థాన్ నుంచి రోత పుట్టించే కథనాలు వచ్చాయి. పోలీసుల సమక్షంలో యువ ఐపీఎస్ అధికారులు హోటల్ స్టాఫ్‌ను కొట్టారు. ఇద్దరూ 2019 బ్యాచ్‌కు చెందినవారు. అపరాధులు సస్పెండ్ అయ్యేలా సంబంధిత నాయకులు కల్పించుకోవాలి. ముస్సోరీలోని ఎల్బీఎస్ అకాడెమీ వారికి ఏం నేర్పుతోంది? యూపీఎస్సీలో ఎథిక్స్ పేపర్ ఉంటే?

– పుష్పేశ్ పంత్, హిస్టారియన్

వాస్తవం చెబితే...



ల్యాబ్ నుంచి కోవిడ్ వైరస్ లీక్ అయివుండొచ్చని సూచించడం కూడా జాత్యహంకారం అనడాన్ని గుర్తుతెచ్చుకోండి. చూస్తుంటే ఇప్పుడదే ఏకాభిప్రాయంలా కనబడుతోంది.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్

ఏమీ జరగదా?



ఢిల్లీ పోలీసులు 'పోక్సో' ఎఫ్ఐఆర్ మూసేయాలని అడగడం ద్వారా, బ్రిజ్ భూషణ్‌కూ, ప్రభుత్వానికీ కావాల్సినంత ఊపిరి పీల్చుకునే వీలు కల్పించారు. ఇతర ఆరోపణలు బెయిల్ ఇవ్వదగినవే. ఇక న్యాయ పోరాటం ఎంత సుదీర్ఘంగా సాగుతుందో మనకు తెలుసు.

– హరీందర్ బవేజా, జర్నలిస్ట్

వదిలించుకో!



గట్టి దెబ్బలు తిన్న తర్వాత వెంచర్ క్యాపిటల్‌లో నేను నేర్చుకున్న ఒక పాఠం ఏమిటంటే, 'ఎప్పటికీ ఒక చెడ్డ వ్యక్తితో మంచి ఒప్పందం కుదుర్చుకోలేవు'. ఒక మనిషి విషపూరితమైనవాడు అని ఎప్పుడైతే గుర్తిస్తావో అతడిని వదిలెయ్. జీవితం చాలా చిన్నది.

– వెంకీ గణేశన్, ఆంత్రప్రెన్యూర్

అందువల్లే అయ్యాను



మీరు ఇంత చదువుకుని, ఎంబీయే చేసి నటి ఎందుకయ్యారని జనాలు కొందరు అడుగుతుంటారు. అరే... సృజన అనేది మన మెదడులోని గ్రంథాలయం నిర్వహించే కార్యం కదా!

– సౌమ్యా టాండన్, నటి

ఇన్‌బాక్స్

గోప్యతా హక్కు హాంబక్కు!

ప్రజలకు కరోనా టీకా అందించడానికి ఉపయోగించిన 'కోవిన్' యాప్ నుండి వ్యక్తుల వివరాలన్నీ లీక్ అయ్యి 'టెలిగ్రామ్' యాప్‌లో ప్రత్యక్ష మయ్యాయన్నది నడుస్తోన్న వివాదం. అధికారిక ఖాతా నుండే ఇలా వివరాలు బజారులోకి ప్రవహిస్తే... సమాచార గోప్యతకు, డాటా రక్షణకు పూచీ ఏమిటన్నది అందరి ఆందోళన. 'అలా కోవిన్ ద్వారా లీక్ కాలేదు... ఆ వివరాలన్నవి ముందే లీక్ అయి ఉండొ' చ్చన్నది ప్రభుత్వ వివరణ. ఎలా అయినా సరే ఒకటి మాత్రం నిజం. ప్రస్తుత అంతర్జాల యుగంలో సైబర్ స్పేస్‌లో డాటాకి ఎలాంటి భద్రతా లేదు. ఒక ప్లాట్ ఫామ్ కాకపోతే మరొకటి. ప్రభుత్వానిది కాకపోతే ప్రయివేట్‌ది. ఎలా చూసినా వ్యక్తిగత సమాచారం అన్నది రక్షణ, భద్రత లేనిది. ఒకసారి సైబర్ స్పేస్‌లోకి వెళ్లిన సమాచారం వీధిలో ఉన్నట్టే. అయితే అలా జరగకుండా ఉండడానికి ప్రభుత్వం చెయ్యవలసినదంతా చెయ్యాలి. అనుమతి లేకుండా, ఒకరి సమాచారం వీధిలో పెడితే బాధ్యుల్ని శిక్షించాలి. ఆ దిశగా ప్రయత్నాలు వేగంగా జరగడం లేదన్నదే ఆందోళన.

2017లో సుప్రీం కోర్టు వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచుకోవడం పౌరుల ప్రాథమిక హక్కుగా గుర్తించింది. అంటే ఆ హక్కుని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ తీర్పు స్ఫూర్తితో డాటా పరిరక్షణ చట్టం ఇప్పటికే అమలులో ఉండాల్సింది. అయితే అలా జరగలేదు. ఐదు సంవత్స రాలు గడుస్తున్నా సంబంధిత బిల్లు పార్లమెంట్ మెట్లెక్కలేదు. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అయినదానికీ, కానిదానికీ వ్యక్తుల వివరాలన్నీ వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. వాటిని జాగ్రత్త పరిచే బాధ్యత, భయం ఆ సంస్థలకు లేదు. దుర్వినియోగం చేసినా ఏమీ చెయ్యలేని స్థితి లేదా చిన్నచిన్న శిక్షలు జరిమానాలతో సరి. ఇప్పుడున్న స్థితిలో అంతర్జాతీయ సంస్థలు తప్పు చేసినప్పుడు కట్టడి చెయ్యడం అసాధ్యం. కాబట్టి డాటా పరిరక్షణ చట్టం వెంటనే పట్టాలకెక్కాలి. యూరోప్ దేశాలు మంచి పకడ్బందీ చట్టాన్ని అమలు చేస్తున్నాయి. వాటన్నిటినీ పరిశీలించి మనదేశం కూడా సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పరుచుకోవాలి. అన్ని లావాదేవీలకూ, వ్యవహారాలకూ సైబర్ స్పేస్ కీలకమైనవేళ, అది సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రమాదం.

– డా॥ డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

ఈ మద్దతు ధరలు... అశాస్త్రీయం

సందర్భం



సారంపల్లి మల్లారెడ్డి

2023–24 ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర క్యాబినేట్ ఇటీవల 23 పంటలకు మద్దతు ధరలను ప్రకటించింది. గత ఏడాది నిర్ణయించిన మద్దతు ధరలకు అదనంగా క్వింటాల్ వరి ధాన్యానికి 143 రూపాయలు పెంచి రూ. 2,346గా, వేరుశనగకు రూ. 527 పెంచి రూ. 6,904లుగా మద్దతు ధరలు నిర్ణయించినట్లు సగర్వంగా ప్రకటించింది. నిజానికి మోదీ ప్రభుత్వం ప్రకటించిన ఈ మద్దతు ధరలకు శాస్త్రీయత లేదు. 29 రాష్ట్రాల్లో ఉత్పత్తి ఖర్చుల్లో తేడాలు ఉంటాయి. కాబట్టి దేశ సగటు పెట్టుబడిని లెక్కగట్టి, అందులో 50 శాతాన్ని సగటు పెట్టుబడికి కలిపి ఏ పంటకైనా మద్దతు ధర నిర్ణయించాలి. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సగటు పెట్టుబడికి యాభై శాతాన్ని కలపకుండానే మద్దతు ధర ప్రకటించారు. ఈ ఏడాది కూడా ఇదే మోసపూరిత విధానాన్ని అనుసరించి పంటలకు మద్దతు ధర ప్రకటించింది కేంద్రం. ఈ మద్దతు ధరలకు పంటలను ప్రభుత్వ సంస్థలు ఎఫ్‌సీఐ, సీసీఐ, నాఫెడ్ కొనుగోలు చేయాలి. 'వ్యవసాయ ఖర్చులు, ధరల నిర్ణాయక సంఘం' (సీఏసీపీ) సూచనలను గత 9 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం పాటించడం లేదు.

రాజ్యాంగం రీత్యా వ్యవసాయోత్పత్తుల ధరలను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించి అమలు చేయాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను నిర్ణయించడం లేదు. కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కూరగాయలతో సహా పండ్లకు కూడా ధరలను నిర్ణయించి అమలు చేస్తున్నాయి. కర్ణాటక, కేరళ రాష్ట్రాలు ధాన్యంపై బోనస్ ప్రకటించి సేకరిస్తున్నాయి. ఆ లోటును తమ బడ్జెట్ నుండి భరిస్తున్నాయి.

కనీస మద్దతు ధరలు శాస్త్రీయంగా లేకపోవడమేగాక, ప్రకటించిన ధరలు కూడా మార్కెట్‌లో అమలు కావడం లేదు. పంటల కోత కాలంలో మార్కెట్ కమిటీలు, మధ్య దళారీలు కుమ్మక్కై రైతులను వేలకోట్ల రూపాయల మేర నష్ట పరుస్తున్నారు. నాణ్యతా ప్రమాణాల పేరు చెప్పి ధరలు దిగగోస్తున్నారు. మద్దతు ధరలు నిర్ణయించేటప్పుడే కేంద్రం ప్రతి వ్యవసాయోత్పత్తికీ నాణ్యతా ప్రమాణాలు కూడా నిర్ణయిస్తున్నది. ఆ ప్రమాణాలను శాస్త్రీయంగా పరిశీలించి రైతులకు మద్దతు ధరలు లభించే విధంగా చూడాలి.



ఒకవైపున ఉపకరణాల ధరలు పెంచి రైతులకు పెట్టుబడి పెంచుతున్నారు. మరోవైపున ఉత్పత్తి అయిన పంటల ధరలు తగ్గించి మధ్య దళారీలు, పెట్టుబడి దారులు లాభాలు సంపాదిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ సబ్సిడీలు తగ్గించి రైతులను భారాలకు గురి చేస్తోంది. పంటలు గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ఉత్పత్తిపై దృష్టి తగ్గిస్తున్నారు. ఫలితంగా వంటనూనెలు, పప్పు ధాన్యాలు, ముతక ధాన్యాల ఉప ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, ఇతర దేశాల నుండి లక్షల కోట్ల విలువ కలిగినవి దిగుమతులు చేసుకుంటున్నాం.


దేశ రైతాంగానికి లాభాలు కలిగించకున్నా... పెట్టిన పెట్టుబడి రావడానికి వీలుగా పెట్టుబడిపై 50 శాతం కలిపి ధరలు నిర్ణయించాలని స్వామినాథన్ కమీషన్ 2006లో ప్రకటించింది. నేటికి 13 సంవత్సరాలు గడిచినా స్వామినాథన్ సిఫారసులు అమలుకు నోచలేదు. అదే సందర్భంలో అంతర్జాతయ మార్కెట్ పోటీలో భారత రైతు నిలబడలేకపోతున్నారు. అమెరికా, జర్మనీ, జపాన్, కెనడా లాంటి దేశాలు తమ బడ్జెట్‌లో 7 శాతానికి పైగా రాయితీలు ఇచ్చి అక్కడి రైతులను కాపాడుకుంటున్నాయి. అమెరికాలో 100 పంటలకు మద్దతు ధరలు నిర్ణయించుకున్నారు. మద్దతు ధరలకు తక్కువ అమ్మకాలు జరిగితే ఆ లోటును బడ్జెట్ ద్వారా భర్తీ చేస్తున్నారు. 'మార్కెట్ జోక్యం' పథకం పేరుతో గతంలో ప్రభుత్వం బడ్జెట్‌లో కొంత కేటాయింపు చేసినా ప్రస్తుతం ఆ బడ్జెట్‌ను పూర్తిగా రద్దు చేశారు.

గత సంవత్సరం 11 మాసాలు కోట్ల మంది రైతులు పోరాటం చేసి సాధించుకున్న మద్దతు ధరల లక్ష్యాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం వమ్ము చేసింది. కనీసం తన ప్రభుత్వంలోని శాఖ సీఏసీపీ సూచించిన ధరలను కూడా అమలు జరపకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పునరాలోచించి శాస్త్రీయంగా ధరలను నిర్ణయించి అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రైతు నిలబడే విధంగా చర్యలు చేపట్టాలి. కార్పొరేట్లకు, మధ్య దళారీలకు లాభాలు కట్టబెట్టడం కాకుండా దేశంలోని 14.57 కోట్ల కుటుంబాలకు, వారిపై ఆధారపడిన వ్యవసాయ కార్మికులకు ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి.

వ్యాసకర్త ఏఐకెఎస్ సీనియర్ నాయకులు

సాకారం అవుతున్న స్వప్నం

అభిప్రాయం



డా॥ టి. షారోన్‌రాజు

ప్రతీ వ్యక్తి జీవితంలో పాఠశాల విద్య ఎంతో కీలకమైనది. వ్యక్తి ఉన్నతికీ, భవిష్యత్ నిర్మాణానికీ పునాది రాయిగా పాఠశాల విద్య నిలుస్తుంది. రాష్ట్రంలో ప్రతీ చిన్నారినీ విద్యావంతునిగా తీర్చిదిద్దే దిశగా గత నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం త్రికరణశుద్ధిగా పనిచేస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి ప్రక్షాళన ప్రారంభించింది. 'నాడు–నేడు' పథకంతో ప్రభుత్వ పాఠశాలల స్వరూపాన్ని పూర్తిగా మార్చివేసింది. తల్లి ఖాతాలో రూ. 15 వేలు జమచేస్తూ పిల్లలను పనికి వద్దనీ, బడికి వెళ్లాలనే సిద్ధాంతాన్ని కార్యరూపంలో చూపింది 'అమ్మ ఒడి'.

విద్య పేదవారికి భారం కారాదనే భావనతో 'జగనన్న విద్యాకానుక' పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతీ విద్యార్థికీ అవసరమైన యూనిఫాం, పుస్తకాలు వంటి సమస్తం సమకూరుస్తున్నారు. ఇప్పటికే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా బైజూస్ కంటెంట్‌ను, ట్యాబ్‌లతో ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... పాఠశాల స్థాయిలో ఆంగ్ల భాషపై పట్టు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి టోఫెల్ శిక్షణ అందించాలనే ప్రయత్నం చేస్తోంది. దీనికోసం పాఠశాల అధ్యాపకులను అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీకి పంపి శిక్షణ అందించనున్నారు. ఇటువంటి నిర్ణయాలు దీర్ఘకాల దార్శనికతతో తీసుకున్న నిర్ణయాలుగా మనం గ్రహించాలి.



ఇంటర్ విద్యను బలోపేతం చేయాలనే సదుద్దేశంతో ప్రతీ మండలంలో రెండు జూనియర్ కళాశాలలు ఏర్పాటు కావాలని, వీటిలో ఒకటి ప్రత్యేకంగా బాలికలకు ఉండాలనే నిర్ణయం బాలికా విద్యకు, సాధికారతకు ఎంతగానో దోహదపడుతుంది. పరీక్షలో తప్పిన విద్యార్థులు అంతటితో విద్యకు దూరం కాకుండా జగనన్న ప్రభుత్వం మరొక మంచి నిర్ణయం తీసకుంది. పది, ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులు తిరిగి అదే తరగతిలో చదువుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం ముదావహం.

ప్రతీ విద్యార్థి అవసరాలను తెలుసుకుని పెద్దమనసుతో పరిశీలించి, వసతులను కల్పిస్తూ అక్షరాంధ్రప్రదేశ్‌ను నిర్మించే దిశగా ప్రభుత్వం సఫలీకృతం అవుతోంది. విద్యారంగానికి పెద్దపీట వేస్తూ, పాఠశాల విద్యను బలోపేతం చేస్తూ పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, ఆచరణలు భవిష్యత్తులో మంచి ఫలితాలను అందిస్తాయి. భవిష్యత్ తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి విద్య అని భావించే ముఖ్యమంత్రి నిర్ణయం సంపూర్ణంగా సాకారం అవుతుంది.

వ్యాసకర్త విద్యా విభాగాధిపతి, ఏయూ I 94907 98631

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.8.36 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** కృత్తిక ప.3.25 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.58 వరకు తదుపరి ప.12.26 నుండి 1.19 వరకు, **అమృతఘడియలు:** ప.1.01 నుండి 2.34 వరకు, **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.31.

రూ.242.03 కోట్ల 'మార్గదర్శి' చరాస్తులు అటాచ్



సాక్షి, అమరావతి: ఆర్థిక అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంసీఎఫ్ఎల్)పై మరిన్ని కఠిన చర్యలకు సీఐడీ ఉపక్రమించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు చెందిన రూ.242.03 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు సిద్ధమవుతోంది. వాటిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ 40 మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన పెట్టుబడులు, బ్యాంకుల్లో డిపాజిట్లు కూడా ఉన్నాయి. సీఐడీ వినతి మేరకు హోం శాఖ గురువారం ఇందుకు సంబంధించి అనుమతి జారీ చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొన్నాళ్లుగా చందాదారులకు చిట్టీల మొత్తాన్ని చెల్లించడంలో జాప్యం చేస్తోంది. దీంతో చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సీఐడీ కఠిన చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితమే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన రూ.793.50 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. తాజాగా రూ.242.03 కోట్లతో కలిపి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన మొత్తం రూ.1,035.53 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు సీఐడీ సన్నద్ధమవుతోంది.

అగమ్యగోచరంగా మార్గదర్శి

కేంద్ర చిట్‌ఫండ్ చట్టం, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడుతోందని రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తనిఖీల్లో వెల్లడైంది. ఆ శాఖ ఫిర్యాదు మేరకు సీఐడీ విభాగం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసింది. ఆ సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావును ఏ–1గా, ఎండీ చెరుకూరి శైలజ కిరణ్‌ను ఏ–2గా, బ్రాంచి మేనేజర్లను ఏ–3గా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సీఐడీ అధికారులు చేసిన సోదాల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ దశాబ్దాలుగా పాల్పడుతున్న ఆర్థిక అక్రమాలు ఆధారాలతో సహా బట్టబయలయ్యాయి. మరోవైపు కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని కచ్చితంగా పాటించాలని రాష్ట్ర చిట్స్ రిజిస్ట్రార్ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు స్పష్టం చేశారు. ఆ చట్టం ప్రకారం చందాదారుల సొమ్మును ఇతర అవసరాలకు మళ్లించకూడదు. ఏ బ్రాంచి చందాదారుల సొమ్మును అదే నగరం/పట్టణంలోని జాతీయ బ్యాంకులోని ఖాతాలో జమ చేయాలి. కానీ రామోజీరావు చందాదారుల సొమ్మును హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలించి, అక్కడి నుంచి సొంత కంపెనీలలోకి మళ్లిస్తున్నారు. ఆ సంస్థల ద్వారా మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లలో పెట్టుబడిగా పెడుతున్నారు. ఇది కేంద్ర చట్టానికి విరుద్ధం. కేంద్ర చట్టాన్ని పాటించేందుకు ససేమిరా అంటున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ గత ఏడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలను వేయడంలేదు. దాంతో ఇప్పటికే దాదాపు రూ.400 కోట్ల వరకు టర్నోవర్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో పాత చందాదారులకు చిట్టీ పాటల మొత్తాన్ని చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. దీనిపై ఇప్పటికే పలువురు చందాదారులు చిట్స్ రిజిస్ట్రార్, సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో చందాదారుల హక్కుల పరిరక్షణ కోసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ చరాస్తులను జప్తు చేయాల్సిన అవసరం ఉందని సీఐడీ భావించింది. అగ్రిగోల్డ్ కంపెనీ తరహాలో రాబోయే రోజుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం చేతులెత్తేస్తే చందాదారుల సొమ్మును వారికి తిరిగి చెల్లించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ చరాస్తులను అటాచ్ చేసేందుకు అనుమతి కోరుతూ సీఐడీ త్వరలోనే న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయనుంది.

ఆడిటర్ సహా.. విశాఖ ఎంపీ భార్య, కొడుకు కిడ్నాప్

▶ మొదటి పేజీ తరువాయి

పోలీసులు గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు.

కిడ్నాప్ జరిగింది ఇలా..

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు శరత్ రుషికొండ ప్రాంతంలో తారకరామ లేఅవుట్‌లో ఉంటున్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం కొందరు దుండగులు ఆ ఇంట్లోకి చొరబడ్డారు. లోపల శరత్ ఒక్కడే ఉండడంతో అతడిని నిర్బంధించి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకున్నారు. ఇంకా డబ్బు కావాలని దాడిచేశారు. తన వద్ద లేదని చెప్పినా వినలేదు. దీంతో మరుసటి రోజు బుధవారం శరత్‌తో లాసెన్స్ బే కాలనీలో ఉంటున్న తల్లి జ్యోతికి ఫోన్ చేయించారు. తన ఆరోగ్యం బాగో లేదని, ఇంటికి రావాలని బలవంతంగా చెప్పించారు. అది నిజమని నమ్మిన అతడి తల్లి జ్యోతి కంగారుగా బుధవారం కొడుకు ఇంటికి వచ్చారు. ఆమెను కూడా బంధించి బంగారు నగలను కాజేశారు. భారీగా డబ్బులు కావాలన్న ఉద్దేశంతో ఎంపీతో సన్నిహితంగా ఉండే ఆడిటర్ జీవీకి జ్యోతితో ఫోన్‌చేసి రప్పించారు. జీవీని కూడా నిర్బంధించి రూ.2 కోట్లు కావాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని ముగ్గురి మెడపై కత్తిపెట్టి బెదిరించారు. దీంతో జీవీ తనకు తెలిసిన వారికి ఫోన్‌చేసి రూ.1.75 కోట్లు సమకూర్చి వారికి అందించారు. అయినప్పటికీ వారిని విడిచిపెట్టకుండా ఇంకా డబ్బులు కావాలని కిడ్నాపర్లు డిమాండ్ చేశారు. మధ్యలో ఎంపీ తన కుమారుడు శరత్‌కు ఫోన్‌చేసినప్పటికీ కిడ్నాపర్ల సూచనల మేరకు మామూలుగానే మాట్లాడి ఫోన్ పెట్టేశారు.

ఆడిటర్ ఫోన్ ట్రాక్‌కు ఎంపీ వినతి

ఐటీ రిటర్నుల పనుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న ఎంపీ ఎంవీవీ.. ఆడిటర్ జీవీకి బుధవారం మధ్యాహ్నం నుంచి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయలేదు. అతడి సన్నిహితులకు ఫోన్‌చేయగా.. శ్రీకాకుళం వెళ్లినట్లు చెప్పారు. అక్కడి వారికి ఫోన్‌చేసి ఆరా తీస్తే శ్రీకాకుళం కూడా రాలేదని సమాచారమిచ్చారు. గురువారం ఉదయం కూడా ఫోన్ చేసినప్పటికీ జీవీ స్పందించలేదు. ఒకవైపు రిటర్నుల పనులు, మరోవైపు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో జీవీకి ఏమైందన్న ఆందోళనతో ఎంపీ విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మకు ఫోన్‌చేసి అతని నంబర్‌ను ట్రాక్ చేయాలని కోరారు. వెంటనే పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా జీవీ రుషికొండలోనే ఉన్నట్లు గుర్తించారు. అతని డ్రైవర్‌తో పాటు మరికొంత మంది ద్వారా సమాచారం సేకరించి సాంకేతికత సాయంతో విచారణ చేపట్టారు. దీంతో కిడ్నాప్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

సినీ ఫక్కీలో ఛేజ్ చేసి..

మరోవైపు.. రెండురోజులుగా ముగ్గురిని ఇంట్లోనే నిర్బంధించిన విషయాన్ని పోలీసులు గుర్తించే అవకాశం ఉందని గ్రహించిన కిడ్నాపర్లు వారిని అక్కడ నుంచి విజయనగరం వైపు తరలించేందుకు ప్రయత్నించారు. శరత్‌కు చెందిన ఆడి కారులో వారిని ఎక్కించుకుని పద్మనాభం నుంచి ఎస్.కోట మీదుగా విజయనగరం వెళ్లేందుకు బయల్దేరారు. పోలీసులు అప్పటికే మొబైల్స్, ఇతర టెక్నాలజీల ఆధారంగా ప్రతి ప్రాంతంలోనూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వారు ఆనందపురం మీదుగా పద్మనాభం వైపు వెళ్తున్నట్లు తెలుసుకుని వారి కారును వెంబడించారు. ఆనందపురం మండలం పందలపాక గ్రామానికి వారి కారు చేరుకోగానే ముందు నుంచి పద్మనాభం సీఐ బృందం, వెనుక నుంచి పీఎంపాలెం సీఐ బృందాల వాహనాలు అడ్డగించాయి. అయినప్పటికీ కిడ్నాపర్లు కారు ఆపకుండా ముందుకు వెళ్లే ప్రయత్నంలో పోలీస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. వెంటనే కారులో ఉన్న కిడ్నాపర్లు రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, రాజేష్ బయటకు దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ఎంపీ కుటుంబ సభ్యుల కోసం ఆరా తీశారు. వారిని బాకురుపాలెం ప్రాంతంలోనే విడిచిపెట్టినట్లు చెప్పడంతో మరో పోలీస్ బృందం వారికోసం గాలింపు చేపట్టింది. ఇంతలో వారు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నట్లు తెలుసుకుని వారిని సురక్షితంగా కమిషనరేట్‌కు తరలించారు.

హేమంత్‌కుమార్‌పై 12 కేసులు..

భీమిలి ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ హేమంత్ కుమార్ ఇప్పటికే రెండు కిడ్నాప్ కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారిగా చెప్పుకుంటున్నప్పటికీ అతనికి బ్లాక్‌మెయిలింగ్, కిడ్నాప్‌లు వంటి నేర చరిత్ర ఉంది. ఇతడిపై 12 కేసుల వరకు ఉన్నాయి.

ఎంపీని పరామర్శించిన మంత్రి అమర్‌నాథ్

ఎంపీ భార్య, కుమారుడి కిడ్నాప్ ఉదంతాన్ని తెలుసుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నగరంలోని ఎంపీ ఇంటికి గురువారం సాయంత్రం వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషయమై సీఎం వైఎస్ జగన్ తనతో మాట్లాడి, వివరాలు తెలుసుకోమని పంపినట్లు అమర్‌నాథ్ చెప్పారు. కిడ్నాప్ ఉదంతాన్ని మంత్రికి ఎంపీ వివరించారు.

ఆ ఐదుగురు కోసం గాలింపు: సీపీ

కిడ్నాప్ విషయం తెలుసుకున్న వెంటనే 17 బృందాలను ఏర్పాటుచేశామని నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ వెల్లడించారు. 4 గంటల్లోనే కిడ్నాపర్లు కోలా వెంకటహేమంత్‌కుమార్, రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో ఐదుగురి పాత్ర కూడా ఉన్నట్లు గుర్తించామని, వీరికోసం గాలిస్తున్నట్లు వివరించారు.

డబ్బు కోసమే కిడ్నాప్: ఎంపీ



దొండపర్తి (విశాఖ దక్షిణ): డబ్బు కోసమే హేమంత్ కుమార్ అనే వ్యక్తి తన భార్య, కుమారుడు, స్నేహితుడైన ఆడిటర్ జీవీని కిడ్నాప్ చేశాడని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. ఎంపీ గురువారం హుటాహుటిన హైదరాబాద్ నుంచి విశాఖకు చేరుకున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ హేమంత్ ఎవరో తనకు తెలియదని చెప్పారు. కేవలం డబ్బు కోసమే ఇంట్లోకి చొరబడి 48 గంటలపాటు తన కుటుంబ సభ్యులు, స్నేహితుడిని బంధించారన్నారు. రెండ్రోజులపాటు తన భార్య, కుమారుడికి తాను ఫోన్‌చేసినప్పటికీ కిడ్నాపర్లు వారిని బెదిరించడంవల్లే వారు తనతో మామూలుగానే మాట్లాడారని.. అందువల్ల తనకు అనుమానం రాలేదన్నారు. అయితే జీవీకి ఓ విషయమై ఎన్నిసార్లు ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చిందన్నారు. దీంతో జీవీ రుషికొండలోనే ఉన్నట్లు నిర్ధారణ కావడం.. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఏదో జరిగి ఉంటుందని గ్రహించి సీపీకి చెప్పినట్లు ఎంపీ తెలిపారు. పోలీసులు తన కుటుంబ సభ్యులకు, ఆడిటర్‌కు ఎలాంటి హాని జరగకుండా తీసుకొచ్చారని, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, సీపీ త్రివిక్రమ్ వర్మ, ఇతర పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనకు వ్యాపారపరంగా, రాజకీయంగా ఎవరూ విరోధులు లేరని తెలిపారు.

క్రేజ్ కోసం ఆనంపై దాడికి యత్నం

ఆరుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు సిటీ: సామాజిక మాధ్యమాలు, టీవీ చానళ్లలో పలువురు వ్యక్తులపై టీడీపీ నాయకుడు ఆనం వెంకటరమణారెడ్డి విమర్శలు చేస్తున్న క్రమంలో ఆయనపై దాడిచేసినట్లు నటిస్తే క్రేజ్ వచ్చి, ప్రత్యేక గుర్తింపు వస్తుందనే ఉద్దేశంతో పడారుపల్లికి చెందిన రౌడీషీటర్ సముద్రాల మంజునాథ్ తన స్నేహితులతో కలిసి దాడికి యత్నించినట్లు వేదాయపాళెం పోలీసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీన నెల్లూరు షార్‌కాలనీలోని హిందూజ అపార్ట్‌మెంట్‌లో కిలారి వెంకటస్వామినాయుడు ఉంటున్న అపార్ట్‌మెంట్ వద్ద కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు వేసుకుని ఆనం వెంకటరమణారెడ్డిపై కర్రలతో దాడికి యత్నించిన విషయం తెలిసిందే. వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఈ విషయం తెలిసిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మంజునాథ్.. సరస్వతినగర్‌కు చెందిన సాయినందన్, ఆచారి వీధికి చెందిన ఎస్.శ్రీనివాసులు, నగరంలోని ఓ పీజీ హాస్టల్‌లో ఉంటున్న చెంచుపవన్, ఈద్గామిట్టకు చెందిన సిరాజ్, బొగ్గులవీధికి చెందిన షోయబ్‌ఖాన్‌లతో కలిసి దాడికి యత్నించినట్లు నటించాలని మాట్లాడుకున్నారు. అపార్ట్‌మెంట్ వద్దకు కర్రలతో వెళ్లగా ఆనం వెంకటరమణారెడ్డితో పాటు సికిందర్‌రెడ్డి మెట్లు దిగుతూ నిందితులను చూసి కేకలు వేశారు. ఈ క్రమంలో ఆనం వెంకటరమణారెడ్డి, సికిందర్‌రెడ్డి వారిపై దాడికి ప్రయత్నించడంతో నిందితులు కర్రలు, రెండు మోటారు సైకిళ్లను అక్కడే వదిలి పరారయ్యారు. నిందితులపై చార్జిషీటు దాఖలు చేసి కఠినమైన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఇంటి వద్దే సంపాదన ముసుగులో బురిడీ

వెయ్యి మందికి పైగా మోసం
ఐదుగురు అరెస్టు



నిందితులు తయారు చేసిన బ్రోచర్‌ను చూపుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్: ఇంటి వద్దే ఉంటూ నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదించవచ్చని నమ్మబలికి ఎనిమిది జిల్లాల్లో దాదాపు వెయ్యి మందికి పైగా కస్టమర్లను బురిడీ కొట్టించిన ఐదుగురు వ్యక్తులను ఆదోని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్‌లు, బ్యాంకు పాసు పుస్తకాలను స్వాధీనం చేసుకుని బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.18.66 లక్షలను ఫ్రీజ్ చేశారు. గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శివనారాయణస్వామి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పూలబజార్ కాలనీకి చెందిన కాలువ నరసింహులు, కార్వన్‌పేటకు చెందిన బెస్త సంజయ్, శ్రీనివాసులు అలియాస్ చేతన్‌కుమార్ అనే యువకులు ఐటీఐ చేశారు. ఈ ముగ్గురు 'కూల్ సాండీ' అనే యాప్‌లో మోసపోకండి అనే చిత్రాన్ని చూసి ప్రజలను మోసం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. స్థానిక అమరావతినగర్‌కు చెందిన మహ్మద్ సులేమాన్, బార్‌పేటకు చెందిన మహబూబ్‌బాషా వీరితో జతకట్టారు. 'నవభారత్ ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్ట్స్' ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఒక బ్రోచర్‌ని తయారు చేయించి 'మా కంపెనీ ఎల్ఈడీ బల్బులు మీ ఇంటి వద్దే ఉంటూ ఫిట్ చేయడం ద్వారా నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదించండి' అని దినపత్రికలో 8 జిల్లాల్లో యాడ్ పబ్లిష్ చేయించారు. ముందుగా రూ.1,050.. ఆ చార్జీలు, ఈ చార్జీల పేరిట సుమారు రూ.18వేల వరకు బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. ఇలా కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం, హైదరాబాద్, గుంటూరు, వరంగల్, నెల్లూరు జిల్లాల్లో సుమారు వెయ్యి మందిని పైగా మోసగించి సుమారు రూ.53 లక్షల వరకు పోగేసుకున్నారు. ఇందులో రూ.30.60 లక్షలు విలాసాలకు, జల్సాలకు ఖర్చు చేశారు. కర్నూలులోని కల్లూరు ఎస్టేట్‌కు చెందిన నాగపుల్లయ్య వీరి చేతిలో మోసపోయి 'పోలీసు స్పందన'లో ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో మరో మరణం

- నాలుగో అంతస్తు నుంచి పడిన పీయూసీ–1 విద్యార్థిని లిఖిత!
- ఆత్మహత్యా? ప్రమాదమా? అనే అనుమానాలు

నిర్మల్: బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ–1 విద్యార్థిని లిఖిత.. బుధవారం రాత్రి తాను చదువుతున్న ఆర్జీయూకేటీలోని హాస్టల్ భవనం నాలుగో అంతస్తు పైనుంచి పడి చనిపోయింది. ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా? ప్రమాదవశాత్తూ కింద పడిందా? అన్నది స్పష్టంగా తెలియడం లేదు. ఇదే ట్రిపుల్ ఐటీలోని పీయూసీ విద్యార్థిని దీపిక ఆత్మహత్య చేసుకుని రెండ్రోజులే అయ్యింది. ఆ కలవరం నుంచే విద్యార్థులు ఇంకా తేరుకోలేదు. ఇంతలోనే దీపిక స్నేహితురాలైన లిఖిత మరణించడంతో అంతా భయాందోళనలకు గురవుతున్నారు. మొత్తం మీద బాసర ట్రిపుల్ ఐటీలో మరణ మృదంగం మోగుతోంది. ఇంతకుముందు కూడా ఇలాంటి ఘటనలు ఎన్నో చోటు చేసుకోగా, గత ఏడాది కాలంలోనే ఐదుగురు మరణించడం గమనార్హం. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం తిప్పారం గ్రామానికి చెందిన బుర్ర రాజుగౌడ్, రేణుక దంపతులు ఉపాధి నిమిత్తం గజ్వేల్ పట్టణంలో ఉంటున్నారు. వారి పెద్దబిడ్డ లిఖిత (17)కు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. తమ బిడ్డ భవిష్యత్తుకు ఢోకా లేదని తల్లిదండ్రులు భావించారు. ఇంతలోనే.. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల సమయంలో వర్సిటీలో తను ఉంటున్న బ్లాక్ నాలుగో అంతస్తు పైనుంచి అనుమానాస్పద స్థితిలో కింద పడి చనిపోయింది. అంతకుముందు 11 గంటల సమయంలో లిఖిత ఇంటికి ఫోన్ చేసింది. తల్లిదండ్రులతో మాట్లాడింది. భోజనం చేశానని, పరీక్ష బాగానే రాశానని కూడా తెలిపింది. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు. లిఖిత నాలుగో అంతస్తుపై నుంచి పడి చనిపోవడం కలకలం రేపింది. విషయం తెలియగానే వర్సిటీ సిబ్బంది ముందుగా భైంసా ఆస్పత్రికి, అక్కడినుంచి పోస్టుమార్టం కోసం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 13న ఆత్మహత్య చేసుకున్న వడ్ల దీపికకు లిఖిత స్నేహితురాలు. ఈ ఘటన జరిగిన రెండురోజులకే లిఖిత మృతి చెందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వ్యవసాయంలో దేశం స్వయం సమృద్ధి

- ఆహార ధాన్యాలను ఎగుమతి చేస్తున్నాం
- వాతావరణ మార్పులపై జీ–20లో చర్చిస్తాం.. జీ–20 దేశాలతో కలిసి పనిచేసేందుకు భారత్ సిద్ధం
- కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్
- హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన జీ–20 సమావేశాలు.. 30 దేశాల నుంచి వ్యవసాయ మంత్రుల రాక


సాక్షి, హైదరాబాద్: వ్యవసాయంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధించిందని కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ వెల్లడించారు. వ్యవసాయంలోని వివిధ రంగాలలో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాలను కనుగొనడానికి జీ–20 దేశాలతో కలిసి పనిచేయడానికి భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ హెచ్ఐసీసీ నోవాటెల్‌లో మూడు రోజులపాటు జరగనున్న జీ–20 వ్యవసాయ మంత్రుల సమావేశం గురువారం ప్రారంభమైంది. జీ–20 సభ్య దేశాలు, ఆహ్వాన దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు, మంత్రులు, డైరెక్టర్ జనరల్‌లు సమావేశానికి హాజరయ్యారు. కేంద్ర వ్యవసాయ సహాయ మంత్రి కైలాష్ చౌదరి ప్రదర్శనను ప్రారంభించడంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఎగ్జిబిటర్లు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సాధించిన విజయాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి తోమర్ మాట్లాడారు. భారతదేశం ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయిలో ఉందన్నారు. వాతావరణ మార్పులు, పంటల వైవిధ్యంపై సమావేశాల్లో చర్చిస్తామన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రపంచ ప్రయోజనాల కోసం మన జ్ఞానాన్ని, అనుభవాన్ని జీ–20 దేశాలతో పంచుకుంటామన్నారు. అనేక వ్యవసాయోత్పత్తులలో భారతదేశం ప్రపంచంలో మొదటి లేదా రెండో స్థానంలో ఉందన్నారు. శుక్రవారం వివిధ దేశాలకు చెందిన వ్యవసాయ మంత్రులతో ప్రారంభ సెషన్ జరగనుంది. ముగింపురోజు శనివారం జీ–20 వ్యవసాయ మంత్రులు వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రకటనతో పాటు రోడ్ మ్యాప్‌ను విడుదల చేస్తారని తోమర్ తెలిపారు.

ఎగ్జిబిషన్లలో స్టాళ్లు...

జీ–20 సమావేశాల సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. వేస్ట్ టు వెల్త్ మేనేజ్‌మెంట్, పోస్ట్ హార్వెస్ట్, స్మార్ట్ అండర్ ప్రెసిషన్ అగ్రికల్చర్, అగ్రి ఇన్నోవేషన్స్, వాల్యూ చైన్ మేనేజ్‌మెంట్ మొదలైన రంగాల్లో 71 స్టాల్స్ ఏర్పాటు చేశారు. వాటిల్లో 15 స్టాళ్లను ఐకార్ ఏర్పాటు చేసింది. ఏడు స్టాళ్లను ఇతర మంత్రిత్వ శాఖలు ప్రదర్శించాయి. 9 స్టాల్స్‌ను ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేశాయి. అగ్రి స్టార్టప్‌లకు వారి కార్యకలాపాలు, విజయాలు, పురోగతిని ప్రదర్శించడానికి అవకాశం కల్పించడానికి 33 స్టాళ్లు ఇచ్చారు.

పవన్ రాజకీయాలకు అనర్హుడు

991వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: కులాలను రెచ్చగొట్టి భావోద్వేగాలతో గెలుద్దామని కలలుగంటున్న పవన్ కళ్యాణ్ ..ప్యాకేజీలకు తప్ప.. రాజకీయాలకు అనర్హుడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 991వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పలువురు మాట్లాడారు. పార్టీకి ఓ అజెండా లేకుండా కేవలం చంద్రబాబును గద్దెనెక్కించి ప్యాకేజీ అందుకోవడమే లక్ష్యంగా పవన్‌కళ్యాణ్ రాజకీయాలు చేస్తున్నాడే తప్ప.. పేదల కోసం, ప్రజల కోసం మాత్రం కాదని విమర్శించారు. గత ప్రభుత్వంలో కురగల్లులో సభపెట్టి పెరుగన్నం తిని అమరావతిని విమర్శించి చంద్రబాబు తీరుపై విరుచుకుపడి మంచంపై పడుకున్న ఘటన పవన్ కళ్యాణ్‌కు గుర్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏదో జరిగిపోతున్నట్లు దొంగ యాత్రల్లో బాబుకు వత్తాసుగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పేదల ఇళ్ల పట్టాల కోసం న్యాయ పోరాటం చేసి అటు కోర్టుల్లో సైతం మా వాణిని వినిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో 54 వేల పట్టాలు సాధిస్తే పవన్ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రెండు చోట్లా పోటీచేసి ఓడిపోయిన పవన్‌కళ్యాణ్, మంగళగిరిలో ఓడిన లోకేశ్ ఇద్దరూ యాత్రలు చేయడం సిగ్గుచేటన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, పులి దాసు, ఈపూరి ఆదాం, బొలిమేర శ్యామ్యూల్ పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు కిలో రూ.254

'పశ్చిమ' వేలం కేంద్రాల్లో రికార్డు స్థాయి ధర



జంగారెడ్డిగూడెంలోని పొగాకు వేలం కేంద్రం


జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకుకు రికార్డు స్థాయిలో ధర లభించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని ఎన్ఎల్ఎస్ (ఉత్తర ప్రాంత తేలిక నేలలు) ఏరియాలోని ఐదు వర్జీనియా పొగాకు వేలం కేంద్రాల్లోనూ కిలోకు రూ.250కి పైగా ధర లభించడం విశేషం. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం రెండో వేలం కేంద్రంలో అత్యధికంగా కిలోకు రూ.254 ధర లభించింది. ఒకటో వేలం కేంద్రంలో కిలోకు రూ.253 ధర లభించింది. కొయ్యలగూడెం వేలం కేంద్రంలో రూ.251, గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల్లో రూ.250 చొప్పున ధర లభించింది. గత ఏడాది ఇదే సీజన్‌లో వర్జీనియా పొగాకు కిలో అత్యధికంగా రూ.245 ధర పలికింది. ఈ ఏడాది ఆ రికార్డును అధిగమించి రూ.254 ధర లభించడం విశేషం. వారం రోజుల క్రితం వరకు రూ.210 ఉన్న కిలో ధర... గురువారం గరిష్ట ధర రూ.254కు చేరింది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రాష్ట్ర సంక్షేమం కోసం దువా చేయండి

హజీలకు ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, సిరిసంపదలతో విరాజిల్లాలని కోరుతూ, రాష్ట్రం సంక్షేమం కోసం దువా చేయాలని పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే హజీలకు ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసలాజమ్‌తో కలిసి నంబూరులోని సిరాజుల్ ఉలూం మదరసాలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హజ్ హౌస్‌ను సందర్శించారు. విమానాశ్రయానికి బయలుదేరిన హజీలతో మాట్లాడి హజ్ హౌస్‌లో సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి మిఠాయిలు ఇచ్చారు. హజ్ కమిటీ చేసిన ఏర్పాట్లపై హజీలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా చేసిన ప్రార్థనలో ఉప ముఖ్యమంత్రి, హజ్ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు. అనంతరం హజీల బస్సులకు జెండాను ఊపి వారిని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి పంపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు ముఫ్తి సయ్యద్ షా మొహమ్మద్ అలీ బాగ్దాది, ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీలు ఇషాక్‌బాషా, ముహమ్మద్ రూహుల్లా, హజ్ కమిటీ సభ్యులు వలియుల్లా హుస్సేనీ, హాఫీజ్ మన్సూరు అహమ్మద్, ఇబాదుల్లా, బాసిత్, పుంగనూరు ఖాదర్ పాల్గొన్నారు.

'అనంత'లో బాల భీముడి జననం!



అనంతపురంలో 5.2 కిలోల బాల భీముడు జన్మించాడు. ధర్మవరానికి చెందిన షబానా ఖానం మూడో కాన్పు కోసం మే 30న అనంతపురంలోని 'కిమ్స్' సవీరా ఆస్పత్రిలో చేరింది. ఆమెను గైనకాలజిస్టు డాక్టర్ శిల్పాచౌదరి పరీక్షించి ఉమ్మనీరు అధికంగా ఉందని, పొట్ట బాగా ఉబ్బరం, మధుమేహం, బీపీ ఉన్నట్లు గుర్తించారు. స్కాన్‌లో గర్భస్థ శిశువు బరువు ఎక్కువగా ఉండటం, 5 సెంటీ మీటర్ల స్థాయిలో ఉండాల్సిన ఉమ్మనీరు 28 సెం.మీ ఉన్నట్లు గుర్తించారు. కేసులో ఉన్న సంక్లిష్టతల దృష్ట్యా సిజేరియన్ చేయగా ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది.

– అనంతపురం క్రైం

స్కిల్ కాలేజీలతో పరిశ్రమల అనుసంధానం

నైపుణ్యశాఖపై సమీక్షలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆదేశం

- ఆగస్ట్ 15కల్లా పూర్తిచేయాలి
- పులివెందుల స్కిల్ ట్రైనింగ్ అకాడమీ పనులు జూలై 8కల్లా పూర్తికావాలి




సాక్షి, అమరావతి: స్కిల్ కాలేజీలు, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను పరిశ్రమలతో అనుసంధానం చేసి ఆయా కంపెనీలకు అవసరమైన కోర్సుల్లో శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక, నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అధికారులను ఆదేశించారు. ఇటీవల డోన్ పట్టణంలో ప్రారంభమైన కియా నాలెడ్జ్ ఎక్సలెన్స్ సెంటర్ తరహాలో అన్ని స్కిల్ కాలేజీలు, హబ్‌లను స్థానిక పరిశ్రమలను అనుసంధానించాలని సూచించారు. ఆయన గురువారం విజయవాడలోని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో నైపుణ్యశాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15కల్లా పరిశ్రమలతో అనుసంధాన ప్రక్రియను పూర్తిచేయాలని నిర్దేశించారు. స్కిల్‌హబ్‌లలో శిక్షణ కోసం ఇప్పటివరకు 15,559 మంది నమోదు చేసుకున్నట్లు నైపుణ్యశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మంత్రికి వివరించారు. ఎన్ని బ్యాచ్‌ల్లో ఎంతమందికి శిక్షణ పూర్తయి ఉద్యోగాలు పొందారని మంత్రి ఆరా తీశారు. ఇప్పటికే 308 బ్యాచ్‌లలో 8,807 మందికి శిక్షణ పూర్తయిందని, ఇంకా 249 బ్యాచ్‌లలో 6,733 మంది శిక్షణ పొందుతున్నారని ముఖ్య కార్యదర్శి తెలిపారు. 6,713 మంది యువతకు ధ్రువపత్రాలు అందజేశామన్నారు. మొత్తం 3,636 మందికి ఉపాధి అవకాశాలు అందించినట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ వినోద్‌కుమార్ చెప్పారు. స్కిల్ కాలేజీల్లో 1,484 మంది ఎన్‌రోల్ చేసుకోగా శిక్షణ పూర్తిచేసుకున్న 566 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. 2023–24కి గాను 54 జాబ్‌మేళాలు నిర్వహించగా మొత్తం 7,233 మందికి ఉద్యోగాలు దక్కాయని మంత్రి బుగ్గన చెప్పారు. స్కిల్ కాలేజీలు, స్కిల్‌హబ్‌లకు సంబంధించి కొత్త విధానంలో బ్రాండింగ్ చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గమైన పులివెందులలో పడా (పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)లో ఏర్పాటు కానున్న నైపుణ్య శిక్షణ అకాడమీ పనుల పురోగతిపైన మంత్రి చర్చించారు. జూలై 8 కల్లా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పర్యాటకులను ఆకర్షించేలా జూ పార్క్‌ల అభివృద్ధి

కొత్త జంతువులతో పాటు అదనపు సదుపాయాలు

- కపిలతీర్థం నుంచి 'తిరుపతి జూ' వరకు కేబుల్ కార్ ఏర్పాటుపై అధ్యయనం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి
- విశాఖ జూ పార్క్ కొత్త లోగో ఆవిష్కరణ



సాక్షి, అమరావతి: పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలోని జూ పార్క్‌ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం మంత్రి అధ్యక్షతన జూ అథారిటీ ఆఫ్ ఏపీ గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించేలా విశాఖ, తిరుపతి జూ పార్క్‌లను తీర్చిదిద్దేందుకు.. దేశంలోని పలు జూ పార్క్‌ల అథారిటీలతో జంతువుల మార్పిడి కోసం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. తిరుపతి జూ పార్క్‌లో ఎలక్ట్రికల్ స్కూటర్లు ప్రవేశపెడుతున్నామని తెలిపారు. దీనిద్వారా వచ్చే ఆదాయంలో 30 శాతం జూ పార్క్‌కు లభిస్తుందన్నారు. విజయవంతమైతే విశాఖ జూ పార్క్‌లోనూ ఈ విధానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. జంతువులను సంరక్షించే సిబ్బంది నియామకాలు, రెగ్యులరైజేషన్‌పై హేతుబద్ధత కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కపిలతీర్థం నుంచి తిరుపతి జూ పార్క్‌కు కేబుల్ కార్ ఏర్పాటు చేసేందుకు అధికారులు అధ్యయనం చేస్తారని మంత్రి చెప్పారు. పరిశ్రమల సీఎస్సార్ నిధులతో జూ పార్క్‌లలో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వీటిలోని జంతువుల సంరక్షణపై వెటర్నరీ కాలేజీ నిపుణులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఖడ్గమృగాల కోసం అస్సాం ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నట్లు మంత్రి తెలిపారు. క్యూరేటర్ పోస్టులను బలోపేతం చేసేందుకు జూ డైరెక్టర్లుగా వారిని అప్‌గ్రేడ్ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. అనంతరం విశాఖ జూ పార్క్‌కు సంబంధించిన కొత్త లోగోను, జంతువులను పోలిన పలు వస్తువులను మంత్రి పెద్దిరెడ్డి ఆవిష్కరించారు. జంతువుల చిత్రాలతో రూపొందించిన టీషర్ట్‌లు, టోపీలు, గృహాలంకరణ వస్తువులను పరిశీలించారు. సమావేశంలో అటవీదళాల అధిపతి మధుసూదన్‌రెడ్డి, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతి ప్రియపాండే, అటవీ శాఖ స్పెషల్ సెక్రటరీ చలపతి రావు, విశాఖ క్యూరేటర్ నందినీ సలారియా, తిరుపతి క్యూరేటర్ సెల్వం, విశాఖ సర్కిల్ హెడ్ శ్రీకంఠనాథ రెడ్డి, తిరుపతి సర్కిల్ హెడ్ ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వంట నూనెలపై దిగుమతి సుంకం తగ్గింపు

ధరల నియంత్రణకు కేంద్రం నిర్ణయం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా పెరుగుతున్న వంట నూనెల ధరలను తగ్గించే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రిఫైన్డ్ సోయాబీన్, రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ నూనెలపై ఉన్న దిగుమతి సుంకాన్ని 17.5 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గించింది. ఈ తగ్గింపు వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. దేశీయ విపణిలో వంటనూనెల ధరలను తగ్గించేందుకు గతంలో తీసుకున్న చర్యలకు ఈ నిర్ణయం తోడ్పడనుందని శాఖ వెల్లడించింది. వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని చివరిసారిగా 2021 అక్టోబర్‌లో 32.5% నుంచి 17.5%కి తగ్గించింది.

మతమార్పిడి నిరోధక చట్టం రద్దు


ప్రకటించిన కర్ణాటక కాంగ్రెస్ సర్కార్

బెంగళూరు: కర్ణాటకలో గత బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మత మార్పిడి నిరోధక చట్టాన్ని రద్దు చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. జూలైలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెడతామని సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వం తెలిపింది. 'మత మార్పిడి నిరోధక బిల్లుపై మంత్రివర్గం చర్చించింది. 2022లో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను రద్దు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 3 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో దీనిని ప్రవేశపెడతాం' అని రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ గురువారం తెలిపారు. సామూహికంగా, తప్పుడుమార్గాల్లో బలవంతంగా చేపట్టే మత మార్పిడులను శిక్షార్హం చేస్తూ గత ఏడాది సెప్టెంబర్‌లో బీజేపీ ప్రభుత్వం చట్టం చేసిన విషయం తెలిసిందే.

నితీశ్‌కు తప్పిన ప్రమాదం



పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గురువారం పాట్నాలోని తన నివాసం సమీపంలో మార్నింగ్ వాక్ చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై ఆయనకు అత్యంత సమీపంలోకి దూసుకురావడం తీవ్ర కలకలం సృష్టించింది. రోడ్డుపై నడుస్తుండగా అకస్మాత్తుగా మోటార్ సైకిల్ వేగంగా తనవైపు దూసుకురావడం గమనించిన నితీశ్ వెంటనే అప్రమత్తమై పక్కనున్న ఫుట్‌పాత్‌పైకి చేరుకున్నారు. లేకపోతే పెను ప్రమాదమే జరిగేదని సమాచారం. దేశ్‌రత్నా మార్గ్‌లో ఉదయం 6.40 గంటలకు ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు మైనర్లని, వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నామని తెలిపారు. వారు ఎవరన్నది పోలీసులు బయటపెట్టలేదు. సదరు మైనర్లు ఉదయం 5.40 గంటలకు బంగారం చైన్ దొంగతనం చేసి, ఎవరికీ దొరకకూడదన్న ఉద్దేశంతో అటువైపు వేగంగా వచ్చినట్లు వెల్లడించారు.



ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఆడిన పవర్ గేమ్ సొంత పార్టీలోనే చీలికలు తెచ్చేలా కనబడుతోంది. ప్రజాకర్షణ కలిగిన నాయకుడు, తన అన్న కుమారుడు అజిత్ పవార్ బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నాడన్న ఉప్పందగానే పవార్ ఆయనకు చెక్ చెప్పడానికి తన కుమార్తె సుప్రియా సూలే, కేంద్ర మాజీ మంత్రి ప్రఫుల్ పటేల్‌లను ఈ నెల 10న కార్యనిర్వాహక అధ్యక్షులుగా ప్రకటించారు. ఈ ప్రకటన కార్యకర్తలకు, నాయకులకు పెద్దగా ఆశ్చర్యం కలిగించనప్పటికీ అజిత్ పవార్ తదుపరి ఎలాంటి అడుగులు వేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్సీపీ రజతోత్సవాలు జరుపుకుంటున్న వేళ పవార్ తన కుమార్తెకే పార్టీ పగ్గాలు అప్పగించడం చూస్తుంటే ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కోవడానికి సిద్ధపడినట్టుగా కనిపిస్తోంది. పార్టీని స్థాపించిన ఈ 25 ఏళ్లలో శరద్ పవార్ తీసుకున్న ఈ నిర్ణయం అంత ఆషామాషీదేమీ కాదు. ఇప్పటివరకు రాష్ట్ర స్థాయిలో పార్టీలో గట్టి పట్టున్న నాయకుడు అజిత్ పవార్ తప్ప మరెవరూ అంతగా కనిపించరు. ఆయనను కాదని ఎవరూ ముందుకు వెళ్లే పరిస్థితి లేదు.





పవార్ 'పవర్' గేమ్..!

ఎన్సీపీలో చీలికలు తెస్తుందా?

సుప్రియా సూలే సవాళ్లను ఎదుర్కోగలరా? ● అజిత్ పవార్ అడుగులు ఎటు?

పార్టీలో చీలిక తప్పదా?

ఒకప్పుడు శరద్ పవార్ వారసుడిగా అజిత్ పవార్‌నే చూసేవారు. పార్టీలో సెకండ్ పొజిషన్‌ను అనుభవించారు. వివాదరహితుగా పేరు తెచ్చుకున్నారు. కొన్నాళ్ల క్రితం బీజేపీలో దూకడానికి అజిత్ పవార్ ఎమ్మెల్యేలతో కలిసి మంతనాలు సాగిస్తున్నారన్న ఊహాగానాలు వచ్చాయి. ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంటూ ముంబై నగర వీధుల్లో పోస్టర్లు వెలిశాయి. రాజకీయాల్లో తలపండిన శరద్ పవార్ ఇవన్నీ పార్టీకి ముప్పు తెస్తాయని భావించి అత్యంత నాటకీయంగా ఎన్సీపీ జాతీయ అధ్యక్ష పదవి నుంచి తాను వైదొలుగుతున్నట్టు ప్రకటించి అందరికీ షాక్ ఇచ్చారు. ఆ తర్వాత కార్యకర్తలు, ఇతర నాయకులు పట్టుబట్టడంతో ఉద్వేగ భరిత వాతావరణంలో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని పార్టీపై ఎప్పటికీ పట్టు తనదేనన్న సంకేతాలను అజిత్ పవార్‌కు పంపారు. ఇది జరిగిన కొద్ది వారాలకే శరద్ పవార్ తన కుమార్తెకే నేరుగా పార్టీ పగ్గాలు అప్పగించి మరో పవర్ గేమ్ మొదలు పెట్టారు. సుప్రియకు పార్టీ బాధ్యతలు అప్పగించడంపై తనకెలాంటి అసంతృప్తి లేదని అజిత్ పవార్ బయటకి చెబుతున్నప్పటికీ ఆయన రాష్ట్రంలో మరో ఏక్‌నాథ్ షిండేలా మారే అవకాశాలున్నాయన్న చర్చ జరుగుతోంది. అజిత్ పవార్ పార్టీని చీలుస్తారా లేదా అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్సీపీకి 53 మంది సభ్యుల బలం ఉంది. అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ కలిసి ఎమ్మెల్యేలను తమ వైపు లాక్కొనే వ్యూహరచన చేయడంతో శరద్ పవార్ వ్యూహాత్మకంగా అజిత్‌ను బలహీనపరచడం కోసం పటేల్‌కు కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే త్వరలోనే అజిత్ పవార్ తీసుకునే నిర్ణయాలు మహారాష్ట్ర రాజకీయాల్లోనే కీలకమైన మార్పులు తీసుకువస్తాయని రాజకీయ విశ్లేషకుడు విజయ్ క్రోమర్ వ్యాఖ్యానించారు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత అజిత్ పవార్ ఎన్సీపీపై చేసిన తిరుగుబాటు విఫలమైంది. బీజేపీ నేత ఫడ్నవీస్ సీఎంగా, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా ఏర్పాటైన ప్రభుత్వం మూడు రోజుల్లోనే కూలిపోయిన విషయం తెలిసిందే. కొందరు ఈ ఉదంతాన్ని ఉదాహరణగా చూపిస్తూ ముఖ్యమంత్రి కావాలన్న అజిత్ పవార్ కల నెరవేరాలంటే ఎన్సీపీలో ఉంటేనే సాధ్యపడుతుందని, బీజేపీతో చేతులు కలిపితే సాధ్యం కాదన్న విషయం ఆయనకీ తెలుసునని అంటున్నారు. మొత్తమ్మీద అజిత్ పవార్ వేసే అడుగులే ఆయన భవిష్యత్, ఎన్సీపీ భవిష్యత్‌ని నిర్దేశించడంతో పాటు వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్ని కూడా శాసించబోతున్నాయి.

సుప్రియ ఎదుట సవాళ్లు..!

సుప్రియ సూలే గత 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఒక ఎంపీగా ఆమె జాతీయ రాజకీయాల్లోనే కీలక పాత్ర పోషించారు. అజిత్ పవార్ మాదిరిగా ఆమెకి రాష్ట్ర రాజకీయాల్లో పట్టు లేదు. నాయకత్వ లక్షణాలు కూడా ఇప్పటివరకు ఎక్కడా ప్రదర్శించే అవకాశం రాలేదు. వచ్చే ఏడాది అత్యంత కీలకమైన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టిక్కెట్ల పంపిణీ, పార్టీలో అసమ్మతుల బుజ్జగింపు, ఎన్నికల్లో వ్యూహరచనలు వంటివన్నీ ఆమె ఎలా నిర్వహించగలరనే సందేహాలైతే ఉన్నాయి. సుప్రియ నియామకంతో పార్టీకి ఒక అర్బన్ ఇమేజ్ వచ్చిందేమో కానీ, అజిత్ పవార్ మాదిరిగా గ్రామాల్లోకి చొచ్చుకుపోయి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే సామర్థ్యం లేదు. అయితే తండ్రి మాదిరిగానే సుప్రియకు ఎలాంటి సంక్షోభాన్నయినా తట్టుకునే నిలబడే సామర్థ్యం ఉందన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

అజిత్ పవార్ క్రౌడ్ పుల్లర్

అజిత్ పవార్ తన చిన్నాన్న శరద్ పవార్ అడుగు జాడల్లో నడుస్తూ 1982లో తన 20 ఏళ్ల వయసులోనే రాజకీయాల్లోకి వచ్చారు. చక్కెర సహకార సంఘాల ఎన్నికల్లో పోటీ చేసి నెగ్గారు. 1991లో తొలిసారిగా ఎన్సీపీ తరఫున బారామతి నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత పవార్ కోసం ఆ సీటుని వదులుకొని మహారాష్ట్ర అసెంబ్లీకి పోటీ చేశారు. అప్పట్నుంచి రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యారు. బారామతి అసెంబ్లీ సీటు నుంచి ఓటమి లేకుండా ఎన్నికవుతూనే ఉన్నారు. 2012, 2014లో ఉప ముఖ్యమంత్రిగా పని చేసి పాలనలోనూ తన సామర్థ్యాన్ని ప్రదర్శించారు. కార్యకర్తల్ని ప్రేమగా పలకరించడం, నాయకులతో మంతనాలు, తాను చెప్పదలచుకున్నదేదో సూటిగా స్పష్టంగా చెప్పడం, గ్రామాల్లో ఉన్న పట్టు వంటివెన్నో ఆయనను క్రౌడ్ పుల్లర్‌గా మార్చాయి.

-సాక్షి, నేషనల్ డెస్క్

ఈడీ అరెస్ట్ వేళ సెంథిల్ తలకు గాయం?

పరామర్శ సందర్భంగా మానవ హక్కుల కమిషన్ సభ్యుడికి సెంథిల్ ఫిర్యాదు

సాక్షి, చెన్నై: ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలపై నమోదైన కేసులో తమిళనాడు విద్యుత్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి వి.సెంథిల్ బాలాజీని అరెస్ట్‌చేసినపుడు ఈడీ ఆయన పట్ల అత్యంత దురుసుగా ప్రవర్తించిందా అనే అనుమానాలను తమిళనాడు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(టీఎస్ఎస్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యుడొకరు వ్యక్తంచేశారు. అదే జరిగితే ఆ అంశాన్ని టీఎస్ఎస్‌హెచ్‌ఆర్‌సీ తప్పక పరిశీలిస్తుందని సంస్థ సభ్యుడు కన్నదాసన్ చెప్పారు. రవాణా శాఖలో ఉద్యోగాలిప్పిస్తానంటూ పలువురి నుంచి భారీఎత్తున నగదు తీసుకున్నారనే ఆరోపణలపై సెంథిల్‌ను విచారించిన ఈడీ అధికారులు మంగళవారం అర్ధరాత్రి దాటాక అరెస్ట్ చేశారు. అరెస్ట్‌వేళ సెంథిల్ బిగ్గరగా రోదించడం, వెంటనే ఆస్పత్రిలో చేర్పించి యాంజియోగ్రామ్ చేయించడం, గుండె నాళంలో బ్లాక్‌లను గుర్తించడం విదితమే. అయితే అర్ధరాత్రి అరెస్ట్ సందర్భంగా తన పట్ల ఈడీ అధికారులు దురుసుగా ప్రవర్తించారని తనను ఆస్పత్రికి కలవడానికి వచ్చిన కన్నదాసన్‌కు సెంథిల్ ఫిర్యాదుచేశారు. 'ఈడ్చుకెళ్లారని ఆయన చెప్తున్నారు. లాక్కెళ్లినపుడే ఆయన తలకు గాయమైందట. ఈడీ దురుసు ప్రవర్తన అంశాన్ని టీఎస్ఎస్‌హెచ్‌ఆర్‌సీ పరిశీలిస్తుంది' అని కన్నదాసన్ చెప్పారు. కాగా, చెన్నై ఓమందూరార్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన భర్తను కావేరి ఆస్పత్రికి తరలించి శస్త్ర చికిత్సకు అనుమతి ఇవ్వాలని మంత్రి భార్య మేఘల మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కావేరి ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్స, వైద్య సేవలకు చర్యలు తీసుకోవాలని కోర్టు ఈడీ అధికారులను ఆదేశించింది.



రెచ్చ గొట్టొద్దు: కేంద్రంపై స్టాలిన్ ఫైర్

ఈడీ దాడులు, మంత్రి అరెస్టు నేపథ్యంలో డీఎంకే చీఫ్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ట్విట్టర్ ఖాతాలో ఒక వీడియో పోస్ట్‌చేశారు. 'డీఎంకే వాడిని. రెచ్చగొట్టొద్దు తట్టుకోలేరు' అని కేంద్రాన్ని హెచ్చరించారు. కరుణానిధి చేసిన హెచ్చరికలను ఉటంకిస్తూ.. 'డీఎంకే వాళ్లు తిప్పికొట్టడం మొదలెడితే భరించలేరు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు మేం చేయని రాజకీయాలు లేవు. మేం చూడని పోరాటాలు లేవు. ఒకసారి చరిత్రను చూసుకోండి' అని హెచ్చరించారు. 'ఇది బెదిరింపు కాదు. హెచ్చరిక' అని అన్నారు. సెంథిల్ అరెస్ట్‌పై స్పందించారు. 'ఈడీ ద్వారానే రాజకీయాలు చేద్దామని బీజేపీ చూస్తోంది. ఈడీని అడ్డుపెట్టుకుని పదేళ్ల నాటి పాత కేసులో మానసికంగా, శారీరకంగా సెంథిల్‌ను వేధిస్తున్నారు. ఈడీ అధికారులు పెట్టిన మానసిక ఒత్తిడితోనే ఆయనకు హృద్రోగ సమస్యలొచ్చాయి. 18 గంటలు నిర్బంధించిమరీ ప్రశ్నల పరంపర కొనసాగించారు. ఎవ్వరినీ కలవనివ్వలేదు. దాంతో ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించాక ఆస్పత్రికి తరలించారు' అని ఆరోపించారు.

పార్లమెంట్‌లో లైంగిక వేధింపులు

- ఆస్ట్రేలియా ఎంపీ లిడియా థోర్ప్ సంచలన ఆరోపణలు
- ఎంపీ డేవిడ్ వాన్‌ను సస్పెండ్ చేసిన లిబరల్ పార్టీ



సిడ్నీ: పార్లమెంట్ భవనం సాక్షిగా తనపై లైంగిక వేధింపులు జరిగాయని ఆస్ట్రేలియా మహిళా ఎంపీ లిడియా థోర్ప్ గురువారం సంచలన ఆరోపణలు చేశారు. మహిళలు పనిచేసేందుకు పార్లమెంట్ సురక్షితమైన చోటు కాదని పేర్కొన్నారు. పలుకుబడి కలిగిన ఒక నేత తనపట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ, తాకరాని చోట తాకుతూ కోరిక తీర్చాలంటూ వేధించేవారంటూ లిబరల్ పార్టీ ఎంపీ డేవిడ్ వాన్ పేరును ఆమె పార్లమెంట్‌లో ప్రస్తావించారు. బుధవారం పార్లమెంట్‌లో ఇవే ఆరోపణలను థోర్ప్ చేయగా డేవిడ్ వాన్ ఖండించారు. థోర్ప్ ఆరోపణలతో షాక్‌కు గురయ్యాయనని, అవి పూర్తిగా అవాస్తవమని మీడియాతో అన్నారు. పార్లమెంట్ ఆంక్షలు విధిస్తుందనే భయంతో వాటిని వెనక్కి తీసుకుంటున్న ప్రకటించారు. గురువారం థోర్ప్ ఇవే ఆరోపణలు మరోసారి చేశారు. 'పార్లమెంట్ భవనంలోని నా ఆఫీసు నుంచి బయటకు ఒంటరిగా రావాలంటేనే భయమేసేది. తోడుగా ఒకరిని వెంటబెట్టుకుని భవనంలో తిరిగేదాన్ని. ఇలాంటి అనుభవాలను చాలామందే ఎదుర్కొన్నా. తమ కెరీర్‌పై ప్రభావం పడుతుందనే ఎవరూ బయటకు రావడం లేదు' అంటూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ ఆరోపణలతో వాన్‌ను లిబరల్ పార్టీ సస్పెండ్ చేసింది. 2019 మార్చిలో బ్రిటనీ హిగ్గిన్స్ అనే పార్టీ కార్యకర్తపై తోటి కార్యకర్త పార్లమెంట్ కార్యాలయం గదిలోనే అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. ఈ ఘటనపై విచారణ ఇప్పటికీ ముందుకు పడలేదు. దీనిపై బుధవారం ఎంపీ వాన్ ఖండిస్తూ ప్రసంగిస్తుండగానే స్వతంత్ర ఎంపీ లిడియా థోర్ప్ అడ్డుతగులుతూ ఆయనపై ఆరోపణలు చేశారు. ఆస్ట్రేలియా పార్లమెంట్ మహిళా సభ్యుల్లోని 63 శాతం మంది ఏదో ఒక విధమైన వేధింపులకు గురవుతున్నారంటూ ప్రభుత్వం నియమించిన కమిటీ తేల్చడం గమనార్హం.

తీరాన్ని తాకిన భీకర బిపర్‌జోయ్

గుజరాత్‌లోని కచ్, సౌరాష్ట్ర తీర ప్రాంతాల్లో కుంభవృష్టి

కచ్(గుజరాత్)/న్యూఢిల్లీ: అరేబియా సముద్రంలో పది రోజులకుపైగా ప్రచండ వేగంతో సుడులు తిరుగుతూ భీకర గాలులతో పెను భయాలు సృష్టించిన బిపర్‌జోయ్ తుపాను ఎట్టకేలకు గురువారం సాయంత్రం గుజరాత్‌లో తీరాన్ని తాకింది. దాదాపు 50 కిలోమీటర్ల వెడల్పు ఉన్న తుపాను కేంద్రస్థానం(సైక్లోన్ ఐ) సాయంత్రం 4.30 గంటలకు తీరాన్ని తాకగా పూర్తిగా తీరాన్ని దాటి భూభాగం మీదకు రావడానికి ఆరు గంటల సమయం పడుతుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. తుపాను కచ్ జిల్లాలోని జఖౌ పోర్ట్ సమీపంలో తీరం దాటి దాని ప్రతాపం చూపిస్తోంది. ఖచ్, దేవభూమి ద్వారక, ఓఖా, నలియా, భుజ్, పోర్‌బందర్, కాండ్లా, అమ్రేలీ జిల్లాల్లో గురువారం ఉదయం నుంచే కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. కచ్ జిల్లాలోని జఖౌ, మండ్వీ పట్టణాల్లో పెద్ద సంఖ్యలో చెట్లు, విద్యుత్స్తంభాలు నేలకూలాయి. నిర్మాణ దశలో ఉన్న చిన్నపాటి ఇళ్లు కూలిపోయాయి. గురువారం రాత్రి ఏడింటికి అందిన సమాచారం మేరకు ఎక్కడా ప్రాణనష్టం లేదని గుజరాత్ హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘ్వీ చెప్పారు. దేవభూమి ద్వారక జిల్లాలో చెట్టు మీదపడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి.

లక్ష మంది సురక్షిత ప్రాంతాలకు

తీర ప్రాంతాలకు చెందిన లక్ష మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 15 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, 12 రాష్ట్ర విపత్తు స్పందన దళాలు, భారత వాయు సేన, నేవీ, ఆర్మీ బలగాలు, తీరగస్తీ దళాలు, బీఎస్ఎఫ్ సిబ్బంది తుపాను సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. 'కచ్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్, పోర్‌బందర్, రాజ్‌కోట్, మోర్బీ, జునాగఢ్ జిల్లాల్లో 25 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. ముంపు ప్రాంతాల్లో వరద బీభత్సం ఉండొచ్చు. పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్‌సరఫరా దెబ్బతినే ప్రమాదముంది. దాదాపు 14 మీటర్ల ఎత్తున అలలు ఎగసిపడొచ్చు' అని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర చెప్పారు. నష్టం జరగొచ్చనే భయంతో ముందస్తుగా సముద్రప్రాంతంలో చమురు అన్వేషణ, నౌకల రాకపోకలు, చేపల వేటను నిలిపేశారు.



గురువారం కచ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

నష్టం తగ్గించేందుకు..

తుపాను కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాన్ని వీలైనంతమేర తగ్గించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ పలు చర్యలు తీసుకుంది. చేపల పడవల్ని దూరంగా లంగరు వేశారు. భారీ నౌకలను సముద్రంలో చాలా సుదూరాలకు పంపేశారు. ఉప్పు కార్మికులు, గర్భిణులుసహా లక్ష మంది స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 4,000 భారీ హోర్డింగ్‌లను తొలగించారు. గుజరాత్, మహారాష్ట్రలో 33 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయని ఎన్‌డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అతుల్ కార్వాల్ చెప్పారు. ఎడతెగని వానలకు జలమయమయ్యే ముంపుప్రాంతాల ప్రజలను తరలించేందుకు రబ్బరు బోట్లను సిద్ధంచేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బందిని పురమాయించారు. ఉత్తర దిశలో పంజాబ్ బఠిండాలో, తూర్పున ఒడిశాలో, దక్షిణాన చెన్నై అరక్కోణంలో ఇలా తుపాను ప్రభావం ఉండే అవకాశమున్న ప్రతీ చోటా వాయుసేన అప్రమత్తంగా ఉన్నారు.

ఐరాసలో 'మెమోరియల్ వాల్'

ఐక్యరాజ్యసమితి: విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన శాంతిదూతల గౌరవార్థం న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో 'మెమోరియల్ వాల్' నెలకొల్పాలని కోరుతూ భారత్ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానాన్ని ఐరాస సాధారణ సభ(యూఎన్‌జీఏ) బుధవారం ఆమోదించింది. భారత్ ప్రతిపాదన పట్ల ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. ఐరాసలో భారత ప్రతినిధి రుచిరా కాంబోజ్ 'మెమోరియల్ వాల్ ఫర్ ఫాలెన్ యునైటెడ్ నేషన్స్ పీస్‌కీపర్స్' పేరిట ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బంగ్లాదేశ్, కెనడా, చైనా, డెన్మార్క్, ఈజిప్ట్, ఫ్రాన్స్, ఇండోనేషియా, జోర్డాన్, నేపాల్, రువాండా, అమెరికా తదితర 18 దేశాలు బలపర్చాయి. దాదాపు 190 సభ్యదేశాలు మద్దతిచ్చాయి. ఐరాస శాంతిదళంలో భారత్ గణనీయమైన పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం భారత్ నుంచి 6,000 మందికిపైగా జవాన్లు, పోలీసులు ఈ శాంతిదళంలో పనిచేస్తున్నారు. శాంతిదళంలో పనిచేస్తూ ఇప్పటిదాకా 177 మంది భారత జవాన్లు, పోలీసులు అమరులయ్యారు. ఏ ఇతర దేశానికి చెందినవారూ ఇంతమంది చనిపోలేదు. శాంతిదళానికి జవాన్లు, సైనికులను అందించడంలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. తీర్మానాన్ని ఐరాస సాధారణ సభ ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. మూడేళ్లలో వాల్ నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది.

బోరిస్ కావాలనే తప్పుదోవ పట్టించారు



లండన్: బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ పార్లమెంట్‌ను ఉద్దేశపూర్వకంగా పదేపదే తప్పుదోవ పట్టించారని పార్లమెంటరీ కమిటీ ఆరోపించింది. ప్రధానిగా ఉండగా కోవిడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసంలో జరిగిన విందుల గురించి తనకు తెలియదనడంపై ఈ వ్యాఖ్యలు చేసింది. కోవిడ్ సమయంలో జరిగిన విందులనే పార్టీ గేట్ కుంభకోణంగా పేర్కొంటున్నారు. 'సభను ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించిన జాన్సన్ తీవ్రమైన ధిక్కారానికి పాల్పడ్డారని భావిస్తున్నాం. ఈ ధిక్కారం మరింత తీవ్రమైంది' అని పార్లమెంట్ హక్కుల కమిటీ పేర్కొంది. పార్లమెంటరీ కమిటీ సభ్యులు తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపిస్తూ జాన్సన్ ఇటీవల ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఆ సమయంలో జాన్సన్ చేసిన వ్యాఖ్యలపైనా కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు ఆయన్ను 90 రోజుల పాటు బహిష్కరించాలని సూచించింది. రాజీనామా చేసినందున..మాజీ సభ్యులకిచ్చే పాస్‌ను జాన్సన్‌కు ఇవ్వొద్దని పేర్కొంది.

తల్లి, ఐదుగురు చిన్నారులు సజీవదహనం

కుషినగర్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని కుషినగర్ జిల్లాలో బుధవారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటికి నిప్పంటుకుని ఇంట్లో నిద్రిస్తున్న తల్లి, అయిదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారులంతా 1–10 ఏళ్లలోపు వారే. ఉర్థా గ్రామానికి చెందిన సంగీత, ఆమె అయిదుగురు పిల్లలు ఇంట్లో పడుకోగా, ఆమె భర్త, అతడి తల్లిదండ్రులు ఆరు బయట నిద్రించారు. గాఢ నిద్రలో ఉండగా అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. మంటలు అంటుకోవడంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలింది. సంగీత భర్త వారిని కాపాడేందుకు ప్రయత్నించినా మంటల తీవ్రత కారణంగా వీలు కాలేదు.సంగీతతోపాటు ఏడాది నుంచి 10 ఏళ్ల వరకు వయస్సున్న చిన్నారులు మంటలకు ఆహుతయ్యారు. ఫైరింజన్ వచ్చే సరికే ఈ ఘోరం జరిగిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

బడుగు వర్గాలపై ప్రధాని మోదీ కక్ష సాధింపు

న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్(ఓఎంఎస్ఎస్) కింద రాష్ట్రాలకు ఇచ్చే బియ్యం, గోధుమలను ఇకపై ఇవ్వకుండా కేంద్రం నిలిపివేయడాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గురువారం తప్పుపట్టారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడంతో ప్రధాని మోదీ మనోవేదనకు గురవుతున్నారని, అందుకే బడుగు వర్గాల ప్రజలపై కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ పేదల వ్యతిరేక పార్టీ అని కాంగ్రెస్ సీనియర్ నేత రణదీప్ సూర్జేవాలా ఆరోపించారు. కర్ణాటకకు కేంద్రం బియ్యం ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడాన్ని మోదీ సహించలేకపోతున్నారని మండిపడ్డారు. రాష్ట్రాలకు సెంట్రల్ పూల్ నుంచి బియ్యం, గోధుమల పంపిణీని కేంద్రం నిలిపివేసింది. పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలు ఇస్తామని హామీ ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వం దీనివల్ల నష్టపోనుంది.

రెండు క్షిపణులను పరీక్షించిన ఉత్తరకొరియా

సియోల్: అమెరికా, దక్షిణ కొరియాల సంయుక్త సైనిక విన్యాసాలు ముగిసిన వేళ ఉత్తర కొరియా గురువారం రెండు తక్కువ శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించింది. ఉభయ కొరియాల సరిహద్దుల్లో భారీగా కొనసాగిన అయిదో విడత సైనిక విన్యాసాలపై ఉత్తరకొరియా గుర్రుగా ఉంది. ఇటువంటి రెచ్చగొట్టే చర్యలపై తాము ఏదో ఒక రీతిలో తప్పక స్పందిస్తామని ఆ దేశ సైన్యం ఇప్పటికే ప్రకటించింది. తాజాగా, గురువారం సాయంత్రం ఆ దేశ రాజధాని ప్రాంతం నుంచి తూర్పు సముద్ర జలాలపైకి రెండు స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు గుర్తించామని దక్షిణ కొరియా సైన్యం ప్రకటించింది.

801 గ్రాముల బరువు ● 13.37 సెం.మీ.ల పొడవు

గిన్నిస్ రికార్డుకెక్కిన కిడ్నీ స్టోన్



కొలంబో: ఈ నెల ఒకటో తేదీన శ్రీలంక రాజధాని కొలంబోలో సైనిక ఆసుపత్రిలో ఓ రోగి కిడ్నీ నుంచి అతిపెద్ద రాయిని డాక్టర్లు విజయవంతంగా బయటకుతీశారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటిదాకా బయటపడ్డ కిడ్నీ స్టోన్స్‌లో ఇదే పెద్ద రాయిగా రికార్డుకెక్కింది. ఈ రాయి బరువు 801 గ్రాములు, పొడవు 13.37 సెంటీమీటరు. ఇది రెండు ప్రపంచ రికార్డులను బద్ధలు కొట్టడం గమనార్హం. 2004లో భారతదేశంలో 13 సెంటీమీటర్ల పొడవున్న కిడ్నీ స్టోన్‌ను, 2008లో పాకిస్తాన్‌లో 620 గ్రాముల బరువున్న రాయిని బయటకు తీశారు. శ్రీలంకలో వెలికితీసిన రాయి ఆ రెండింటినీ అధిగమించింది.

హెగ్డేవార్, సావర్కర్ చాప్టర్ల తొలగింపు

బెంగళూరు: ఆరు నుంచి పదో తరగతి వరకు కన్నడ, సాంఘిక శాస్త్రాల పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాల్లో మార్పులకు కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక రాష్ట్ర మంత్రి మండలి గురువారం ఆమోదముద్ర వేసింది. కేబినెట్ నిర్ణయాల మేరకు ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు కేబీ హెగ్డేవార్, హిందుత్వ సిద్ధాంతకర్త వి.డి.సావర్కర్ తదితరులకు సంబంధించిన పాఠ్యాంశాలను స్కూలు సిలబస్ నుంచి తొలగిస్తారు. సంఘ సంస్కర్త, విద్యావేత్త సావిత్రీభాయ్ పూలే సంబంధ పాఠ్యాంశాలు, ఇందిరా గాంధీకి నెహ్రూ రాసిన లేఖలు, అంబేడ్కర్ కవితలు తదితరాలను గతంలో బీజేపీ సర్కార్ తొలగించింది. వాటినే మళ్లీ కలిపారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం చేసిన సవరణలను పూర్తిగా రద్దుచేయాలని కేబినెట్ భేటీలో మంత్రులు నిర్ణయించారు. 'విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా వచ్చే విద్యా సంవత్సర సిలబస్‌లోనూ మార్పులు ఉంటాయి' అని కేబినెట్ వివరాలను మంత్రి వెల్లడించారు.

మా పేర్లూ తీసేయండి

న్యూఢిల్లీ: తమ అభిప్రాయాలతో ఏమాత్రం పనిలేకుండా ఇష్టానుసారంగా స్కూల్ పాఠ్యాంశాలను తొలగిస్తున్నారంటూ జాతీయ విద్యా, పరిశోధనా శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ)కి 33 మంది విద్యావేత్తలు తాజాగా లేఖ రాశారు. పాఠ్యపుస్తకాల అభివృద్ధి కమిటీ(టీడీసీ) సభ్యత్వ జాబితాలో ఉన్న తమ పేర్లను తొలగించాలంటూ ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ సక్లానీకి లేఖ రాశారు. 'ఎలాంటి హేతుబద్ధత లేకుండా పాఠ్యాంశ భాగాలను తీసేసి భారీ మార్పులు చేశారు. స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగ రూపకల్పన తదితర కీలకాంశాలను పాఠ్యాంశాలుగా రూపొందించాం. ఒరిజినల్ టెక్ట్స్‌కు సంబంధంలేనంతగా మార్పులు చేశారు. ఇవి మేం రాసిన పుస్తకాలే అని చెప్పుకునేందుకు, వీటితో అనుబంధం ఉందని భావించేందుకు మాకు కష్టంగా ఉంది. మా సమష్టి సృజనాత్మక కృషిని డోలాయమానంలో పడేశారు' అని లేఖలో పేర్కొన్నారు.



లెబనాన్‌లో ద్రవ్యోల్బణం.. కష్టజీవుల ఆగ్రహానికి నిదర్శనమీ చిత్రం. పొదుపు మొత్తాల ఉపసంహరణపై బ్యాంక్‌లు ఆంక్షలు విధించడంతో గిన్నె, అప్పడాల కర్ర, చెంచాలతో ఓ పెద్దావిడ బ్యాంక్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం. గురువారం బీరుట్‌లోని బిబ్లోస్ బ్యాంక్ బయట తీసిందీ ఫొటో.

చెరువులో చేపల మృత్యువాత


చేపలను చూస్తున్న ప్రజలు

చిక్కబళ్లాపురం: నగరం సమీపంలోని ముష్టూరు చెరువులో గురువారం ఉదయం చేపలు మృత్యువాత పడి ఉండడం చర్చనీయాంశమైంది. ఉదయం వాకింగ్‌కు వెళ్లినవారు చెరువులో పెద్దసంఖ్యలో చేపలు తేలడం చూశారు. చెరువులో ఎవరైన విషం కలిపారా, నీటి కాలుష్యమా, లేక ఎండల వల్ల ఇలా జరిగిందా అని అనుమానాలు తలెత్తాయి. కేజీ, రెండు కేజీల బరువున్న చేపలు చనిపోయి ఉన్నాయి. ఎవరూ ఈ చేపలను తినరాదని, అమ్మరాదని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

అనుమానంతో భార్య హత్య

మైసూరు: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హత్య చేశాడు. ఈ దారుణం మైసూరు నగరంలోని కేఎస్‌ఆర్‌టీసీ లేఔట్‌లో జరిగింది. హతురాలు పల్లవి (26) కాగా, భర్త లోకేష్ ఆరాధ్య. ఇతడు మైసూరులోని ఒక బ్యాంకులో అప్పులు తీసుకునేవారి ఆస్తి దాఖలాలను పరిశీలించే ఉద్యోగం చేస్తున్నాడు. తలకాడుకు చెందిన పల్లవితో 9 సంవత్సరాల క్రితం పెళ్ళి జరిగింది. ఈ దంపతులకు 7 ఏళ్ల కొడుకు ఉన్నాడు. కొంతకాలంగా భార్యపైన అనుమానం పెంచుకున్న లోకేష్ ఆరాధ్య తరచూ ఆమెతో గొడవపడేవాడు. అనేకసార్లు ఆమెను కొట్టాడు కూడా. బుధవారం రాత్రి కుమారుడు పడుకొని ఉన్న సమయంలో ఆమెను గొంతు పిసికి చంపి పరారయ్యాడు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించి లోకేష్‌ను అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

మంత్రి పీఏ పేరుతో వసూళ్ల పర్వం


నిందితుడు రఘు

బనశంకరి: మంత్రి రామలింగారెడ్డి పర్సనల్ సెక్రటరీ పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని విధానసౌధ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... ఎంబీఏ చదివిన రఘు ఇంగ్లిషులో బాగా మాట్లాడుతాడు. ఈ క్రమంలో తాను మంత్రి రామలింగారెడ్డి పర్సనల్ సెక్రటరీనని, దేవాదాయ శాఖలో బదిలీలు చేయిస్తానని చెప్పి పలువురి వద్ద డబ్బులు తీసుకున్నాడు. గతంలో ప్రియాంక్‌ఖర్గే పేరుతో ఇలాగే వంచనకు పాల్పడి అరెస్టయ్యాడు. జైలు నుంచి విడుదలై తిరిగి అదే పంథాలో మోసాలకు దిగాడు. దేవదాయశాఖలో బదిలీలు చేస్తానని కొందరు అధికారులకు ఫోన్లు చేసి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు జమ చేసుకుని, అనంతరం మొబైల్ నెంబర్‌ను బ్లాక్ చేసేవాడు. వంచనపై విధానసౌధ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు గాలించి గురువారం నిందితుడు రఘును అరెస్ట్ చేశారు.

యువకుల పిచ్చిచేష్టలు

శివాజీనగర: తాగిన మత్తులో యువకుల బృందం తోటి స్నేహితుడిని నగ్నంగా చేసి పట్టణంలో పరుగెత్తించారు. ఈ కేసులో పోలీసులు రంజిత్, దయానంద్, ఆనంద్‌లను అరెస్ట్ చేశారు. వీరు హాసన్ జిల్లా అరకలగూడుకు చెందినవారు. ఈ యువకులు ఇటీవల అరకలగూడులో పార్టీ చేసుకున్నారు. తరువాత సహచరుడు డ్యాన్స్ చేయలేదన్న కోపంతో అతడిని నగ్నంగా చేసి పట్టణంలో పరుగెత్తించారు. యువకుల పిచ్చి చేష్టలు సీసీ కెమెరాలో రికార్డయింది. ఈ వీడియో వైరల్ కావడంతో పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి ముగ్గురి అరెస్ట్ చేశారు.

మరో మదపుటేనుగు బందీ


పట్టుబడ్డ మదపుటేనుగు

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ తాలూకాలో రైతుల పాలిట తలనొప్పిగా మారిన రెండవ మదపుటేనుగు ఎట్టకేలకు పట్టుబడింది. చిక్కమన్నుగుడ్డె అటవీ ప్రాంతంలో మదపుటేనుగు గురువారం పట్టుబడింది. చెన్నేనహళ్లి, చుట్టుపక్కల గ్రామాల పరిసరాల్లో సంచరిస్తూ పంటలపైబడి విధ్వంసం సృష్టిస్తున్న మదపుటేనుగును బంధించాలని రైతులు వేడుకున్నారు. జూన్ 8వ తేదీన ఇద్దరిని బలిగొన్న మొదటి మదపుటేనుగును అటవీశాఖ అధికారులు కార్యాచరణ జరిపి బంధించిన సంగతి తెలిసిందే. రెండు ఏనుగులను బంధించడంలో పెంపుడు ఏనుగు అభిమన్యు మరో నాలుగు పెంపుడు ఏనుగులు కీలకంగా మారాయి.

విద్యాలయాల్లో నిత్యం పీఠిక పఠనం

శివాజీనగర: పాఠశాల- కాలేజీ, విశ్వవిద్యాలయాల్లో ప్రార్థన సందర్భంలో రాజ్యాంగ పీఠిక చదవడం తప్పనిసరి అని గురువారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో తీర్మానించారు. అన్ని రకాల పాఠశాలలు, కాలేజీలు వర్సిటీలలో రాజ్యాంగ పీఠిక చదవాలని నిర్ణయించారు. ప్రతి ఒక్కరూ సమానత్వం, ప్రేమ, సోదరభావంతో ఉండాలనేదే దీని ఉద్దేశమన్నారు. తద్వారా నైతికత పెరిగి, సమానత్వం విస్తరిస్తుందన్నారు.

ఆ రెండు చట్టాలకు చెల్లుచీటీ

పాత ప్రభుత్వం తెచ్చిన పలు చట్టాలపై కొత్త ప్రభుత్వం వేటు వేసింది. పార్టీ భావజాలానికి పూర్తి వ్యతిరేకం అన్న కారణంతో కాంగ్రెస్ సర్కారు వాటిని తొలగించింది. గతంలో ఎంతో చర్చ రేకెత్తించిన మత మార్పిళ్లను నిషేధిస్తూ తెచ్చిన చట్టం, అలాగే రైతులు తమ ఉత్పత్తులను ఎక్కడైనా విక్రయించుకోవచ్చని పేర్కొనే ఏపీఎంసీ సవరణల చట్టాలకు, విద్యాలయాల పాఠ్యాంశాల్లో సంఘ్, హిందూ అంశాలకు పెద్దపీట వేసిన సవరణలకు తిలోదకాలు ఇచ్చారు.

- మత మార్పిడి నిరోధక చట్టం, ఏపీఎంసీ చట్టాలు రద్దు
- పాఠ్యాంశాల సవరణలు కూడా వెనక్కి
- కేబినెట్ భేటీలో నిర్ణయాలు


గత బీజేపీ సర్కారు చేసిన చట్టాల రద్దు




ఉన్నతాధికారులతో సీఎం సిద్దు చర్చలు

సాక్షి, బెంగళూరు: గత బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పలు చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. మత మార్పిడుల నిరోధక చట్టంతో పాటు ఏపీఎంసీ చట్టం ఇందులో ఉన్నాయి. సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో గురువారం విధానసౌధలో మంత్రివర్గ సమావేశం జరిగింది. భేటీ అనంతరం తీసుకున్న నిర్ణయాలను న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు. ఈ రెండు చట్టాలను రద్దు చేస్తూ తీర్మానించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో పాఠ్యాంశాల సవరణలను కూడా ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. గతంలో ఎలాంటి సవరణలు లేకుండా ఉన్న పాఠ్యాంశాలనే బోధనలో కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ధార్మిక హక్కుల రక్షణ చట్టంలో చేసిన సవరణను ఉపసంహరించుకుంటున్నట్లు, ఇందుకోసం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతామని తెలిపారు. ఏపీఎంసీ చట్టం వల్ల లక్షలాది కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయని, ఈ చట్టం వల్ల వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారం గణనీయంగా తగ్గిపోయిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఏపీఎంసీ కార్యకలాపాలు రూ. 600 కోట్ల నుంచి రూ. 100 కోట్లకు పడిపోయినట్లు చెప్పారు.

కేబినెట్‌లో తీసుకున్న కొన్ని నిర్ణయాలు

- పాఠ్య పుస్తకాల సవరణలకు విద్యా శాఖ ప్రతిపాదనలకు ఆమోదం
- కర్ణాటక హైకోర్టు పరిపాలన, ఖర్చులు, అధికార పరిమితులు పెంచుతూ తీర్మానం
- కేపీఎస్సీలో ఖాళీగా ఉన్న ముగ్గురు సభ్యుల భర్తీ అధికారం సీఎంకి అప్పగింత
- రూ. 1081 కోట్ల ఖర్చుతో 243 ఎంఎల్‌డీల వృషభావతి నీటిని 70 చెరువులకు తరలించే ప్రాజెక్టుకు ఆమోదం. దీనివల్ల బెంగళూరు, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ జిల్లాల చెరువులకు నీరందుతుంది
- ఎమ్మెల్యేల అనర్హత చట్టం సవరణలపై న్యాయ సలహాలు తీసుకోవాలని తీర్మానం
- సాంఘిక సంక్షేమ శాఖ తీసుకొచ్చిన ప్రతిపాదన ప్రకారం ప్రతి కాలేజీ, పాఠశాలలో రాజ్యాంగ పీఠికను తప్పనిసరిగా చదవాలని నిర్ణయం
- ఆర్టీసీ సంస్థల్లో మోటార్ ట్యాక్స్, బకాయిల కింద రూ 79.85 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని మాఫీ చేస్తూ నిర్ణయం
- ఆర్టీసీలో డబుల్ డెక్కర్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు కోసం రూ. 28 కోట్లు విడుదలకు అనుమతులు
- రవాణా శాఖ సిబ్బంది వేతనాలను 15 శాతం మేర పెంచాలని తీర్మానం.

వృత్తివిద్యా కోర్సుల ఫీజుల్లో మార్పు లేదు: మంత్రి

బనశంకరి: ఇంజనీరింగ్‌తో పాటు వృత్తిపర కోర్సుల ఫీజు గత ప్రభుత్వమే 10 శాతం పెంచిందని, కొత్తగా మార్పులు చేయలేదని ఉన్నత విద్యాశాఖ మంత్రి ఎంసీ.సుధాకర్ చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ... గత ఏడాది ఇంజనీరింగ్ కోర్సుకు ప్రభుత్వ కాలేజీల్లో గత ఏడాది రూ.38,200, ఎయిడెడ్ కాలేజీ, ప్రైవేటు కాలేజీల్లో రూ.91,796 , ద్వితీయశ్రేణి ఎయిడెడ్‌రహిత కాలేజీల్లో రూ.98,984 ఫీజు ఉండేది. ఈ ఏడాది దాంతో పాటు 10 శాతం అదనం కానుందని తెలిపారు. బీ ఫార్మసీ కోర్సుకు ప్రభుత్వ కాలేజీల్లో రూ.14,530, ఎయిడెడ్ రహిత కాలేజీల్లో రూ.26,500, డీఫార్మసీ కోర్సుకు ఎయిడెడ్ రహిత కాలేజీల్లో రూ.67,500, పశువైద్య కోర్సులకు ప్రభుత్వ కాలేజీల్లో రూ.53,170, మత్స్య, పశుసంవర్ధక కోర్సులకు రూ.29,170 ఫీజు గత ఏడాది నిర్ణయించారని తెలిపారు.

ఇంటికి రూ.7 లక్షల కరెంటు బిల్లు

బనశంకరి: మంగళూరు వద్ద ఉళ్లాల బైల్ నివాసి సదాశివ ఆచార్య ఇంటికి రూ.7 .71 లక్షల కరెంటు బిల్లు రావడంతో ఆయన భయాందోళనకు గురయ్యారు. మీటర్ రీడింగ్ తప్పు చూపిస్తోందని చెప్పినా మెస్కాం అధికారులు పట్టించుకోలేదు. ఇంటికి వచ్చిన బిల్లులో.. 99,338 యూనిట్లు వాడినట్లు, అందుకుగాను రూ.7,71,07 బిల్లు నమోదు చేశారు. తమకు నెలకు సరాసరి రూ.3 వేలు మాత్రమే బిల్లు వస్తుందని, ప్రతినెల చెల్లిస్తున్నామని ఆయన చెప్పాడు. ఇంత మొత్తంలో బిల్లు రావడం ఎలా సాధ్యమని వాపోయారు.

బియ్యంపై అబద్ధాలు చెప్పొద్దు

- సిద్దుపై బొమ్మై మండిపాటు

శివాజీనగర: రేషన్ పంపిణీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బియ్యం ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేసే ఆరోపణలు నిజం కాదని, బియ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తోందని మాజీ సీఎం బసవరాజ బొమ్మై విమర్శించారు. గురువారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, కేంద్ర ప్రభుత్వ ఆహార భద్రతా చట్టం కింద అన్ని రాష్ట్రాలకు ప్రతి వ్యక్తికి 5 కే.జీల బియ్యాన్ని ఇస్తూ ఉంది, సిద్దరామయ్య 10 కేజీలు ఇస్తానన్నారు, కానీ కేంద్రంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బియ్యం పంపిణీ చేసేందుకు ఆయన ఇతర మార్గాలను కూడా అన్వేషించాలన్నారు. లేని పక్షంలో కేంద్రానికి లేఖ రాసి కేంద్ర మంత్రితో చర్చించాలన్నారు. గ్యారంటీ ప్రకారం జూలై 1 నుండి కాంగ్రెస్ ప్రభుత్వం 10 కే.జీ.ల బియ్యం ఇవ్వాలి. లేనిపక్షంలో బీజేపీ పోరాటం చేపడుతుంది. బియ్యాన్ని వేరే సంస్థల నుంచయినా కొనుగోలు చేయాలి, లేకపోతే అదే మొత్తం డబ్బును ప్రజల ఖాతాల్లోకి వేయాలని డిమాండ్ చేశారు. సిద్దరామయ్య ఇప్పటికే నెలరోజులు ఆలస్యం చేశారన్నారు.

ఉచిత ప్రయాణం కొన్నాళ్లే

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం మోసపూరితం, ఇది ఎక్కువ రోజులు ఉండదని బొమ్మై అన్నారు. గ్యారంటీ పథకాలకు ఏటా రూ.90 వేల కోట్లు ఖర్చవుతుందని తమ అంచనా అన్నారు. కరెంటు చార్జీల పెంపులో తమ సర్కారు ప్రమేయం లేదన్నారు.

పెళ్లి పేరుతో మహిళకు టోపీ

- భారీగా నగలు, నగదుతో పరార్



మైసూరు: డాక్టర్‌నని చెప్పి మహిళా ఐటీ ఇంజినీర్‌ను నమ్మించిన వంచకుడు ఆమె వద్ద నుంచి రూ. 15 లక్షల నగదు, బంగారు ఆభరణాలు తీసుకుని ఉడాయించిన ఘటన మైసూరు నగరంలో చోటుచేసుకుంది. బాధితురాలు బెంగళూరు నగరానికి చెందిన హేమలత (45). మోసగాడు మైసూరు ఆర్టీనగరకు చెందిన మహేశ్. కొద్ది రోజుల క్రితం పెళ్లి సంబంధాల వెబ్‌సైట్లో హేమలతకు మహేశ్ పరిచయం అయ్యాడు. తాను ఒక ఆర్థో వైద్యుడినని, మైసూరులో ఉంటున్నట్లు చెప్పాడు. త్వరలో క్లినిక్ కూడా పెడుతున్నట్లు ఆమెను నమ్మించాడు. బాధిత మహిళ నిజమని నమ్మింది. అనంతరం ఇద్దరు విశాఖ పట్టణం వెళ్లి అక్కడ పెళ్లి చేసుకున్నారు.

లోన్ పేరుతో నాటకం

పెళ్లి తరువాత దంపతులు మైసూరుకు వచ్చారు. క్లినిక్ పెట్టడానికి రూ. 70 లక్షలు అవసరమని, లోన్ తీసి ఇవ్వాలని హేమలతను కోరాడు. ఆమె ఒప్పుకోలేదు. ఒత్తిడి చేసి బెదిరించాడు. ఆమె ససేమిరా అనడంతో, ఒకరోజు ఆమె నిద్రలో ఉండగా బీరువాలో ఉన్న 20 తులాల బంగారు, రూ. 15 లక్షల నగదు తీసుకుని పారిపోయాడు. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహిళకు నిర్మాత నిలువుదోపిడీ

బనశంకరి: సినిమాలో అవకాశం ఇప్పిస్తానని నమ్మించి మహిళ నుంచి రూ.75 లక్షలు తీసుకుని లైంగికంగా వేధించిన కేసులో నిర్మాత కుమార్‌ను గురువారం జ్ఞానభారతి పోలీసులు అరెస్ట్‌చేశారు. రెండేళ్ల క్రితం బాధిత మహిళ అతనికి పరిచయమైంది. నేను సినీ నిర్మాతను, రెండు సినిమాలను తీస్తున్నాను, అందులో నీకు అవకాశం ఇస్తానని నమ్మించాడు. ఆమె వద్ద రూ.75 లక్షలు తీసుకోవడంతో పాటు లైంగికంగా వాడుకున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే మీ కుమారుడిని హత్యచేస్తానని బెదిరించాడు. ఇతడి వేధింపులు తాళలేక బాధితురాలు జ్ఞానభారతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి గురువారం నిందితున్ని అరెస్ట్‌చేశారు.

దారితప్పిన అధ్యాపకుడు


ఆందోళన చేస్తున్న విద్యార్థులు


లెక్చరర్ గదిలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం

- వేధింపులపై విద్యార్థుల రౌద్రరూపం


తుమకూరు: విద్యా బుద్ధులు నేర్పాల్సిన అధ్యాపకుడు దారితప్పాడు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవరిస్తుండటంతో అతనిపై చర్యలు తీసుకోవాలని తుమకూరు జిల్లా తిపటూరు నగరంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. వివరాలు... కళాశాలలో వాణిజ్య విభాగంలో లెక్చరర్‌గా పనిచేస్తున్న రంగనాథ్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారి నంబర్లకు ఫోన్లు, చాటింగ్ చేస్తున్నాడు. సరదాగా వారితో తీసుకున్న ఫొటోలను సోషల్ మీడియాతో అప్‌లోడ్ చేసి అశ్లీల మెసేజ్‌లు పెట్టాడు. దీంతో గురువారం ఉదయం ఒక్కసారిగా 1500 మంది విద్యార్థులు తరగతులు బహిష్కరించి ధర్నాకు దిగారు. అంతకు ముందు లెక్చరర్‌ను గదిలో బంధించి అక్కడే బైఠాయించి, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు విద్యార్థులను శాంతింప చేసి రంగనాథ్‌ను అక్కడికి నుంచి తరలించారు.

పింక్ వాట్సాప్ పేరుతో మోసం

యశవంతపుర: ఆన్‌లైన్ మోసగాళ్లు పింక్ వాట్సాప్ పేరుతో మోసాలకు దిగుతున్నట్లు ఉడుపి పోలీసులు హెచ్చరికలను జారీ చేశారు. ఎక్కువ ఫీచర్సు ఉన్నాయని పింక్ రూపంలో వాట్సాప్ నకిలీ యాప్‌ను విడుదల చేశారు. అవసరం ఉన్నవారు ప్రయత్నిస్తే లింక్‌ను ఎస్ఎంఎస్ పంపుతారు. నమ్మిన అనేక మంది లింక్‌ను నొక్కి పింక్ వాట్సాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. పింక్ వాట్సాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవటం ద్వారా హ్యాకర్లు మొబైల్‌లోని ఫొటోలు, ఫోన్ నంబర్లను, నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌తో పాటు విలువైన సమాచారాన్ని చోరీ చేస్తున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు. పింక్ వాట్సాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొవద్దని ఉడుపి ఎస్పీ అక్షయ్ హాకే మశ్చేంద్ర ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పోలీస్‌ను కాటేసిన క్యాన్సర్ రక్కసి

- తండ్రీ కూతురికి అదే జబ్బు..
- విరక్తితో తండ్రి ఆత్మహత్య


కానిస్టేబుల్ కుమార్ (ఫైల్)

సాక్షి, బెంగళూరు: క్యాన్సర్‌తో బాధపడుతున్న పోలీస్ కానిస్టేబుల్, తన కూతురికి కూడా ఈ మహమ్మారి సోకిందని తెలిసి కుంగిపోయాడు. తన వల్లే ఇలా జరిగి ఉంటుందని కుమిలిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. బెంగళూరు అశోకనగర ట్రాఫిక్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ కుమార్ (44) మృతుడు. కుమార్ స్వస్థలం దావణగెరె జిల్లా చెన్నగిరి తాలూకా. బెంగళూరులో ఉద్యోగం చేస్తూ డెయిరీ సర్కిల్ వద్ద ఉన్న పోలీసు క్వార్టర్స్‌లో కుటుంబంతో కలసి ఉంటున్నాడు. గత కొన్నేళ్ల నుంచి కుమార్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఇటీవల తన కుమార్తెలో కూడా కేన్సర్ లక్షణాలు కనిపించాయి. దీంతో కుమార్తెకు చికిత్స చేయిస్తుండగా ఆరోగ్యం కుదుటపడుతోంది. అయితే తరచూ తన వల్లే తన కుమార్తెకు కూడా కేన్సర్ వచ్చిందని మథనపడేవాడు. ఈ బాధతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మరణించాడు. కాగా ఆయన కళ్లను కుటుంబసభ్యులు దానం చేసి పెద్దమనసు చాటుకున్నారు. మృతదేహాన్ని సొంతూరుకి తరలించారు.

సొంత కూతురనే జాలి లేకుండా...

- తుమకూరు జిల్లాలో పరువు హత్య



తుమకూరు: పరువు మర్యాదల పేరుతో అనుబంధాలను అంతమొందిస్తున్నారు. దళిత యువకున్ని ప్రేమించి పెళ్ళి చేసుకున్న తుమకూరు జిల్లాలోని గుబ్బి తాలూకాలోని చిక్కహెడిగెహళ్ళి గ్రామానికి చెందిన యువతిని కుటుంబ సభ్యులే హతమార్చారు. ఈ కేసులో యువతి తండ్రితో పాటు ముగ్గురిని అరెస్టు చేశారు. జడిగేనహళ్ళి గ్రామానికి చెందిన అగ్రవర్ణానికి చెందిన నేత్రావతి (20) హతురాలు.

డిగ్రీ చదువుతూ ప్రేమ, పెళ్లి

వివరాలు. నేత్రావతి శిరాలో డిగ్రీ చదువుతూ హాస్టల్లో ఉంటోంది. శిర తాలూకాకు చెందిన ఎస్సీ యువకుడిని ప్రేమించి, రెండు వారాల క్రితం ఇద్దరూ దూరంగా వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. ఇది తెలిసి యువతి తండ్రి పరుశరామ, సోదరుడు శివరాజు, చిన్నాన్న తుకారం ఆగ్రహంతో రగిలిపోయారు. అంతటా గాలించి యువతిని ఇంటికి తీసుకొచ్చారు. వారంరోజుల కిందట ఆమెను కొట్టి తాడుతో గొంతుకు బిగించి ఉరివేసి చంపినట్లు సమాచారం. యువతి ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులను నమ్మించి అంత్యక్రియలు పూర్తిచేశారు. కానీ గ్రామస్తులకు అనుమానం వచ్చి చేళూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు పై ముగ్గురినీ ఠాణాకు పిలిపించి ప్రశ్నించడంతో హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారిని గురువారం అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఈటీలో బాలికల హవా


- మొత్తం 1.66 లక్షల మంది అర్హత

బనశంకరి: వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన కర్ణాటక సీఈటీ (కే సెట్) ఫలితాలు వెల్లడి కాగా అన్ని విభాగాల్లో బాలికలే పైచేయి సాధించారు. బెంగళూరు విద్యార్థి విఘ్నేష్ నటరాజ్‌కుమార్ 97.89 మార్కులు సాధించి మొదటి ర్యాంక్ సాధించాడు. గురువారం మల్లేశ్వరంలోని పరీక్షా ప్రాధికార కార్యాలయంలో ఉన్నత విద్యా మంత్రి ఎంసీ సుధాకర్ సీఈటీ ఫలితాలను విడుదల చేశారు. ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, ఆయుర్వేద, హోమియోపతి, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్‌తో పాటు పలు వృత్తిపర కోర్సుల ప్రవేశంకోసం గత నెల 20 నుంచి 22 వరకు సీఈటీ పరీక్షలను నిర్వహించగా 2,44,345 మంది విద్యార్థులు రాశారు.

విభాగాలవారీగా అర్హత

ఇంజనీరింగ్‌కు 2,03,381 మంది, అగ్రి కోర్సులకు 1,64,187 మంది, వెటరినరీకి 1,66,746 మంది, యోగా, నేచురోపతికి 2,06,191 మంది, బీ ఫార్మసీకి 2,06,340 మంది అర్హత సాధించారు. మొత్తం 1,66,808 మంది అర్హత సాధించారని మంత్రి సుధాకర్ తెలిపారు. ప్రతి విభాగంలో అర్హుల్లో సగానికిపైగా బాలికలే ఉండడం విశేషం. త్వరలోనే కౌన్సెలింగ్ తేదీలను ప్రకటిస్తామన్నారు.

టాప్–10 ర్యాంకర్లు వీరే

1 బెంగళూరు ఉత్తరహళ్లి విద్యార్థి విఘ్నేశ్ ఫస్ట్ ర్యాంక్
2 బెంగళూరు జయనగర ఆర్‌వీ కాలేజీ అర్జున్ కృష్ణస్వామి ద్వితీయ ర్యాంక్
3 హుబ్లీ విద్యానికేతన్ పీయూకాలేజీ విద్యార్థి సమృద్ధ్ శెట్టి- మూడోర్యాంక్
4 బళ్లారి తోరణగల్లు జిందాల్ విద్యామందిర సుమేధ్ -4వ ర్యాంక్
5 బెంగళూరు మారతహళ్లివాసి మాధవ్ సూర్య - 5 ర్యాంక్
6 జయనగరవాసి సుజిత్ అడిగ- 6 వ ర్యాంక్
7 శంకరనగర నారాయణ విద్యార్థి ఉజ్వల్ ఎల్.శంకర్- 7 ర్యాంక్
8 బెంగళూరు విద్యార్థి రిషిత్ గుప్తా -8 వ ర్యాంక్
9 బెంగళూరు కనకపుర రోడ్డు విద్యార్థి అభినవ్- 9వ ర్యాంక్
10 బెంగళూరు కనకపుర రోడ్డు విద్యార్థి భువన్ కే.ప్రసాద్- 10వ ర్యాంక్ సాధించారు.


ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి సుధాకర్

మంటల్లో స్కూల్ బస్సు


మంటల్లో కాలిపోతున్న స్కూల్ బస్సు

- షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన బస్సు
- విద్యార్థులు, ఉపాధ్యాయులు క్షేమం

హొసపేటె: పిల్లలను తీసుకెళ్తున్న పాఠశాల బస్సు ఆకస్మికంగా దగ్ధమైన సంఘటన గురువారం విజయనగర జిల్లా కొట్టూరు తాలూకా అయ్యనహళ్లి గ్రామ సమీపంలో జరిగింది. కొట్టూరు తాలూకా తరళబాళు విద్యా సంస్థకు చెందిన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఉదయం పాఠశాల బస్సులో వెళ్తుండగా మార్గ మధ్యంలో బస్సులో మంటలు చెలరేగాయి. గమనించిన బస్సు డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేసి విద్యార్థులను సురక్షితంగా కిందకు దింపేశారు. బస్సులో ఉన్న 45 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు, ఆయాతో పాటు మొత్తం 50 మంది ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

బస్సు మంటల్లో పూర్తిగా కాలిపోయింది. డ్రైవర్ అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని బస్సుకు అంటుకొన్న మంటలను ఆర్పివేశారు. కొట్టూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కూడ్లిగి విద్యాశాఖ అధికారి బసవరాజ్ ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థుల్లో ధైర్యం నింపి వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలందరూ క్షేమంగా ఉండడంతో తల్లిదండ్రులు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

చట్టసవరణను విరమించుకోవాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు

బళ్లారి టౌన్: రైతులకు ప్రమాదకరమైన ఏపీఎంసీ, భూ స్వాధీన చట్ట సవరణలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి పదాధికారులు డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం నేతలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి తమ వినతి పత్రాన్ని జిల్లాధికారికి సమర్పించారు.

రాయచూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీఎంసీ, భూ సంస్కరణ, విద్యుత్ ప్రైవేటీకరణ చట్టాలను ఉపసంహరించుకోవాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. గురువారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ధర్నానుద్దేశించి సంచాలకుడు చామరస మాలిపాటిల్ మాట్లాడారు. అనంతరం స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అగ్నిబాధిత రైతుకు పరామర్శ



కాలిన గడ్డివామిని పరిశీలిస్తున్న నాయకులు

గంగావతి రూరల్: తాలూకాలోని గూగిబండ క్యాంపులో షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివామికి మంటలు అంటుకుని పశుగ్రాసం కాలిబూడిదైన రైతు బైలప్ప గడ్డివామిని గురువారం కేఆర్‌పీపీ నాయకులు పరిశీలించారు. అనంతరం రైతు ఇంటికి వెళ్లి పరామర్శించి రైతుకు ధైర్యం చెప్పారు. రాష్ట్ర యువ ఘటక అధ్యక్షులు భీమాశంకర పాటిల్, పార్టీ జిల్లా అధ్యక్షులు మనోహర గౌడ, పార్టీ నగర అధ్యక్షులు వీరేశ బలకుంది, యువ అధ్యక్షులు హొసమని రమేశ్ నాయక, కృష్ణసా దలభంజన, ఆనెగుంది జెడ్పీ టి.జి.బాబు, మంజునాథ కలాల్, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత మండలికి చైర్మన్‌ను నియమించండి

రాయచూరు రూరల్: చేనేత అభివృద్ధి మండలికి నూతన చైర్మన్‌ను నియమించాలని చేనేతకారుల యువ సంఘం సంచాలకుడు విజయ్ కుమార్ బ్రాప్రి డిమాండ్ చేశారు. ఆయన గురువారం బెంగళూరులో మంత్రి నాగేంద్రను కలిసి పైమేరకు విన్నవించారు. పద్మశాలి సమాజంలో గంగావతికి చెందిన కె.కాళప్పను అధ్యక్షుడిగా నియమించాలని సీఎంకు వివరించాలన్నారు. ఉత్తర కర్ణాటకలో బాగల్‌కోటె, గంగావతి, బళ్లారి, ఇలకల్, హావేరి, గదగ్ ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

సాక్షి,బళ్లారి: టైర్ పంచర్ కావడంతో చక్రాన్ని మార్చుతుండగా కేఎస్‌ఆర్‌టీసీ బస్సులో నుంచి దిగిన మహిళను లారీ ఢీకొనడంలో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. బెంగళూరు నుంచి కొప్పళకు బయలుదేరిన ఆర్టీసీ బస్సును మార్గమధ్యంలో చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకాలో జాతీయ రహదారిపై టైర్ పంచర్ కావడంతో ఆపారు. దీంతో బస్సులో ఉన్న వారు కొంత మంది కిందకు దిగారు. అదే సమయంలో గంగావతి తాలూకాకు చెందిన మల్లమ్మ(37) అనే మహిళ కూడా బస్సు నుంచి దిగి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అప్పుల బాధతో రైతు అత్మహత్య



రైతు శరణబసవ

రాయచూరు రూరల్: అప్పుల బాధ తాళలేక ఓ రైతు అత్మహత్య చేసుకున్న ఉదంతం జిల్లాలో చోటు చేసుకుంది. సింధనూరు తాలూకా జవళగేరలోని తన ఇంట్లో చేసిన అప్పులు తీర్చలేక ఉరి వేసుకొని శరణబసవ(33) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రెండు ఎకరాల భూమిలో సాగు చేసిన పంటలకు సకాలంలో వానలు కురువక పోవడంతో నష్టం వాటిల్లింది. సిండికేట్ బ్యాంక్‌లో చేసిన రూ.2 లక్షలకు తోడు రూ.6 లక్షల మేర అప్పు ఉన్నట్లు తెలిపారు. మృతునికి సంగీత(12), స్వప్న(9), సన్నిధి(5) అనే ముగ్గురు కుమార్తెలు సంతానం. భార్య బసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒడ్డుకు వచ్చిన మృతదేహం



యువకుడు సంతోష్ (ఫైల్)

యశవంతపుర: మురుడేశ్వర వద్ద సముద్రంలో కొట్టుకుపోయిన యువకుడి మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. మృతుడిని బెండిగేరికి చెందిన సంతోష శావంత పులిహొండ (19)గా గుర్తించారు. ఈ నెల 12న కలఘటిగి నుంచి 21 మంది విద్యార్థులు మురుడేశ్వర విహారయాత్రకు వెళ్లారు. సముద్రంలోకి దిగిన వీరు ఎత్తైన అలలు రావటంతో సంతోష్ సముద్రంలోకి కొట్టుకుపోయాడు. గురువారం మృతదేహం ఒడ్డుకు రావడంతో కుటుంబసభ్యులకు అప్పగించారు.

కన్య భాగ్యను అమలు చేయరూ

- వినూత్న తరహాలో ప్రభుత్వానికి ఓ యువకుడు విజ్ఞప్తి

సాక్షి,బళ్లారి: ఏ గ్రామం, పట్టణం, నగరంలోనైనా తమ గ్రామానికి మంచినీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, రోడ్లు వేయాలని, ఆస్పత్రి, పాఠశాల, విద్యార్థులకు వసతి నిలయాలు ఇలా ఎన్నో సమస్యలను పరిష్కరించాలని పాలకులకు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం చూస్తుంటాం. అయితే ఇక్కడ ఓ యువకుడు తాను పెళ్లి చేసుకోవాలనుకున్నానని, ఎంతో మంది కన్యలను చూసినా తనకు పెళ్లి కుదరడం లేదని, ప్రభుత్వం తక్షణం కన్య భాగ్య పథకాన్ని ప్రవేశపెట్టాలని అధికారులకు వినతిపత్రం సమర్పించడం చర్చనీయాంశమైంది. గురువారం గదగ్ జిల్లా ముండరిగి తాలూకా డంబరిగి గ్రామ పంచాయతీ అధికారికి కాంట్రాక్టర్ ముత్తు హూగార్(28) అనే యువకుడు ప్రభుత్వం కన్య భాగ్య పథకాన్ని ప్రవేశ పెట్టాలని విన్నవించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్నభాగ్య, గృహలక్ష్మీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర ఐదు గ్యారంటీలను అమలు చేస్తోందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుంటున్న కాంగ్రెస్ సర్కార్ యువకులకు కూడా కన్య భాగ్య ప్రవేశ పెట్టి పెళ్లి కాని యువకులకు పెళ్లి అయ్యే భాగ్యం కల్పించాలని విన్నవించడం విశేషం

సంపాదన ఉన్నా పెళ్లి కావడం లేదు

తనకు నెలకు రూ.50 వేలకుపైగా సంపాదన ఉందని, అందంగా ఉన్నానని, అయితే ప్రభుత్వ ఉద్యోగం లేదనే ఉద్దేశ్యంతో అమ్మాయిలు పెళ్లి చేసుకోవడానికి ముందుకు రావడం లేదని, 30 ఏళ్ల వయస్సు సమీపిస్తున్నా ఇంకా పెళ్లికాకపోవడం తనకు ఎంతో బాధగా ఉందని, తన బంధువులు కూడా పెళ్లి కాని హూగార్ అంటూ హేళనగా చూస్తున్నారని వాపోయాడు. ఈ నేపథ్యంలో తనకు కులం, మతంతో పని లేదని, తనను అర్థం చేసుకుని జీవించాలకునే అమ్మాయిని ఎవరినైనా పెళ్లి చేసుకుంటానని, అందుకు ప్రభుత్వం కన్య భాగ్య పథకం ప్రవేశపెడితేనే పెళ్లి కుదిరే అవకాశం ఉంటుందని పేర్కొనడం గమనార్హం. వినతిపత్రంలో పెళ్లి సంబంధించిన వివరాలు పొందపరచడంతో అక్కడున్న వారంతా ఇదేదో కొత్త సమస్యగా ప్రభుత్వానికి చేరుతుందని చర్చించుకున్నారు. అనంతరం వినతిపత్రం తీసుకున్న అధికారి తాను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు. కాగా కన్య భాగ్య పథకాన్ని ప్రవేశపెట్టాలని యువకుడు కోరిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది.



కన్య భాగ్యను ప్రవేశపెట్టాలని కోరుతూ ఇచ్చిన వినతిపత్రం, యువకుడు ముత్తు హూగార్

నేటి నుంచి గృహలక్ష్మి దరఖాస్తులు

- రేషన్ కార్డు దారులే అర్హులు: మంత్రి
- ఆగస్టు 18న పథకం ప్రారంభం

శివాజీనగర: ఇంటి మహిళకు నెలకు రూ. 2 వేల సాయం అందించే గృహలక్ష్మీ పథకానికి నేడు శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకారం మొదలవుతుందని, ఆగస్టు 18న ఈ పథకాన్ని బెళగావిలో సీఎం ప్రారంభిస్తారని మహిళా, శిశు సంక్షేమ మంత్రి లక్ష్మీ ఆర్.హెబ్బాళ్కర్ తెలిపారు. రేషన్ కార్డు ఉన్న మహిళలు మాత్రమే దరఖాస్తు చేయాలన్నారు. గురువారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు సమర్పణకు ఆఖరి తేదీ ఉండదని, నిరంతరం జరుగుతూ ఉంటుందని చెప్పారు. సేవాసింధు పోర్టల్, బెంగళూరు వన్, కర్ణాటక వన్, గ్రామ వన్ కేంద్రాల్లో, లేదా గ్రామ పంచాయితీ కేంద్రం, ఆయా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తులను అందజేయవచ్చని తెలిపారు. రాష్ట్రంలో బీపీఎల్, ఏపీఎల్, అంత్యోదయ కార్డులు కలిగిన కుటుంబ యజమానులు దరఖాస్తు చేయవచ్చు. రేషన్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా కాపీ తదితర వివరాలను సమర్పించాలి.

పన్ను చెల్లించేవారికి నో

ఆదాయపు పన్ను (ఐటీ) చెల్లించేవారికి ఈ పథకం వర్తించదు, భార్యాభర్తల్లో ఎవరు పన్ను చెల్లిస్తున్నా అనర్హులే అవుతారని చెప్పారు. తప్పుడు సమాచారం ఇచ్చేవారిని కనిపెట్టేందుకు ఇ-గౌర్నెస్ కింద తనిఖీ చేస్తామన్నారు. ఈ పథకానికి సంవత్సరానికి రూ.30 వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు.



సీఈటీలో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా



బీఆర్.మనోజ్



సీజీ.రీష్మ



సిరి శెట్టి



గగన్‌దీప్



కే.సౌమ్యశ్రీ



సాయి మౌనిక

బళ్లారి అర్బన్: 2022-23వ విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష(సీఈటీ)లో నగరానికి చెందిన శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు తమ సత్తాను చాటారు. బీఆర్.మనోజ్ 104వ ర్యాంకు(ఏజీఆర్ఐ), ఇంజినీరింగ్‌లో 647వ ర్యాంకు, సీజీ.రీష్మ 161వ ర్యాంకు(వీఏటీ), సిరి శెట్టి 478వ ర్యాంకు(బీఎస్‌వైఎస్), గగన్‌దీప్ 482 ర్యాంకు(బీఎస్‌వైఎస్), కే.సౌమ్యశ్రీ 925వ ర్యాంకు(ఏజీఆర్ఐ), సాయి మౌనిక 1044వ ర్యాంక(బీఎస్‌వైఎస్), టీ.యశ్వంత్ 1635 ర్యాంక్(ఇంజినీరింగ్), హర్షితరాణి 2627 ర్యాంకు(బీఎస్‌వైఎస్)లతో పాటు పలువురు విద్యార్థులు కూడా ఉత్తమ ర్యాంకులను సాధించారు. వీరిని కళాశాల పాలక మండలి అధ్యక్షులు డాక్టర్ రాధాకృష్ణ, సిబ్బంది, అధ్యాపకులు అభినందించారు.

అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు



లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తున్న దృశ్యం

హొసపేటె: గ్రామ పంచాయతీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేస్తామని జిల్లాధికారి వెంకటేష్ తెలిపారు. గురువారం స్థానిక ఇండోర్ స్టేడియం హాలులో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. తాలూకా వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు 2వ పర్యాయం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు రిజర్వేషన్లు పారదర్శకంగా కల్పిస్తామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని, మహిళలకు 50 శాతం వరకు రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. అదనపు జిల్లాధికారి అనురాధ, శివ ప్రకాష్ వస్తద, తహసీల్దార్ విశ్వజిత్ మెహ్తా, టీపీ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లు బాదుడుపై జనం కంగారు

- లక్షల్లో కరెంట్ బిల్లు కట్టలేమంటున్న రైస్ మిల్లర్లు



సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న దృశ్యం

గంగావతి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా కరెంట్ బిల్లులు చెల్లించం, విద్యుత్ మీటర్లను తొలగించండి అంటూ విద్యుత్ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్న ప్రజలను ఇప్పటి వరకు చూసాం. నగరంలో స్థానికులు అధికంగా కరెంటు బిల్లు వేశారంటూ గురువారం పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులతో పాటు రైస్ మిల్లర్లు ఏకధాటిగా కరెంటు ఆఫీసు అధికారులతో చర్చలకు దిగారు. ఎఫ్‌ఎస్‌ఈతోపాటు అదనపు చార్జీలను తొలగించి గంగావతి డివిజన్ కార్యనిర్వాహక అధికారి రియాజ్ అహ్మద్‌తో మాట్లాడగా స్పందించిన అధికారి కేఈఆర్‌సీ నిబంధనల ప్రకారం పైనుంచి వచ్చిన ఆర్డర్ ప్రకారం మే కరెంటు బిల్లులో ఎఫ్ఎస్ఈతోపాటు అదనపు చార్జీలను పెంచారని, ఇలాంటివి చర్చించడానికి కేబినెట్ మీటింగ్‌లో ఏం నిర్ణయం తీసుకుంటారో దానిపై ఆధారపడి ఉంటుందని, అంతవరకు పై నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారమే కరెంటు బిల్లులు ఇచ్చామని సమాధానం ఇచ్చారు. ఇందుకు రైస్ మిల్లర్లు అందరూ అందుకు తాము ఒప్పుకోబోమని, పాత బిల్లుల ప్రకారమే బిల్లులు చెల్లిస్తామని సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు ఎం.వీరేష్, కుమార్, చెన్నబసవ, గణేష్, నందకిశోర్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యుడు ఎం.సర్వేష్, నగరసభ సభ్యులు సింగనాళ ఉమేశ్, జోగద నారాయణప్ప నాయక, జోగద కృష్ణప్ప నాయక, బసాపట్న రవి తదితరులు పాల్గొన్నారు.

విమ్స్ విశ్రాంత వైద్యుడు నాగరాజ్ మృతి



డాక్టర్ కొండ్లహళ్లి నాగరాజ్ (ఫైల్)

బళ్లారి రూరల్: విమ్స్ ఆప్తాల్మాలజీ(కంటి విభాగం)లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన డాక్టర్ కొండ్లహళ్లి నాగరాజ్ గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన గత నెల రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మధ్యాహ్నం 2.10 గంటలకు తుదిశ్వాస విడిచారని వైద్యులు తెలిపారు. డాక్టర్ నాగరాజ్ స్వగ్రామం రాంపురం సమీపంలోని కొండ్లహళ్లి. విమ్స్‌లో ఉద్యోగరీత్యా బళ్లారిలో స్థిరపడ్డారు. విమ్స్‌లో కంటి విభాగంలో ప్రముఖ వైద్యుడుగా పని చేస్తూ 2006లో పదవీ విరమణ పొందారు. రాష్ట్రంలోనే అత్యధిక కంటి శస్త్రచికిత్సలు చేసిన వైద్యుడుగా ఖ్యాతి గడించారు. వేలాది ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు నిర్వహించి లక్షలాది మందికి కంటి చూపును నిలబెట్టారు. వారంలో ఒక రోజు తన స్వగ్రామంలో ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తుండేవారు. డాక్టర్ నాగరాజ్ తనయుడు డాక్టర్ విజయ్‌నాగరాజ్ కూడా విమ్స్‌లో కంటి వైద్యనిపుణుడిగా పని చేస్తున్నారు. డాక్టర్ కొండ్లహళ్లి నాగరాజ్ మృతి పట్ల విమ్స్ వైద్యులు, నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, బళ్లారి ఐఎంఏ సభ్యులు, వైద్యులు సంతాపాన్ని తెలిపారు.

ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవద్దు

- బస్సుల్లో మహిళలను ఎలాంటి కార్డులు చూపమని అడగకూడదు
- ప్రభుత్వంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శివశంకరప్ప మండిపాటు



శ్యామనూరు శివశంకరప్ప

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేస్తామని హామీ ఇచ్చిన ఐదు గ్యారంటీల వల్లే ప్రజలు తమపై నమ్మకంతో ఓట్లు వేసి అధికారం కట్టబెట్టారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శ్యామనూరు శివశంకరప్ప పేర్కొన్నారు. ఆయన దావణగెరెలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఒక చేత్తో ఇలా ఇచ్చి మరో చేత్తో లాక్కోకూడదని ప్రభుత్వాన్ని విమర్శించారు. విద్యుత్ బిల్లుల పెంపుపై ఆయన మండిపడ్డారు. బీజేపీ హయాంలోనే విద్యుత్ బిల్లులు పెంచాలని కేఈఆర్‌సీ వారు ప్రతిపాదించగా, అప్పట్లో బీజేపీ నేతలు సంతకం పెట్టక పోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు. ప్రస్తుతం చార్జీలు పెంచడంపై కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజలు విమర్శిస్తున్నారన్నారు. గ్యారంటీలు ఇలా ఇచ్చి అలా తీసుకుంటున్నారని జనం అంటున్నారన్నారు. విద్యుత్ ధరలు పెంచడంతో పరిశ్రమలకు దెబ్బపడటంతో పాటు పేదలకు కూడా భారం అవుతుందన్నారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలకు కూడా ఎలాంటి షరతులు విధించకూడదన్నారు. చీరలు కట్టుకుని వస్తే వారు మహిళలు కాదా? అని ప్రశ్నించారు. బస్సుల్లో ఉచితంగా మహిళలు ప్రయాణించేందుకు కూడా నిబంధనలు పెట్టడం సరికాదని ఆయన సూచించారు. మహిళలు ఎంత మంది బస్సుల్లో ఎక్కినా వారికి నిబంధనలు విధించకూడదని, ఎలాంటి కార్డులు అడగకూడదన్నారు. మహిళలు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు ఎందుకు చూపాలని ప్రశ్నించారు.

గ్యారంటీలు అమలు కాకుంటే పోరాటం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు

కంప్లి: ఓటమి పాలైన తాను మీకు దూరమవుతానని అధైర్యపడొద్దని, గ్యారంటీ కార్డులు అమలు కానీ పక్షంలో పోరాటం తప్పదని మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు తెలిపారు. గురువారం పట్టణంలో తుంగభద్ర నిలయం కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంతో పాటు కంప్లిలో కాంగ్రెస్ గెలుపునకు గ్యారంటీ కార్డుల ప్రభావమే కారణమన్నారు. అప్పుడే గ్యారంటీ కార్డులపై రాష్ట్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తి ప్రజలకు ఎలా సమాధానం చెప్పాలో తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. ఈనెల 19న అంబేడ్కర్ సర్కిల్ నుంచి కేఈబీ వరకు విద్యుత్ బిల్లుల విషయమై పాదయాత్ర జరుపుతామన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా మీ వెంట ఉండి పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ ప్రముఖులు యర్రంగళి తిమ్మారెడ్డి, రామలింగప్ప, అళ్లళ్లి వీరేష్, బీ.నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

వీఏఓపై చర్యలకు వినతి



జిల్లాధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

బళ్లారి అర్బన్: రైతులను మోసగించి దౌర్జన్యానికి పాల్పడుతూ లంచం అడుగుతున్న దమ్మూరు గ్రామ లెక్కాధికారి(వీఏఓ) కే.కెంచప్పపై చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి పవన్‌కుమార్‌కు తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ గురువారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అమాయక రైతుల సాగు భూములకు పాణీ కోసం లంచం ఇవ్వాలని అడిగాడన్నారు. ఇలాంటి వీఏఓను తమ గ్రామం నుంచి బదిలీ చేయాలని గ్రామస్తులు ఒత్తిడి చేశారు.

ఎన్‌ఆర్‌బీసీ పనుల్లో నాణ్యతాలోపం

రాయచూరు రూరల్: నారాయణపుర కుడి కాలువ(ఎన్ఆర్‌బీసీ) మరమ్మతు పనులను నాణ్యత లేకుండా నాసిరకంగా చేపట్టారు. లింగసూగూరు, దేవదుర్గ తాలూకాల్లో ఎన్ఆర్‌బీసీ పనుల్లో పూర్తి స్థాయిలో నాణ్యత కొరవడింది. కాలువ మరమ్మతు పనుల్లో కింది భాగంలో తూతూమంత్రంగా కాంట్రాక్టర్లు పనులు చేసి చేతులు దులుపుకున్నారు. గురువారం కర్ణాటక ప్రాంత రైతు సంఘం నేతలు బసవరాజ్ పనులు జరుగుతున్న కాలువలను పరిశీలించారు. బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టాలని రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు.

నేడు అభిషేక్ రిసెప్షన్

మండ్య: రెబల్ స్టార్ దివంగత అంబరీష్, ఎంపీ సుమలత కుమారుడు అభిషేక్- అవివాల వివాహ రిసెప్షన్ మండ్య నగరంలో నేడు శుక్రవారం జరగనుంది. జిల్లా ప్రజలందరినీ ఈ వేడుకకు ఆహ్వానిస్తున్నట్లు సుమలత తెలిపారు. సుమారు 50 వేల మందికి పైన అభిమానులు తరలివచ్చే అంచనాతో మాంసాహార విందుకు ఏర్పాట్లు చేశారు. గెజ్జలగెరె కాలనీలో ఈ విందును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి ప్రారంభమవుతుందని సుమలత చెప్పారు. మా కుటుంబం మొత్తం మండ్య జిల్లా ప్రజలకు రుణపడి ఉంటుందని, అందరూ హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఆధార్ అప్‌డేట్ కోసం జనం క్యూ



రేడియోపార్క్ నాడ కచేరి వద్ద వేచి ఉన్న జనం

బళ్లారి రూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన ఐదు పథకాల లబ్ధి కోసం ఆధార్‌కార్డు తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఆధార్‌కార్డు అప్‌డేట్, ఫోన్ నెంబర్ జతచేయడం, అడ్రసు మార్చుకోవడానికి తాలూకా కార్యాలయాలు, పోస్టాఫీసులు, నాడ కచేరి, బ్యాంకుల వద్ద జనం క్యూ కట్టారు. దీనికి తోడు పాఠశాలలు ప్రారంభం కావడంతో కులధృవీకరణ, ఆదాయ, నివాస సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల వద్ద జనం బారులు తీరుతున్నారు.

గోడ కూలి పడి వ్యక్తి మృతి



మృతుడు లింగన్న

బళ్లారి అర్బన్: తాలూకాలోని సిడిగినమొళ గ్రామంలో గురువారం లింగన్న(32) అనే వ్యక్తి తన పాత ఇంటికి మరమ్మతులు చేస్తుండగా గోడ కూలి కిందపడి మృతి చెందాడు. తక్షణమే గ్రామస్తులు అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై పీడీహళ్లి ఎస్ఐ శశిధర్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేసెట్‌లో సుమేద్‌కు 4వ ర్యాంకు

బళ్లారి రూరల్: జిల్లాలోని తోరణగల్లు జిందాల్ విద్యామందిర్‌కు చెందిన విద్యార్థి ఎస్.ఎస్.సుమేధ్ కేసెట్‌లో 4వ ర్యాంకు సాధించాడు. గురువారం మధ్యాహ్నం కేసెట్ ఫలితాలు వెలువడ్డాయి. సుమేధ్ రాష్ట్రస్థాయి కేసెట్‌లో 97.05 శాతం మార్కులు సాధించాడు. సుమేధ్‌కు తల్లిదండ్రులు కేక్ తినిపించి ఆనందం వ్యక్తం చేశారు.

నీట్‌లో అనురాగ్‌కు 705 మార్కులు

రాయచూరు రూరల్: నగరంలోని ప్రైవేట్ కళాశాలలో చదివిన అనురాగ్ రంజన్ 2022-23 నీట్‌లో 720 మార్కులకు గాను 705 మార్కులు సాధించాడు. గురువారం పాత్రికేయుల భవనంలో అతని తల్లిదండ్రులు విలేకరులతో మాట్లాడారు. ఉత్తర కర్ణాటకలో ప్రథమ స్థానంలో నిలిచాడని, సీఈటీ పరీక్షలో బీఎస్సీ అగ్రిలో రాష్ట్రానికి రెండో స్థానం సాధించి జిల్లాకు పేరు తెచ్చాడని వారు తెలిపారు.

కోలారు వార్తలు...

విద్యుత్ ధరల పెంపు తగదు



మాట్లాడుతున్న నాగశేఖర్

కోలారు: రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు పెంచిన విద్యుత్ ధరలను వెంటనే తగ్గించాలని జిల్లా వాణిజ్య, పరిశ్రమల మహా మండలి, చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు నాగశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసలే పరిశ్రమలు నష్టాల్లో నడుస్తుంటే ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచడం గోరు చుట్టుపై రోకటి పోటులా ఉందన్నారు. విద్యుత్ ధరలను పెంచడాన్ని పారిశ్రామికవేత్తలు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ధరల పెరుగుదల ప్రభావంతో లఘు పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. తద్వారా నిరుద్యోగ సమస్య పెరిగి నిరుద్యోగులు వీధిన పడాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ధరలను వెంటనే తగ్గించి పరిశ్రమలను ఆదుకోవాలని కోరారు.

27న కెంపేగౌడ జయంతి



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

మాలూరు: పట్టణంలో ఈ నెల 27న అన్ని సముదాయాల సహకారంతో నాడప్రభు కెంపేగౌడ జయంతిని ఘనంగా ఆచరించడంతో పాటు కెంపేగౌడ పల్లకీలను, కళాబృందాలను పట్టణంలోని ప్రముఖ వీధుల్లో ఊరేగిస్తారని ఎమ్మెల్యే కెవై నంజేగౌడ తెలిపారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తాలూకా జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, అన్ని సముదాయాల, సంఘ సంస్థల ప్రముఖులు, కన్నడ పర సంఘాల నేతృత్వంలో ఏర్పాటు చేసిన నాడ ప్రభు కెంపేగౌడ జయంతి ఆచరణ పూర్వసిద్ధతా సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తమదైన సేవలు అందించిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. ప్రస్తుత సంవత్సరం మహనీయుల జయంతులను అర్థవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని సముదాయాల సహకారంతో కెంపేగౌడ జయంతిని వైభవంగా ఆచరిస్తామన్నారు. ఈసందర్భంగా తాలూకా వక్కలిగుల సంఘం పదాధికారులు, తహసీల్దార్ కె రమేష్, తాలూకా పంచాయతీ ఈఓ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: నగరంలోని అండర్‌సన్‌పేటలో ఉదయం పీడబ్ల్యూడీ శాఖ అధికారులు గట్టి పోలీస్ బందోబస్తు మధ్యన జేసీబీ సాయంతో ఆక్రమణలను తొలగించారు. నగరంలోని వైలెట్స్ నుంచి లక్ష్మీసాగర వరకు, అండర్‌సన్ పేట సర్కిల్ వరకు రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ద్విపద రహదారి విస్తరణ సందర్భంగా రహదారిలోని ఆక్రమణలను పీడబ్ల్యూడీ శాఖ అధికారులు ఎలాంటి ములాజు లేకుండా ఖాళీ చేయించారు.

కురుగోడులో..

కంప్లి: కురుగోడు పట్టణంలోని ప్రధాన సర్కిల్ నుంచి పురసభ కార్యాలయం వరకు మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అక్రమంగా నిర్మించిన భవనాలు, ఆక్రమణల తొలగింపు ప్రక్రియను అధికారులు గురువారం చేపట్టారు. ఈసందర్భంగా అక్రమంగా నిర్మించుకున్న దుకాణాలను పురసభ అధికారులు మార్కింగ్ వేసి తొలగించారు. ఈసందర్భంగా కొంతసేపు పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. అయితే ఈ ప్రాంతం పురసభ స్వాధీనంలో ఉన్నందున పట్టణంలో సజావుగా వాహనాల రాకపోకలకు రోడ్డు విస్తరణ తప్పదని అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివించండి



విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తున్న దృశ్యం

కోలారు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని శాహి ఎక్స్‌పోర్టు సంస్థ విశ్రాంత జనరల్ మేనేజర్ ఎల్.రఘురాజ్ పిలుపునిచ్చారు. ఆయన గురువారం తాలూకాలోని ఆరాభికొత్తనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిల్లలకు తన నిస్వార్థ సేవలో భాగంగా నోటు పుస్తకాలు, జామెట్రి బాక్సులను ఉచితంగా అందించి మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం సీఎస్ ప్రదీప్‌కుమార్, శ్రీనివాసాచార్, ఎస్డీఎంసీ అధ్యక్షుడు మహేంద్ర పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ సీజ్



లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మాలూరు: తాలూకాలోని మాస్తి మెయిన్ రోడ్డులో తమిళనాడుకు అక్రమంగా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న లారీని మాస్తి పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గ్రానైట్ తయారీ భారీ సైజ్ రాళ్లను అక్రమంగా లారీలో టీకల్ ఫిర్కా తోరలక్కి మార్గంగా తమిళనాడు వైపునకు తరలిస్తుండగా దాడి జరిపి గనులు, భూ విజ్ఞాన శాఖ అధికారులకు తెలియజేసినట్లు పోలీసులు తెలిపారు.

19 నుంచి రుణాల మాఫీపై జాగృతి

కేజీఎఫ్: స్త్రీ శక్తి సంఘాల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19 నుంచి కరపత్రాలతో జాగృతి చేయాలని రైతు సంఘం పదాధికారులు నిర్ణయించారు. గురువారం నగరంలోని అటవీ ఉద్యానవనంలో సమావేశమైన మహిళా రైతు సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు ఎ.నళినిగౌడ మాట్లాడుతూ రుణాల మాఫీ పై స్త్రీశక్తి సంఘాలను జాగృతం చేస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, తాలూకా కదరినత్త అప్పాజిరావ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతుల ధర్నా


ధర్నా చేస్తున్న దృశ్యం

మండ్య: చెరకుకు ప్రోత్సాహక ధనం, పాల ధరను పెంచాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం కార్యకర్తలు గురువారం మండ్య నగరంలో ధర్నా నిర్వహించారు. మండ్య నగరంలోని జిల్లా అధికారి కార్యాయం చేరుకున్న కార్యకర్తలు అక్కడే బైఠాయించారు. టన్ను చెరకుకు రూ. 500 ప్రోత్సాహక ధనం, లీటర్ పాలకు రూ. 40 పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

ట్రాఫిక్ పోలీసుల కొరడా

శివమొగ్గ: అదనంగా హారన్‌లను ఏర్పాటు చేసుకుని శబ్దకాలుష్యంతో పాటు ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్న వాహనాలపై శివమొగ్గ నగర ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. నగర ట్రాఫిక్ సీఐ సంతోష్ కుమార్ నేతృత్వంలో బస్సులతో పాటు కార్లు, బైక్‌లు తనిఖీ చేసి దాదాపు 60 వాహనాలపై కేసులు, జరిమానా విధించారు. 39 వాహనాలను సీజ్ చేశారు. సొరభ తాలూకాలో అనవట్టి సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు.

సద్వినియోగం చేసుకోండి


ఆదేశ పత్రాలు అందజేస్తున్న మార్కెట్ మోహన్ తదితరులు

గౌరిబిదనూరు: స్వయం సేవా సంస్థలు అందించే సౌలభ్యాలు, ఆర్థిక సహాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ప్రశాంత్ తెలిపారు. గురువారం సంస్థ కార్యాలయంలో 43 మంది వృత్తి విద్యా కోర్సులను చదువుతున్న విద్యార్థులకు సుజ్ఞాన నిధి పథకం కింద స్కాలర్‌షిప్‌ల ఆదేశ పత్రాలను వితరణ చేసి మాట్లాడారు. ఈ సౌలభ్యాలను ఉపయోగించుకొని బాగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నగరసభ సభ్యుడు మార్కెట్ మోహన్, జ్ఞాన వికాస పథకం అధికారి సంధ్యాశెట్టి, ప్రాజెక్ట్ అధికారి నాగరాజు వినాయ్క, సమన్వయాధికారి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

జీర్ణోద్ధరణ, మహా కుంభాభిషేకం


విగ్రహాలకు అభిషేకం చేస్తున్న స్వామీజీ

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి అరికెరె వార్డు హులిమావులో ఉన్న శ్రీ ఆదిచుంచనగిరి మహా సంస్థాన మఠం శాఖ ఆవరణంలో గురువారం శ్రీవిద్యాగణపతి, నవగ్రహాల ఆలయంలో జీర్ణోద్ధరణ, మహా కుంభాభిషేకం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తుల సమక్షంలో జగద్గురు శ్రీ నిర్మలానంద నాథ స్వామీజీ సాన్నిధ్యంలో లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పూజల్లో ఎంపీ తేజస్వీ సూర్య, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, కార్పొరేటర్ పురుషోత్తం, మాజీ నగరసభ సభ్యుడు మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నీట్ ఫలితాల్లో సాధన



విద్యార్థినిని అభినందిస్తున్న దేవేందర్‌రెడ్డి, అధ్యాపకులు

బనశంకరి: నగరంలోని డీఆర్.అకాడెమి విద్యార్థులు నీట్ పరీక్షలో సత్తాచాటారు. శశాంక్ సురపూర్ జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు, విద్యార్థిని కమలిక చల్లా 46వ ర్యాంకు సాధించినట్లు డీఆర్ అకాడమి డైరెక్టర్ పీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. శ్రవణ్‌రెడ్డి 680 మార్కులు, మహమ్మద్ సులేమాన్ 676 మార్కులు సాధించారు. 600 మార్కులకు పైగా 43 మంది విద్యార్థులు, ఐదువందలకు పైగా మార్కులను 319 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. కమలిక చల్లాను ఘనంగా సన్మానించారు.

పాముకాటుతో మహిళ మృతి

గుడిబండ: మండల పరిధిలోని మోరుబాగల్ గ్రామానికి చెందిన మమత (35) గురువారం పాముకాటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మమత ఇంటి ఆవరణలో నీటి గేట్ వాల్వ్ తిప్పేందుకు వెళ్ళగా అక్కడే ఉన్న నాగుపాము కాటువేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శిరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేయించి, మెరుగైన చికిత్స కోసం తుమకూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి భర్త బసవరాజు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నందికొండకు తీగమార్గం.. ఎప్పటికి సుగమం

- మార్చిలో ఘనంగా భూమిపూజ
- రూ. 94 కోట్ల అంచనాతో ప్రాజెక్టు
- అంతలోనే నిలిచిన పథకం

దొడ్డబళ్లాపురం: పర్యాటకంగా విశ్వ ప్రసిద్ధి చెందిన నందికొండ వద్ద నిర్మించతలపెట్టిన కొండ పైకి తీగమార్గం (రోప్ వే) పనులు ఎక్కడ వేసిన గొంగళి మాదిరిగా మారాయి. ఈ ప్రాజెక్టు భూమిపూజకు మత్రమే పరిమితమైందని విమర్శలు వస్తున్నాయి. నందికొండ వద్ద రూ.94.40 కోట్ల ఖర్చుతో రోప్‌వే నిర్మించతలపెట్టిన పథకం ప్రారంభంలోనే ఆగిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మార్చ్ 27న అప్పటి సీఎం బసవరాజు బొమ్మై, స్థానిక మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు నందికొండ కింద రోప్‌వే నిర్మాణ పనులను ప్రారంభించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం మంజూరు చేసిన అనేక పనులకు బ్రేక్ వేసింది. ఇదే కోవలో రోప్ వేకు కూడా కోత పడినట్లు తెలుస్తోంది.

పర్యాటకానికి అనుకూలం

కొండ దిగువన నుంచి కొండపైకి రోప్ వే ఏర్పాటు చేయాలనే డిమాండ్లు చిరకాలంగా ఉన్నాయి. ప్రకృతి అందాలను తిలకిస్తూ చిన్న చిన్న పెట్టెల్లో పర్యాటకులు కొండపైకి ప్రయాణించవచ్చు. నందికొండపైకి, కిందకు పర్యాటకులు సులభంగా చేరుకోవచ్చు. పీపీపీ మాదిరిలో సుమారు 2.93 కిలోమీటర్ల పొడవునా ప్యాసింజర్ రోప్‌వే నిర్మించడానికి గత బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర పర్యాటక శాఖ డైనమిక్స్ రోప్‌వే ప్రై.లి. కంపెనీతో 30 ఏళ్ల నిర్వహణకు ఒప్పందం చేసుకొంది. రోప్ వే ప్రారంభమైతే బెంగళూరు గ్రామీణ జిల్లా,కోలారు జిల్లాల్లోని పర్యాటక, ఆధ్యాత్మిక స్థలాలకు మరింతగా పర్యాటకుల తాకిడి పెరగనుంది. కెంపేగౌడ విమానాశ్రయానికి కూడా దగ్గరగా ఉన్నందున దేశ, విదేశీ పర్యాటకులను ఎక్కువగా ఆకర్షించవచ్చు. ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 5000 మందికి ఉపాధి లభిస్తుంది.


పర్యాటక ఆకర్షణగా ఉన్న నందిహిల్స్


రోప్ వే ద్వారా ప్రయాణం


నందికొండలపై సందర్శకుల రద్దీ


నందిహిల్స్‌పై మేఘాలు

జూలై పనులు ప్రారంభం

అయితే పర్యాటకశాఖ అధికారులు స్పందిస్తూ జూలై నెలలో రోప్‌వే పనులు మొదలవుతాయని చెప్పారు. ప్రభుత్వం టెండర్ పిలిచి రూ.93.40 కోట్ల అంచనా ఖర్చు పనులకు ఆమోదం తెలిపిందని, రోప్ వే పథకం ఆగిపోదని చెబుతున్నారు.

కరెంటు స్తంభాలను ఢీకొన్న లారీ

- ఇళ్లకు విద్యుత్ కట్

క్రిష్ణగిరి: లారీల డ్రైవర్లు మద్యం మత్తులో లారీని నడుపుతూ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలను ఢీకొనడంతో స్తంభాలు విరిగిపోయి విద్యుత్ కోతలు ఏర్పడి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోయారు. సూళగిరి నుంచి ఉద్దనపల్లి వెళ్లే మార్గంలో బుధవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో మద్యం మత్తులో లారీని వేగంగా నడుపుతూ రోడ్డు ప్రక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లారీ రోడ్డుపక్కన పడిపోగా, డ్రైవర్ సురక్షితంగా ఉన్నాడు. పలు విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో ఆ ప్రాంతంలో కరెంటు సరఫరా నిలిచిపోయి ఇళ్లలో అంధకారం అలముకొంది. పైగా మత్తులో ఉన్న డ్రైవర్ అధికారులను, స్థానిక ప్రజలను దూషిస్తూ నానా రభస సృష్టించాడు. లారీల దూకుడుకు అడ్డుకట్టవేసి కరెంటు సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరారు.


రోడ్డు పక్కన బోల్తాపడిన లారీ

రెడ్డి సముదాయానికి డీసీఎం పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

తుమకూరు: రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది జనాభా ఉన్న రెడ్డి సముదాయంలో 21 మంది ఎమ్మెల్యేలుగా గెలిచారని, అధికార కాంగ్రెస్‌లో 16 మంది ఎమ్మెల్యేలు ఉండగా ముగ్గురికి మాత్రమే మంత్రి పదవులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని జిల్లా కర్ణాటక రెడ్డి జన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ... ముగ్గురికి మాత్రమే మంత్రి పదవులు ఇచ్చారని, ఒకరికి కూడా ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా చేస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ బలం ఏమిటో చూపిస్తామని, కాంగ్రెస్‌కు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

బూత్ బంగ్లా చేయకండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ

గౌరిబిదనూరు: నగరంలో నేతాజీ క్రీడా మైదానం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియంను గురువారం ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ పరిశీలించారు. అనంతరం ఆయన అధికారుల సమావేశం నిర్వహించారు. ఇండోర్ స్టేడియంను బూత్‌బంగ్లా చేయొద్దని, నిధులు ఏ మేరకు కావాలో నివేదికలు ఇస్తే ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానని చెప్పారు. దాదాపు ఆరేళ్లుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయని, నివేదిక ఇస్తే తదుపరి చర్యలు చేపడుతామన్నారు. తహసీల్దార్ మహేశ్‌పత్రి, ఈఓ హరీశ్, కమిషనర్ గీత, ఎస్ఐ గోపాల్ పాల్గొన్నారు.

దృష్టి మళ్లించి దోపిడీ, ఇద్దరి అరెస్ట్

యశవంతపుర: దృష్టి మళ్లించి నగదు దోచుకెళ్తున్న అంతరాష్ట్ర ముఠాకు చెందిన ఇద్దరిని బెంగళూరు రాజరాజేశ్వరినగర పోలీసులు అరెస్ట్ చేశారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో పలు కేసుల్లో నిందితులైన చెన్నైకి చెందిన కార్తిక్, అనుమోదాస్‌లను అరెస్ట్ చేశారు. వీరు కారులో డబ్బులు తీసుకెళ్తున్న వారిని గుర్తించి వారి దృష్టి మళ్లించి దోపిడీలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తాజాగా రాజరాజేశ్వరినగరలో ఇన్నోవా కారులో డబ్బులు తీసుకెళ్తున్న వ్యక్తిని దృష్టి మళ్లించి రూ. 15 లక్షలు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 13.97 లక్షలు నగదు, కారు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు.

మహిళ అరెస్ట్

నందిని లేఔట్ లగ్గెరిలో యువతి మెడలో చైన్ లాక్కెళ్లిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇల్లు బాడుగకు కావాలని మాట్లాడుతూ నిందితురాలు లక్ష్మీ అలియాస్ గంగా, ఓ యువతి మెడలో 80 వేల విలువైన బంగారు చైన్ లాక్కొని పారిపోయింది. నిందితురాలు లక్ష్మీ కోరమంగళలో నర్సుగా పనిచేస్తున్నట్లు తెలిసింది.

ముస్తఫాకు చిత్రానికి పన్ను మినహాయింపు

యశవంతపుర: సీనియర్ కన్నడ సాహితీవేత్త పూర్ణచంద్ర తేజస్వి సాహిత్య కృతి ఆధారంగా తెరకెక్కించిన డేర్ డెవిల్ ముస్తఫా చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇచ్చింది. ఇటీవల దర్శకుడు శశాంక్‌సోగాలతో పాటు సాహితీవేత్తల బృందం సీఎం సిద్దరామయ్యను కలిసి విజ్ఞప్తి చేయడంతో ముస్తఫా చిత్రానికి పన్ను మినహాయింపు ఇస్తూ సీఎం ఆదేశాలు ఇచ్చారు.

కడుపునొప్పి తాళలేక...

యశవంతపుర: కడుపునొప్పిని తాళలేక ఉపాధ్యాయుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన దావణగెరె జిల్లా చన్నగిరి తాలూకా హిరేవుడ గ్రామంలో జరిగింది. కృష్ణనాయ్క మైసూరు జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కడుపునొప్పి కారణంగా కృష్ణనాయ్క శివమొగ్గలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. రోగం నయం కాకపోవడంతో గురువారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి వచ్చి దొరికిపోయాడు

యశవంతపుర: కేఎస్ఆర్‌టీసీ బస్సులో ప్రయాణికుడి ముసుగులో వచ్చి నగదు బ్యాగ్‌ను ఎత్తుకెళ్లడానికి యత్నించిన దొంగను బస్సు సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్న ఘటన బెంగళూరులో జరిగింది. బుధవారం బెంగళూరు కేంద్రీయ విభాగానికి చెందిన బస్సు బెంగళూరు-తిరుమల్లార్ మార్గంలో తిరుగుతుంది. ఇదిలా ఉంటే బుధవారం మధ్యాహ్నం భోజనానికి నిలిపారు. అదే సమయంలో ప్రయాణికుడి తరహాలో ఓ వ్యక్తి బస్సులో ఎక్కి దంపతులు సీటుపై ఉంచిన రూ. 5 లక్షల నగదు బ్యాగ్‌ను ఎత్తుకుపోవడానికి యత్నించాడు. ఇది గమనించిన కండక్టర్, డ్రైవర్ దొంగను పట్టుకున్నారు.

చెరువులో మునిగి వ్యక్తి దుర్మరణం



దొడ్డబళ్లాపురం: చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన హొసకోట తాలూకా యనగుంటి గ్రామంలో చోటుచేసుకుంది. దేవనహళ్లి తాలూకా బూదిగెరె గ్రామానికి చెందిన షబ్బీర్ సాబ్ (45) మృతి చెందిన వ్యక్తి. అయితే షబ్బీర్ ఎందుకు అంతదూరం వెళ్లాడు? ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడా ? ఆత్మహత్య చేసుకున్నాడా అనే వివరాలు తెలిసిరాలేదు. గురువారం చెరువులో శవం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సూలిబెలె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇద్దరు దొంగలు అరెస్ట్

శివాజీనగర: మంగళూరు నగరం ముల్కి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంటిలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కేజీ బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మంగళూరు జిల్లా కార్కళ తాలూకా మాళ మల్లార గణేశ నాయక్ (26), విరాజపేట గుయ్య గ్రామానికి చెందిన రంజిత్ (26)లుగా గుర్తించినట్లు నగర పోలీస్ కమిషనర్ కులదీప్‌కుమార్ ఎస్.జైన్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...నిందితుల నుంచి స్వాధీనం రూ.55 లక్షల విలువైన బంగారు నగలు, రెండు ఫోన్లు, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బ్యాగుల పంపిణీ

చింతామణి: పట్టణంలోని 24 వార్డులో దాదాపీర్ అనే వ్యక్తి తన పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరసభ మాజీ అధ్యక్షురాలు సుజాత, మాజీ కౌన్సిలర్ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర ప్రకటించాలి

తుమకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చి రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని, కొబ్బరి రైతులకు వెంటనే మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రైతు సంఘం తుమకూరు ఆధ్వర్యంలో గురువారం తమకూరు నగరంలోని జిల్లా అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యాధ్యక్షుడు, తుమకూరు జిల్లా అధ్యక్షుడు ఎ.గోవిందరాజు నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.


ధర్నా చేస్తున్న దృశ్యం

హోసూరు వార్తలు..

టీవీఎస్‌ను ఢీకొన్న పికప్ వాహనం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో నారాయణప్ప మృతదేహం

కెలమంగలం: ద్విచక్ర వాహనాన్ని పికప్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన కెలమంగలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... కెలమంగలం సమీపంలోని అంచెట్టిదుర్గం గ్రామానికి చెందిన నారాయణప్ప (55), అదే గ్రామానికి చెందిన జ్యోతియప్ప (65)లు గురువారం ద్విచక్ర వాహనంలో కెలమంగలం వైపు వెళ్తుండగా రాయకోట వైపు నుంచి వేగంగా వచ్చిన పికప్ వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నారాయణప్ప ఘటనా స్థలంలోనే మృతి చెందగా జ్యోతియప్పను హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మాంసం షాపుల్లో తనిఖీలు

కెలమంగలం: నాసిరకమైన మాంసాన్ని విక్రయిస్తున్నట్లు పారిశుధ్య శాఖాధికార్లకు ఫిర్యాదులు రావడంతో వారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. డెంకణీకోట తాలూకా బాలతోటనపల్లిలో నిర్వహిస్తున్న చికెన్, మాంస దుకాణాల్లో అధికారులు కదిరవన్, గోపి తదితరుల బృందం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో పరిశుభ్రత పాటించాలని, నాసిరకమైన మాంసాన్ని విక్రయించరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

28న రాజ గోపురం ప్రారంభం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ తేరుపేట కొండపై వెలసిన మరకతాంబ సమేత శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయ రాజ గోపురాన్ని కొత్తగా నిర్మిస్తున్నారు. పనులు పూర్తి కావస్తుండడంతో ఈ నెల 28వ తేదీ రాజగోపుర కుంభాభిషేకోత్సవాన్ని నిర్వహించనున్నారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. మేయర్ ఎస్.ఏ.సత్య, బీజేపీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు ఎం. నాగరాజ్, డీఎంకే నేత ఎస్.ఎస్. మాదేశ్వరన్, అన్నాడీఎంకే కార్పొరేటర్ జేపి జయప్రకాష్, దేవాదాయ శాఖాధికార్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. 28వ తేదీ 9.15 గంటలకు రాజగోపుర మహాకుంభాభిషేకోత్సవం జరుగుతుందని, భక్తులకు అన్ని వసతులు కల్పించాలని తీర్మానించారు.

కాల్ గర్ల్స్ పేరుతో యువకుడికి టోకరా

మైసూరు: కాల్‌గర్ల్స్ కోసం ఆశ పడిన ఓ వ్యక్తి భారీగా నష్టపోయిన ఘటన మైసూరు జిల్లా నంజగూడు తాలూకాలో చోటుచేసుకుంది. తాలూకాలోని హరినారు గ్రామానికి చెందిన స్వామి (32) డబ్బులు పోగొట్టుకున్న బాధితుడు. ఇతని ఫేస్‌బుక్‌కు పల్లవి పేరుతో రిక్వెస్ట్ వచ్చింది. అతను ఆన్ చేయడంతో ఆడియో కాల్ ద్వారా తన పేరు పల్లవి అని పరిచయం చేసుకుంది. తాము కాల్‌గర్ల్స్ సేవలు అందిస్తామని, మీకు అవసరం ఉంటే చెప్పాలని అడగటంతో ఆన్‌లైన్ ద్వారా పే చేస్తే యువతులు మీ దగ్గరకు వస్తారని చెప్పింది. దీంతో ఆమె చెప్పిన నెంబర్లకు విడతల వారీగా ఆమెకు దాదాపు రూ. 14.48 లక్షలు ఆన్‌లైన్ ద్వారా పంపించాడు. ఎలాంటి కాల్‌గర్ల్స్ పంపకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి దారుణ హత్య

యశవంతపుర: ఓ వ్యక్తిని హత్య చేసి బెళగావి అనగోళ వద్ద పడేసి వెళ్లిన ఘటన చోటుచేసుకుంది. బెళగావి తాలూకా యళ్లూర గ్రామానికి చెందిన సంజయ్ తుకారామ్ పాటిల్ (34)ను అనగోళ గ్రామం సమీపంలోని చెరువు వద్ద పడేసి వెళ్లారు. వ్యవసాయ పనులకు వెళ్తున్న కూలీలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సంజయ్ ఆ తరువాత ఇంటికి రాలేదు. సంజయ్ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. టిళకవాడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గోమాతకు సీమంతం


గోవుకు సీమంతం చేస్తున్న కుటుంబం

బనశంకరి: బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా హొస ఇంగళి గ్రామానికి చెందిన అరుణబామన కుటుంబంలో ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న గోవుకు గురువారం సీమంతం నిర్వహించారు. నాలుగేళ్ల నుంచి తమ ఇంట్లో ఎంతో ముద్దుగా పెంచుకుంటున్న గోవు నిండుగర్భిణి కావడంతో హిందూ సంప్రదాయ ప్రకారం సీమంతం చేశారు. గోవుకు ఆకుపచ్చరంగు చీర కట్టి పూలహారంవేసి శాస్త్రబద్ధంగా సీమంతం చేశారు. గ్రామంలోని ముత్తైదువులకు పిలిపించి గోవుకు పూజ చేయించారు.

పాతకక్షలతో హత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శివమొగ్గ: పాతకక్షలతో ఓ యువకుడు హత్యకు గురైన ఘటన శివమొగ్గ నగరంలోని ఇలియాజ్ నగరలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. హతుడిని ఆసీఫ్ (25)గా గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన జబీ, ఆసీఫ్ మధ్య గొడవలు ఉన్నాయి. ఈ కారణంతోనే జబీ, ఆసీఫ్‌ను హత్య చేసినట్లు ఎస్పీ మిథున్ కుమార్ తెలిపారు. దొడ్డ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌ను ఢీకొన్న టెంపో ట్రావెలర్, వ్యక్తి మృతి

టెంపో ట్రావెలర్ బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైసూరు నగరంలోని బన్నూరు రోడ్డులో చోటుచేసుకుంది. మృతుడిని బీరయ్య (41)గా గుర్తించారు. బీరయ్య నగరంలోని బన్నూరు రోడ్డులో దేవెగౌడ సర్కిల్ నుంచి బైక్‌పై వస్తుండగా టీటీ వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలతో ఉన్న బీరయ్యను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దాతలూ ఆదుకోండి



మాట్లాడుతున్న బాలిక తల్లి

మండ్య: బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తమ కుమార్తెను దాతలు ఆదుకోవాలని బాలిక తల్లి హేమ విజ్ఞప్తి చేశారు. గురువారం మండ్య నగరంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... తమది శ్రీరంగ పట్టణ తాలూకాలోని బళ్లెనహళ్లి అని, తన కుమార్తె వినూత ఎముకలకు సంబంధించిన క్యాన్సర్‌తో బాధపడుతోందని, చికిత్సకు రూ. 20 లక్షలు వ్యయం అవుతుందని వైద్యులు తెలిపారని, తమది చాలా పేద కుటుంబమని, కూలి పనులు చేసుకుని జీవించే తమకు ఆస్తులు లేవని అన్నారు. దాతలు దయతలచి ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సాయం చేయవలసిన వారు శ్రీరంగ పట్టణం కర్ణాటక బ్యాంక్ ఖాతా 7092500101895101, ఐఎఫ్ఎస్ కోడ్ కేఏఆర్‌బి 0000709, గూగుల్ పే, ఫోన్ పే సంఖ్య 7090221842 సంప్రదించగలరు.

పాఠశాలకు కొత్త భవనం

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమితి మారిశెట్టిపల్లి గ్రామంలో స్వచ్ఛంద సంస్థచే కొత్తగా నిర్మించిన పాఠశాల భవనాన్ని జిల్లా కలెక్టర్ శరయు గురువారం ప్రారంభించారు. మారిశెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో 200 మంది పిల్లలు చదువుతున్నారని, తరగతి గదుల కొరత ఉందని పాఠశాల యంత్రాంగం అమీకా స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన సంస్థ కొత్త భవనాన్ని నిర్మించింది. ప్రారంభోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రతిభను పెంచే ఉపకరణాలను అందజేశారు. విద్యాశాఖాధికారి వెంకటేష్ సబీక్‌జాన్, దాసూన్, సత్యమూర్తి, లక్ష్మినరసింహమూర్తి పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

హోసూరు: హోసూరు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. తళి రోడ్డు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు పట్టణ పోలీసులకు రహస్య సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా ఇద్దరు అనుమానితులు కంటపడ్డారు. వారిని తనిఖీ చేయగా 50 గ్రాముల గంజాయి పట్టుబడింది. నిందితులను కెలమంగలం జీవానగర్‌కు చెందిన తమిళరసన్, సతీష్‌లను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

కార్మికుడిపై దాడి, వ్యక్తి అరెస్ట్

కెలమంగలం: తీసుకున్న అప్పు చెల్లించలేదని కార్మికుడిపై దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తిని కెలమంగలం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... కెలమంగలం సమీపంలోని ఇరుదాళం గ్రామానికి చెందిన శంకర్ (36) కార్మికుడు. అదే ప్రాంతానికి చెందిన రత్నకుమార్ (38)కి హోసూరుకు చెందిన షణ్ముగం వద్ద రూ. 10 వేలు అప్పు తీసి ఇచ్చాడు. 6 వేలు చెల్లించిన రత్నకుమార్ మిగిలిన సొమ్ము ఇవ్వలేదు. దీంతో బుధవారం రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహంతో ఉన్న రత్నకుమార్ తన మిత్రుడు లోకేష్‌తో కలిసి శంకర్‌పై దాడి చేశారు. శంకర్ ఫిర్యాదు మేరకు కెలమంగలం పోలీసులు కేసు నమోదు చేసుకొని రత్నకుమార్‌ను అరెస్ట్ చేసి పరారీలో ఉన్న లోకేష్ కోసం గాలిస్తున్నారు.

అల్లక పార్వతమ్మ వర్ధంతి


అల్లక పార్వతమ్మ విగ్రహానికి పూజలు

బనశంకరి: శ్రీ శివబాలయోగి మహారాజ్ తల్లి అల్లక పార్వతమ్మ 47వ వర్ధంతి నిర్వహించారు. గురువారం బన్నేరుఘట్ట రోడ్డులోని శ్రీ శివబాలయోగి మహారాజ్ ట్రస్ట్ ఆశ్రమంలో అల్లక పార్వతమ్మ సమాధి వద్ద విగ్రహానికి శివబాలయోగి మహారాజ్ ట్రస్ట్ చైర్మెన్ డీ.రాంబాబు దంపతులు ప్రత్యేక అలంకరణ చేపట్టి విశేష పూజలు చేశారు.

క్లుప్తంగా...

అమ్మవారి సేవలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి


ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

తిరుచానూరు (తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని జస్టిస్ మిశ్రా దర్శించుకున్నారు. ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు అమ్మవారి శేష వస్త్రాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తుమ్మలపల్లి ప్రసాద్‌కు మోటూరు స్మారక అవార్డు



సాక్షి, అమరావతి: సుదీర్ఘకాలం ప్రజాశక్తి సంపాదక బాధ్యతలు నిర్వహించిన మోటూరు హనుమంతరావు స్మారకార్థం ప్రతియేటా ప్రకటిస్తోన్న ఉత్తమ జర్నలిస్టు అవార్డును ఈ ఏడాది నవభూమి జర్నలిస్ట్ తుమ్మలపల్లి ప్రసాద్‌కు ఇవ్వనున్నట్లు ప్రజాశక్తి సాహితీ సంస్థ కార్యదర్శి ఎంవీఎస్ శర్మ గురువారం తెలిపారు. హైదరాబాద్ నుంచి వెలువడే నవభూమి పత్రికలో 2023 మార్చి 8న 'మగువా నీకు వందనం!' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనాన్ని ఆ పత్రిక బ్యూరో చీఫ్ తుమ్మలపల్లి ప్రసాద్ రాశారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన కప్పెర అనసూర్య(85) తీవ్ర అనారోగ్యంతో ఉన్న తన కోడలికి సేవలందిస్తోన్న వైనాన్ని మానవీయ కోణంలో కథనం చేయడం ప్రశంసనీయమని కమిటీ అభిప్రాయపడింది. ప్రజాశక్తి మండపేట విలేకరి పల్లి సుబ్బరాజు 'ఆఖరి మజిలీలోనూ తప్పని వివక్ష!' పేర దళితుల అవస్థపైన, ఈనాడు ప్రత్యేక ప్రతినిధి దుర్గా ప్రసాద్ 'ఊరు వలసపోతోంది' శీర్షికతో కర్నూలు, అనంతపురం జిల్లాలపైన రాసిన కథనాలను ప్రత్యేకంగా అభినందించాలని కమిటీ సూచించింది. ఈ నెల 20న పుట్టపర్తిలో జరిగే సభలో అవార్డు ప్రదానం చేయనున్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు


విజయవాడ స్పోర్ట్స్: భార్యను కట్నం కోసం వేధించి, ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజాదేవి తీర్పు చెప్పారు. గుణదలకు చెందిన దుర్గమ్మను అదే ప్రాంతానికి చెందిన కొండేటి నాగబాబు 2016లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. నాటినుంచి కట్నం కోసం దుర్గమ్మను నాగబాబు వేధిస్తుండేవాడు. ఇదే విషయాన్ని దుర్గమ్మ ఆమె తల్లికి తరచూ చెప్పి బాధపడుతుండేది. నాగబాబు శారీరక, మానసిక వేధింపులు తట్టుకోలేక 2017 జూన్ 26వ తేదీన దుర్గమ్మ ఉరేసుకుని చనిపోయింది. ఈ ఘటనపై మాచవరం పోలీసులు అప్పట్లోనే కేసు నమోదు చేసి నిందితుడు నాగబాబును అరెస్ట్ చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్షతో పాటు రూ. 1,700 జరిమానా విధించారు.

మద్యం మత్తులో.. 120 కి.మీ వేగంతో...

- 3 ఏనుగులను ఢీకొట్టిన ట్రక్కు డ్రైవర్
- ప్రాథమిక విచారణలో వెల్లడి

పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని మొగిలి ఘాట్‌లో బుధవారం రాత్రి హైవేని దాటుతోన్న ఏనుగుల గుంపును అతివేగంగా ఐషర్ ట్రక్కు ఢీకొనడంతో అక్కడికక్కడే ఓ ఆడ ఏనుగు, రెండు గున్న ఏనుగులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఏనుగులకు ఘటనాస్థలం నుంచి కొంత దూరం తీసుకువచ్చి అడవిలోనే గురువారం తిరుపతి జూపార్క్ వెటర్నరీ డాక్టర్ తోయిబాసింగ్ నేతృత్వంలో స్థానిక వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వాటిని స్థానిక ఎలిఫెంట్ ట్రాకర్లు పాతిపెట్టారు. చిత్తూరు డీఎఫ్‌వో చైతన్యకుమార్ రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలోని కోలారుకు చెందిన ట్రక్కు డ్రైవర్ టమాటా లోడుతో చెన్నైకి వెళుతూ మద్యం సేవించి గంటకు 120 కిలోమీటర్ల కంటే వేగంగా వాహనాన్ని నడపడంతోనే ఏనుగులను ఢీకొన్నట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఇందుకు కారణమైన ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. నిందితునిపై వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. కౌండిన్య అభయారణ్యంలోని మొగిలి ఘాట్‌లో హైవేపై ఏనుగుల సంచారం ఉంటుందని, వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని సూచిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అయినప్పటికీ ఈ ప్రమాదంలో 3 ఏనుగులను కోల్పోవడం బాధాకరమన్నారు. ఘాట్‌లో వాహనాలు వేగంగా వెళ్లకుండా పోలీసులు, హైవే అధికారుల ద్వారా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఘటనాస్థలికి మళ్ళీ ఏనుగులు వచ్చే అవకాశం ఉన్నందున ఘాట్‌లో ఎలిఫెంట్ ట్రాకర్స్‌తో పాటు తమ సిబ్బందిని నిఘాలో ఉంచామని తెలిపారు. స్క్వాడ్ డీఎఫ్‌వో ఆశాకిరణ్, ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గూడేల్లో ప్రగతి వీచిక..!


అల్లిపాలెం వ్యూ

ఒంగోలు డెస్క్..


గిరిజనగూడెంలో జగనన్న కాలనీ ఇల్లు (ప్రతీకాత్మక చిత్రం)

అడవే వారికి కన్న తల్లి..వన్యప్రాణులు వారి కుటుంబ సభ్యులు..అటవీ ఉత్పత్తులే వారికి ఆహారం..జీవనాధారం..
ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా వారి జీవన ప్రమాణాల్లో మార్పు రాలేదు. సంక్షేమ పథకాలు ఆమడ దూరం..సొంత గూడు కూడా కరువే..గుడిసెలే వారికి ఆవాసాలు..
వానొచ్చినా..పెద్దగాలొచ్చినా వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం..వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వీరి బతుకుల్లో మార్పులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. గుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు.. బడి..
వైద్యం అలాగే కొండ..కోనల్లో సైతం సంక్షేమ పథకాలు అందేలా చూస్తోంది. అడవి దాటని జీవితాల్లో ఆధునిక జీవన రేఖలు ఏర్పడుతున్నాయి.యర్రగొండపాలెం మండలం అల్లిపాలెం పరిస్థితి చూసొద్దాం.. ఇప్పుడు అక్కడ ఎలా ఉంది.. రానున్న రోజుల్లో ఎలా మారబోతోందో తెలుసుకుందాం.
చలో చెంచుగూడెం..

- చెంచుగూడెల్లో ఆధునిక జీవనరేఖలు
- బడి, ఆస్పత్రి, తాగునీరు, పక్కాగృహాలు సకల సౌకర్యాలు
- గూడెల్లోకే రేషన్, సంక్షేమ ఫలాలు
- జనజీవన ప్రపంచంలోకి అడవి బిడ్డలు
- 59 మంది చెంచు కుటుంబాలకు పట్టాలు పంపిణీ
- పక్కా గృహాలు తామే నిర్మించి ఇస్తామన్న మంత్రి ఆదిమూలపు సురేష్

నల్లమల అటవీ ప్రాంతం..పశ్చిమ ప్రకాశంలోని ఏడు మండలాల పరిధి 81 చెంచు గూడేల్లో 15 వేల మందికిపైగా నివాసం ఉంటున్నారు. యర్రగొండపాలెం మండల కేంద్రానికి సుమారు 30 కిలో మీటర్ల దూరంలో ఉంది అల్లిపాలెం చెంచుగూడెం. దట్టమైన అటవీ ప్రాంతం..కనీస రవాణా సౌకర్యం లేదు. 73 చెంచు కుటుంబాలు నివాసముంటున్నాయి. అన్నీ గుడిసెలే.. ద్విచక్ర వాహనం ఉన్న వారు మినహాయిస్తే మిగతావారు నాలుగైదు కిలోమీటర్లు నడిచి వెళ్లి అక్కడ నుంచి ఆటోల ద్వారా నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంటారు. సోలార్ విద్యుత్ కరెంటు సరఫరా అవుతోంది. దీని ద్వారానే నీటి వసతి..పొలాలకు జనరేటర్ల ద్వారా నీళ్లు ఇస్తున్నారు.

కోనేరు చుట్టూ..

శ్రీకృష్ణదేవరాయలు అటవీ మార్గం ద్వారా శ్రీశైలం వెళ్లే సమయంలో నీటి కోసం కోనేరు నిర్మించారని చారిత్రక కథనాలు ఉన్నాయి. నీటి వసతి ఉండడంతో శతాబ్దాల కిందటే చెంచులు ఇక్కడ ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారని అంటుంటారు. అల్లిపాలెంగా పిలుచుకునే ఈ చెంచుగూడెం అడవిలో దొరికే సంపదతో వారు జీవనం సాగిస్తున్నారు. గతంలో మావోలు ఎక్కువగా సంచరించేవారని, అలాగే నీటి కోసం వన్యప్రాణులు, మృగాలు సైతం ఇక్కడికే వచ్చి వెళ్లేవని తెలుస్తోంది. కాలక్రమంలో ఆ కోనేరు శిథిలమైపోయింది. సమస్యలు రోజుకు రోజూ పెరుగుతూ వస్తున్నాయి. అక్కడ చెంచులకు పరిస్థితులు అనుకూలించలేదు. గూడేనికి దిగువన తమ నివాసాల నుంచి 3 కిలో మీటర్ల దూరంలో తాము సాగు చేసుకుంటున్న పొలాల వద్దకు రావాలంటే భయపడేవారు. ఇటువంటి పరిస్థితుల్లో 2004లో వారు పొలాల వద్దే గుడిసెలు ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. 2006వ సంవత్సరంలో అప్పటి సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి 55 మంది చెంచు కుటుంబాలు 350 ఎకరాలు సాగుచేసుకునేందుకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను అందచేశారు. ఆ భూములపై చట్టపరంగా వారికి హక్కు లభించినప్పటికీ అటవీశాఖాధికారులు మాత్రం అదేమీ పట్టించుకోకుండా చెంచులపై కన్నెర్రచేస్తూ వచ్చారు. అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకునే హక్కులేదని హుంకరించారు. రెండు దశాబ్దాల నాటి నుంచి చెంచులు ఆందోళన చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. మండలంలోని గంజివారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఈ అల్లిపాలెం చెంచుల గోడు విన్న ఆ పంచాయతీ సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టికి తీసుకొని వెళ్లారు.


బొగిలి పోయిన పూరి గుడిసె ముందు వంట చేస్తున్న చెంచు మహిళ

అల్లిపాలెం..దశ తిరిగే

దశాబ్దాల కాలంగా సొంత గూడు కోసం పోరాటాలు చేసి అలసిపోయారు. పక్కా భవనాలు అనేది అల్లిపాలెం చెంచులకు తీరని కోరికగా మిగిలిపోయింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జోక్యం చేసుకోవడంతో అటవీ, రెవెన్యూ శాఖలు దిగివచ్చాయి. ఈ మేరకు 59 మంది అల్లిపాలెం చెంచులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పంపిణీ చేయడమే కాదు పక్కాగా లేఅవుట్‌వేసి జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తామని, గృహాలు కూడా నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మరో 14 చెంచు కుటుంబాలకు త్వరలో పట్టాలు మంజూరు చేయిస్తానని కూడా చెప్పారు. అలాగే రేషన్ బియ్యం ఇంటిముంగిటకే చేరేలా ప్రత్యేక ట్రాక్టర్ల ద్వారా పంపిణీకి రంగం సిద్ధం చేశారు. రానున్న రోజుల్లో గుడిసెల స్థానంలో పక్కా గృహాలు రానున్నాయి. అలాగే పిల్లలు చదువుకునేందుకు పాఠశాల, విద్యుత్, వైద్య సదుపాయాలు, పుష్కలంగా తాగునీరు ఇలా అన్నీ అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రానికి సుదూరంలో ఉన్న పాలుట్ల పంచాయతీలో సచివాలయం, ఆర్‌బీకే ఇలా అన్ని వసతులూ సమకూరాయి. దశలవారీగా గిరిపుత్రుల జీవితాల్లో సరికొత్త కాంతులీనను న్నాయి అన్నది అక్షర సత్యం.


పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్(ఫైల్)

కల నెరవేరింది



మా గూడెం వాసుల కల నెరవేరింది. పులులు సంచరించే ఈ ప్రాంతంలో గుడిసెలలో జీవనం గడుపుతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్న భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నాం. ఇళ్ల నిర్మాణాల కోసం 20 ఏళ్లుగా పోరాడినా లాభం లేకుండా పోయింది. మంత్రి, సర్పంచ్ చొరవ తీసుకోవడంతో మా సొంతింటి కల నెరవేరింది.
– కుడుముల బయ్యన్న, గూడెం పెద్ద, అల్లిపాలెం

గుడిసెలోనే పుట్టాను



నేను గుడిసెలో పుట్టాను, వర్షం వస్తే రాత్రింబవళ్లు ఇబ్బంది పడేవాళ్లం, పెద్ద గాలి వస్తే గుడిసె ఎగిరిపోయేది. జంతువుల భయంతో బతికేవాళ్లం. ఇప్పుడు జగనన్న కాలనీ నిర్మించేందుకు పట్టాలు ఇవ్వడం నాకు చాలా ఆనందంగా ఉంది. బడి కూడా ఏర్పాటు చేస్తుండటం వలన నాతోటి వాళ్లకు చదువుకునే అవకాశం కలిగింది.
– భూమని వెంకటమ్మ, విద్యార్థిని, అల్లిపాలెం

గిరిజనులను ఆదుకోవడమే లక్ష్యం



రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులను ఆదుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే చెంచులకు అన్ని విధాలుగా ఆదుకుంటాం. ప్రస్తుతం అల్లిపాలెం చెంచులకు ఇంటి పట్టాలు అందచేశాం. వారికి కేటాయించిన స్థలంలో లేఅవుట్ వేసి పక్కా గృహాలు నిర్మించి జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తాం. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన చెంచు రైతులు వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందటానికి సహకరిస్తాను. ఆయా పొలాల్లో 29 బోర్లు వేయించి నీటి వసతి కల్పించే ఏర్పాటు చేస్తాను. అల్లిపాలెంలో ఉన్న పిల్లలు స్థానికంగా చదువుకునేందుకు పాఠశాలను నిర్మించి అన్ని వసతులు కల్పిస్తాం.
– ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

అన్ని వసతులు సమకూరుస్తాం



అల్లిపాలెం చెంచులకు కావలసిన అన్ని వసతులు కల్పిస్తాం. వారి జీవనం కోసం చెంచు ప్రత్యేక ఉపాధి పథకం పనులు ముమ్మరం చేయిస్తాను. చెంచుల పనిదినాలు పెంచి, అదనపు అలవెన్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. గూడెంలో మంచి నీటి వసతి, వైద్య సదుపాయాలు కల్పించి పిల్లల చదువుల కోసం తగు చర్యలు తీసుకుంటాం.
– బి.రవీంద్రరెడ్డి, పీవో, ఐటీడీఏ, శ్రీశైలం ప్రాజెక్ట్

సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం



పంచాయతీ పరిధిలో ఉన్న చెంచుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. అల్లిపాలెం అటవీ ప్రాంతంలో ఉండటం వలన ప్రతి నెలా రేషన్ బండి వెళ్లలేక పోతోంది. 4 కిలో మీటర్ల దూరం నడిచివెళ్లి రేషన్ తీసుకోవాల్సి వస్తుంది. రేషన్ రవాణా కోసం ప్రతినెలా ట్రాక్టర్‌ను ఏర్పాటు చేస్తాను. దగ్గర ఉండి కాలనీ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాను.
– డి.సుబ్బారెడ్డి, సర్పంచ్, గంజివారిపల్లె పంచాయతీ

మిద్దెలో ఉంటానని అనుకోలేదు



మిద్దెలో కాపురం చేస్తానని నేను అనుకోలేదు. ఇప్పుడు ఇంటి పట్టాలు ఇచ్చారు. త్వరలో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్తున్నారు. సొంతింటిలో ఉండాలన్న నా కోరిక నెరవేరనుంది. నాకు చాలా ఆనందంగా ఉంది. మంత్రికి రుణపడి ఉంటాను.
– భూమని పోలమ్మ, గృహిణి, అల్లిపాలెం

స్పందిస్తే మీరూ ప్రాణదాతే..



- రాజమహేంద్రవరం రూరల్ మండలానికి చెందిన 14 ఏళ్ల జ్యోతి తలసేమియా బాధితురాలు. ఐదు రోజులుగా రక్తం కోసం ఆస్పత్రిలో ఎదురు చూస్తోంది.
- కాకినాడ జిల్లా కత్తిపూడి సెంటరులో ట్రాక్టర్ బోల్తా పడిన దుర్ఘటనలో ఇద్దరికీ తీవ్ర రక్తస్రావమైంది. కాకినాడ తరలించారు. అత్యవసరంగా రక్తం ఎక్కిస్తే తప్ప బతకడం కష్టమని డాక్టర్లు చెప్పారు. ఆ క్లిష్ట సమయంలో రక్తం కోసం బాధితుల కుటుంబీకులు చాలా కష్టాలు పడ్డారు.

డెస్క్– రాజమహేంద్రవరం: తరచూ ఎదురవుతున్న రక్త కొరతకు ఈ రెండూ ఉదాహరణలు మాత్రమే. సాధారణంగా రోడ్డు ప్రమాదాలు.. తలసేమియా.. కేన్సర్.. ప్రసవ సమయాలు.. శస్త్రచికిత్సల సందర్భంలోను రక్తం చాలా అవసరం. కానీ ఆపద వేళ రక్త లభ్యత సవాలుగా మారుతోంది. రక్తదానం ఒక్కటే ఇందుకు పరిష్కారం. దీనిపై అవగాహన ఉన్నవారు సైతం ముందుకు రావడం లేదు. దేశంలో ఏటా 4 కోట్ల యూనిట్ల రక్త నిల్వలు అవసరమవుతుంటే సమకూరుతున్నది 50 లక్షల యూనిట్ల లోపే. ఒక్క కాకినాడ జీజీహెచ్‌లోనే రోజుకు వెయ్యి యూనిట్లు అవసరమని చెబుతున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు స్పందించి సహకారం అందిస్తున్నా పూర్తి స్థాయిలో కొరత తీరడం లేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తలసేమియా బాధితులే 400 మందికి పైగా ఉన్నారు. వీరికి ప్రతినెలా రక్తం అవసరం.

రక్తదానానికి అవరోధంగా అపోహలు

- విస్తృతంగా అవగాహన పెరగాల్సిన అవసరం
- స్వచ్ఛంద సంస్థల పాత్ర అమోఘం

అపోహలు

చాలామంది చదువుకున్న వారు కూడా రక్తదానానికి ముందుకు రావడం లేదని వైద్యవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై అపోహలు కలిగి ఉండటమే ఇందుకు కారణం. 18 నుంచి 65 సంవత్సరాల వయసున్న ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయవచ్చు. వాస్తవానికి ప్రతి మూడు నెలలకూ రక్తం ఇవ్వడం మంచిది కూడా. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్లేట్‌లెట్లు ఇవ్వవచ్చు. ఒక వ్యక్తి జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చు. రక్తదానం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని డాక్టర్లు చెబుతున్నారు. రక్తదానంతో ముగ్గురిని కాపాడవచ్చు. ఇందులోని ఎర్ర రక్త కణాలతో రక్తహీనత రోగిని.. ప్లాస్మాతో ఒకరిని.. ప్లేట్‌లెట్లతో మరొకరిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీ ద్వారా రక్తాన్ని 8 కాంపొనెంట్లుగా విభజించి, భద్రపరచి రోగులకు అందజేయగలుగుతున్నారు. రక్తదానం చేసినప్పుడు ఏర్పడిన నష్టం 4 నుంచి 8 రోజుల్లో భర్తీ అవుతుంది.

శిబిరాలతో ప్రయోజనం

ఇటీవల కొంత మార్పు వచ్చింది. పుట్టిన రోజు వంటి సందర్భాల్లో కొంతమంది రక్తదానం చేస్తున్నారు. ఈ ఏడాది జూలైలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేయాలని పిలుపునిస్తే మంచి స్పందన వచ్చింది. వైఎస్సార్ సీపీ శ్రేణులు ముందుకొచ్చి ఉత్సాహంగా రక్తదానం చేశారు.

ఫ్రెండ్స్ టు సపోర్ట్

హైదరాబాద్‌లో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి షరీఫ్ 2005లో 'ఫ్రెండ్స్ టు సపోర్ట్' అనే స్వచ్ఛంద రక్తదాన వెబ్‌సైట్‌ను పరిచయం చేశారు. కాకినాడకు చెందిన గుమ్మళ్ల శివప్రసాద్ పూర్తి కోస్తా జిల్లాల బాధ్యతలు చూస్తున్నారు. వీరి వెబ్ ప్లాట్‌ఫాంలోకి లాగిన్ అయి, సమీపంలోని రక్తదాతల వివరాలు, ఫోన్ నంబర్ సేకరించి రక్తదానం కోరవచ్చు. మనం ఉండే ప్రాంతం పిన్‌కోడ్ ఆధారంగా సెర్చ్ చేయవచ్చు. ఇందులో పేరు నమోదు చేసుకున్న ఏ దాతా ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా రక్తం ఇచ్చి వెళతారు. ఇందులో ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచే సుమారు 8,000 మంది దాతలు నమోదయ్యారని వేగేశ్న మోనిక చెప్పారు. 'ఫ్రెండ్స్ టు సపోర్ట్' సేవలను మరింత విస్తరించేందుకు హైదరాబాద్ లోనూ పని చేస్తున్నానన్నారీమె. 'ఫ్రెండ్స్‌టుసపోర్ట్.ఆర్గ్ భారత్ సహా యెమెన్, నేపాల్, బంగ్లాదేశ్, మలేషియా, ఒమన్, శ్రీలంక దేశాల్లో తన సేవలందిస్తోందని గుమ్మళ్ల శివప్రసాద్ తెలిపారు. గడచిన ఏడాదిలో 4 లక్షల మంది తమ సంస్థ వేదికగా రక్తదానం చేశారన్నారు. ఈ సంస్థ 2015లో భారత ప్రభుత్వం నుంచి ఎక్సలెన్సీ అవార్డు దక్కించుకుంది.


'ఫ్రెండ్స్ టు సపోర్ట్' జోనల్ కో ఆర్డినేటర్ శివ ప్రసాద్‌కు కాకినాడ కలెక్టర్ కృతిక శుక్లా సత్కారం

ఉభయ గోదావరి జిల్లాల్లో సేవలు



డాక్టర్ జాగృతి నాగేశ్వర రావు పర్యవేక్షణలో రెండేళ్ల క్రితం వైఎస్సార్–జక్కంపూడి రామ్మోహన రావు బ్లడ్ బ్యాంకు ప్రారంభించాం. ఉభయ గోదావరి జిల్లాల్లో అత్యవసర కేసులకు ఏటా 9 వేల నుంచి 10 వేల యూనిట్ల వరకూ రక్తం అందిస్తున్నాం. రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నాం. జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తసేకరణకు శిబిరాలు నిర్వహిస్తున్నాం. వైఎస్సార్, రామ్మోహనరావుల ఆశయ సాధనకు కృషి చేస్తున్నాం.
– డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, ట్రస్టీ, జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్

రక్తదానంలో మహిళా చైతన్యం

రక్తదాతలుగా మహిళలు పదేళ్లుగా తమ ఆదర్శాన్ని చాటుకుంటున్నారు. మండపేట కేంద్రంగా వైశ్య లేడీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా బృందం వ్యవస్థాపక అధ్యక్షురాలు వాసరాసి శ్రీదేవి ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో దాతలంతా మహిళలే కావడం గమనార్హం.


వైశ్య వెల్ఫేర్ లేడీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన రక్తదానం చేస్తున్న మహిళలు

'చిన్ని' సాయం.. ఎంతో మిన్న



కాకినాడ రూరల్ మండలం రేపూరుకు చెందిన ఇతని పేరు ముమ్మిడి వెంకట రమణ (చిన్ని). ఇతను కొవ్వాడలో చిన్న ఫ్యాన్సీ స్టోర్ నడుపుతున్నాడు. పదుగురికీ సాయపడటం చిన్ని నైజం. 2000 నుంచి ఇప్పటి వరకూ 73 సార్లు రక్తదానం చేశాడు. ఇతని బ్లడ్ గ్రూపు 'ఒ' నెగిటివ్. ప్రమాదాల సమయంలో రక్తం చాలా అవసరమని గుర్తించి రక్తదానం చేయాలని స్నేహితులను కూడా ప్రోత్సహిస్తుంటాడు.
– ముమ్మిడి వెంకట రమణ (చిన్ని), రేపూరు, కాకినాడ రూరల్ మండలం

21 ఏళ్లుగా రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్నా..



2002 నుంచి రక్తదానం చేస్తూ రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్నాను. ప్రస్తుతం 'తూర్పు గోదావరి వలంటరీ బ్లడ్ డోనర్స్ క్లబ్' పేరుతో రక్తదానం చేస్తున్నాం. ఈ క్లబ్‌లో రోజువారీ కూలీలతో పాటు ఆటోడ్రైవర్లు, పలు వృత్తుల్లో కొనసాగుతున్న 1,200 మంది సభ్యులుగా ఉన్నారు. మా సంస్థ ద్వారా ఇప్పటి వరకూ 35 బ్లడ్ క్యాంపుల ద్వారా రక్తం సేకరించి రోటరీ, రెడ్‌క్రాస్ వంటి సంస్థలకు అందజేశాం.
– వెలగల ఫణికృష్ణారెడ్డి, చైర్మన్, తూర్పు గోదావరి జిల్లా వలంటరీ బ్లడ్‌బ్యాంక్

ఫ్యాషన్






చీరకట్టు హుందాతనం మనకు సుపరిచితమే.
సంప్రదాయ వేడుకలైతే డిజైనర్ బ్లౌజ్‌ల హంగామా
క్యాజువల్ లుక్ కి ప్లెయిన్ బ్లౌజ్‌తో మ్యాచింగ్
మార్పులెన్ని చేసినా శారీ డ్రేప్ సెల్యూట్ చేయిస్తుంది.
క్యాజువల్‌గానూ, పార్టీవేర్‌గానూ
మురిపించే శారీ టాప్స్‌తో ఇప్పుడు స్టైలిష్‌గా వెలిగిపోతోంది.

శారీ టాప్స్

ఫ్రాక్
టైప్ టాప్, ఓవర్‌కోట్,
పెప్లమ్, లాంగ్ అండ్ షార్ట్ స్లీవ్స్,
కాలర్‌నెక్, రౌండ్‌నెక్ డిజైన్స్‌తో ఈ
శారీ టాప్స్ ఆధునికపు హంగుకు
అద్దమయ్యాయి. కార్పోరేట్ లుక్‌కి
క్లాసిక్ మార్కులు కొట్టేస్తూ
కనువిందు చేస్తున్నాయి.



కాటన్
శారీస్‌కు కరెక్ట్‌గా నప్పే
ఈ టాప్స్ క్యాజువల్, కార్పొరేట్
లుక్‌తో ఆకట్టుకుంటున్నాయి.

- - -

ఫ్రాక్ టైప్ టాప్ పెప్లమ్ బ్లౌజ్‌కి దగ్గర
పోలిక ఉంటుంది. వదులుగా ఉండటం
వల్ల సౌకర్యంగానూ ఉంటుంది.

మనింట్లో ఓ తొంభై ఏళ్ల నానమ్మ కానీ అమ్మమ్మ కానీ ఉందా? ఉంటే ఆమెన దగండి ఓ మాట. వాళ్ల యువ తరాన్ని ఆకట్టుకున్న చీరలేమిటి అని. ఎంతో ఉత్సాహంగా ఇప్పుడు మనం వినని ఎన్నో పేర్లు చెబుతారు. ఓ పది రకాల పేర్లు చెప్పి 'ఇప్పుడా నేత ఎక్కడ వస్తోంది. వచ్చినా ఈ తరంలో ఆ చీరలెవరు కట్టుకుంటారు. నేయడమే మానేసినట్లున్నారు' అని నిరుత్సాహంగా ముగిస్తారు. సరిగ్గా అలాంటి చీరలకు పూర్వ వైభవం తెస్తున్నారు కర్నాటకకు చెందిన హేమలత. హ్యాండ్‌లూమ్ లవర్స్ వార్డ్‌రోబ్‌లు రెండు వందల ఏళ్ల నాటి చేనేతలతో అలరారుతున్నాయి.


హేమలతా జైన్

పట్టెడ అంచు చీర... ఈ పేరు విన్నారా?

ఎటు కట్టినా ఓకే!

హేమలత... యూఎస్‌లోని కన్సాస్ యూనివర్సిటీలో ఉన్నత విద్య పూర్తి చేశారు. ఆమెకు మన చేనేత కళలో దాగిన సమున్నత జ్ఞానం మీద దృష్టి పడింది. ఒక దానికి ఒకటి విభిన్నంగా దేనికది ఒక శాస్త్రబద్ధమైన గ్రంథంలాంటి చేనేతల మీద అధ్యయనం మొదలు పెట్టారామె. నిఫ్ట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ)లో ఇదే అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్నారు. గిరిజనులు నివసించే ప్రదేశాల్లో విస్తృతంగా పర్యటించారు. వారి నేత తీరును పరిశీలించారు. ఈ క్రమంలో హేమలతా జైన్ 85 ఏళ్ల దేవదాసిని కలిశారు. ఆమె దగ్గరున్న పట్టెడ అంచు చీర రెండు వందల ఏళ్ల నాటి చేనేత కళ. ఈ చీరకు రెండు కొంగులుంటాయి. చీరను రెండు వైపులా కట్టుకోవచ్చు. రివర్సబుల్ శారీ అన్నమాట. పదవ శతాబ్దంలో గజేంద్రఘర్ జిల్లాలోని గ్రామాల్లోని చేనేతకారులు ఈ చీరలను నేసేవారు. అలాంటి చీరలిప్పుడు మార్కెట్‌లో లేవు. ఈ తరంలో ఎవరి దగ్గరా లేవు. ఆ చీరను చూపించి మరొక చీర తయారు చేయించాలంటే ఆ రకమైన నేత నేసే చేనేతకారులు కూడా లేరన్న మరో వాస్తవం తెలిసి వచ్చిందామెకు. అలాంటి అంతరించిపోతున్న డిజైన్‌లు 45 వరకు ఉన్నాయి.


పట్టెడ అంచు చీర నేస్తున్న యువతి

అక్షరాల మగ్గం

అందమైన చేనేత అంతరించిపోవడానికి మూలకారణం అర్థమైంది. పరిష్కారంగా 'పునర్జీవన' పేరుతో ట్రస్ట్ ప్రారంభించి గడచిన తరానికి చెందిన నలుగురు చేనేతకారులతో అనుసంధానం చేశారు. కర్నాటక వస్త్ర ప్రపంచాన్ని ఒకప్పుడు రాజ్యమేలిన 'గోమి తేని, హుబ్లీ, అన్నేహెజ్జె, సదా పాట, సుధా కాడి, లకుండి, గుజ్జు, ధోత్రా వంటి పద్నాలుగు రకాలకు పునరుజ్జీవం పొందాయి. ఆమె ప్రయత్నం ఇంకా కొనసాగుతోంది. ఇప్పుడు 55 మంది చేనేతకారులు పునర్జీవతో కలిసి పని చేస్తున్నారు. వారందరికీ నెలనెలా స్థిరమైన ఆదాయం వచ్చే ఏర్పాటు చేశారామె. ఉపాధికి భరోసా దొరకడంతో ఈ చేనేతలను నేర్చుకునే కొత్త తరం తయారవుతోంది. ఒక కళలో కొత్తతరం నైపుణ్యం సంపాదిస్తోంది అంటే... ఆ కళ మరో రెండు తరాల వరకు నిలిచి ఉంటుందని అర్థం. చేనేత కళను శాస్త్రబద్ధంగా గ్రంథస్తం చేయని రోజుల్లో తండ్రి నుంచి కొడుకుకు వారసత్వంగా మాత్రమే కొనసాగేది. ఈ తరం చేనేతకారులు ఈ కళలన్నింటినీ గ్రంథస్థం చేయగలుగుతున్నారు. మగ్గం మీద దిద్దుకునే శాస్త్రం అక్షరరూపం దాలుస్తోంది. వీటన్నింటినీ హేమలత పరిశోధన గ్రంథంగా రూపుదిద్దనున్నారు. కాబట్టి ఇది ఇక శాశ్వతంగా నిలిచి ఉంటుంది. హేమలత చేపట్టిన బృహత్కార్యం కర్నాటక చేనేతలను పరిరక్షిస్తోంది.

బ్యూటిప్స్

నిగనిగల కురుల కోసం...

- రెండు గుడ్ల సొనను తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమంలో అలోవెరా జ్యూస్‌ను కూడా కలపాలి. దీనిని మాడు నుంచి జుట్టు చివర్ల వరకు పట్టించి అరగంట తరువాత గోరువెచ్చటి నీటితో ఏదైనా మైల్డ్ షాంపూ పెట్టుకుని తలస్నానం చేయాలి. వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల గుడ్డులోని ప్రొటీన్, అలోవెరాలోని మెరుపు అంది కేశాలు దృఢంగా ఒత్తుగా ఆరోగ్యంగా పెరుగుతాయి.
- కొన్ని ఉల్లిపాయ ముక్కలను మెత్తగా గ్రైండ్ చేసి రసం తీసుకోవాలి. ఇందులో చిటికెడు కర్పూరం పొడిని కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి గంట తరువాత బేబీషాంపుతో తలస్నానం చేయాలి.. వారానికి రెండు సార్లు ఇలా చేస్తుంటే తలలోని పేలు పోయి జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.



కిచెన్ టిప్స్

- కూరల్లో పెరుగు వేసేటప్పుడు గరిటెతో తీసి నేరుగా వంటలో కలిపేయకూడదు. పెరుగును ఒక కప్పులో వేసి స్పూన్‌తో చిలికి సమంగా కలిసిన తర్వాత కూరలో వేయాలి. అప్పుడే గ్రేవీ అంతటికీ ఒకేరకమైన చిక్కదనం వస్తుంది.
- గసగసాలను మసాలా రుబ్బడానికి ముందు పది నిమిషాల సేపు వేడి నీటిలో నానబెట్టాలి. ఇలా చేస్తే గసాలు మెత్తగా మెదుగుతాయి, మసాలా మృదువుగా, కొద్దిపాటి జిగురుగా కూడా వస్తుంది.
- పాలు మాడకుండా ఉండాలంటే కాచే ముందు గిన్నెలో కొద్దిగా చన్నీరు పోసి వంపేయాలి. పొడిగా ఆరిన గిన్నెలో నేరుగా పాలు పోసి కాచినప్పుడు పాలు అడుగుపట్టి మాడిపోతాయి.
- అల్లం, వెల్లుల్లి మసాలాను నిల్వ చేయాల్సి వస్తే అందులో కొద్దిగా ఉప్పు, టీ స్పూన్ వేడి నూనె కలపాలి. దీనిని ఫ్రిజ్‌లో పెట్టకపోయినా సరే రెండు రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఫ్రిజ్‌లో పెడితే వారం రోజుల వరకు రంగు మారకుండా అప్పుడే తాజాగా ఉంటుంది.
- రైజిన్స్ (కిస్‌మిస్)ని గట్టి మూత ఉన్న డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే నెలలపాటు తాజాగా ఉంటాయి. ఫ్రిజ్‌లో నుంచి తీసిన తర్వాత రైజిన్స్‌ని ఒక స్ట్రెయినర్‌లో వేసి వేడి నీరు పోస్తే చల్లదనం తగ్గి మృదువుగా మారడంతోపాటు దుమ్ము వదిలి శుభ్రపడతాయి కూడా.
- కొత్తబియ్యంతో అన్నం ముద్ద అవుతుంటుంది. బియ్యం ఉడికేటప్పుడు నీటిలో కొద్దిగా నిమ్మరసం లేదా కొన్ని చుక్కల నూనె లేదా నెయ్యి వేస్తే అన్నం ముద్దకాదు, ప్రతి మెతుకు విడిగా ఉంటుంది. పులిహోర కోసం అన్నం వండేటప్పుడు ఈ చిట్కా తప్పని సరిగా పాటించాలి.
- చోలే కర్రీ చేయాలంటే పచ్చి శనగలను రాత్రంతా నానబెట్టాలి. ఒకవేళ రాత్రి నానబెట్టడం మర్చిపోతే ఉదయాన్నే నీటిని మరిగించి అందులో పచ్చిశనగలను ఓ గంట సేపు నానబెట్టి ఆ తర్వాత ఉడికిస్తే మెత్తగా ఉడుకుతాయి. రాజ్మా గింజలకూ ఇదే పద్ధతి.







వంటిల్లు

టేస్టీగా.. వెరైటీగా...

తియ్యని బ్రేక్‌ఫాస్ట్,
కమ్మని లంచ్,
కరిగిపోయే డిజర్ట్,
కారంగా, కరకరలాడే
డిన్నర్ డిష్‌లతో
ఈ వారం వంటిల్లు
వచ్చేసింది...

స్వీట్ ఇడ్లీ



కావలసినవి:
బియ్యం రవ్వ – కప్పు; పనస తొనలు – మూడు కప్పులు ; పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – అరకప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నెయ్యి – టేబుల్ స్పూను.

తయారీ: ● పనసతొనలను విత్తనాలు తీసేసి ముక్కలుగా తరగాలి. ● ఈ ముక్కలకు.. కొబ్బరి తురుము, బెల్లం తరుగులను జోడించి నీళ్లుపోయకుండా మెత్తగా రుబ్బుకోవాలి. ● ఈ మిశ్రమంలో బియ్యం రవ్వ, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. మిశ్రమం కాస్త చిక్కగానే ఉండాలి. ● ఇడ్లీప్లేటుకు నెయ్యి రాసి మిశ్రమాన్ని వేసి సన్నని మంటమీద ఇరవై నిమిషాలు ఉడికిస్తే స్వీటిడ్లీ రెడీ. నెయ్యి లేదా తేనెతో సర్వ్ చేసుకుంటే చాలా రుచిగా ఉంటుంది.

మంగోలీసియస్ డిజర్ట్



కావలసినవి:
మామిడి పండ్లు – రెండు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు, బాదం పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; జీడిపప్పు పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; పిస్తా పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సేమియా – అరకప్పు; పాలు – నాలుగు కప్పులు; చక్కెర – పావు కప్పు.

తయారీ: ● మామిడి పండు తొక్క, టెంక తీసేసి, ముక్కలుగా తరిగి ప్యూరీలా గ్రైండ్ చేయాలి. ● టేబుల్ స్పూను నెయ్యి వేసి డ్రైఫ్రూట్స్‌ను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. ● ఇదే బాణలిలో మిగతా నెయ్యి వేసి సేమియాను దోరగా వేయించాలి. ● సేమియా వేగాక, పాలు పోసి పదినిమిషాలు కాగనివ్వాలి. ● పాలు మరిగాక చక్కెర వేసి కరిగేంత వరకు తిప్పి దించేసి చల్లారనివ్వాలి. ●చల్లారిన పాల మిశ్రమంలో మామిడి పండు ప్యూరీ, డ్రైఫ్రూట్స్ వేసి కలిపి రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. ● అరగంట తరువాత బయటకు తీసి ఒకసారి కలుపుకుని సర్వ్ చేసుకోవాలి.

సూకా మటన్



కావలసినవి: మటన్ ముక్కలు – అర కేజీ; అల్లం వెల్లుల్లి పేస్టు – ఒకటిన్నర టీస్పూన్లు; ఉల్లిపాయ తరుగు – అరకప్పు; వెల్లుల్లి రెబ్బలు – పదిహేను; టొమాటో తరుగు – అరకప్పు; పసుపు – పావు టీస్పూను; కారం – రెండు టీస్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా.

సుక్కా మసాలా: ధనియాలు – టీస్పూను; సోంపు – టీస్పూను ; జీలకర్ర – అరటీస్పూను; ఎండు మిర్చి – రెండు; మిరియాలు – అరటీస్పూను (వీటన్నింటిని వేయించి పొడిచేసుకోవాలి)

తాలింపు కోసం: నూనె – రెండు టేబుల్ స్పూన్లు, దాల్చిన చెక్క – అరంగుళం ముక్క; లవంగాలు – రెండు; యాలకులు – రెండు ; బిర్యానీ ఆకు – ఒకటి; కరివేపాకు – రెండు రెమ్మలు.

తయారీ: ● మటన్ ముక్కలను శుభ్రంగా కడిగి ప్రెజర్ కుకర్ గిన్నెలో వేయాలి. దీనిలో.. పసుపు, పావు టీస్పూను కారం, కొద్దిగా ఉప్పు వేసి కలపాలి. కొద్దిగా నీళ్లుపోసి, మీడియం మంట మీద ఆరు విజిల్స్ రానిచ్చి పక్కన పెట్టుకోవాలి.
● బాణలిలో నూనె వేసి కాగాక, కరివేపాకు తప్పించి తాలింపు దినుసులు ఒక్కొక్కటిగా వేసి వేయించాలి. ఇవన్నీ వేగాక ఉల్లితరుగు, తురిమిన వెలుల్లిని వేసుకోవాలి. ● ఉల్లి మిశ్రమం బ్రౌన్ కలర్‌లోకి మారాక టొమాటో తరుగు వేయాలి. ● టొమాటో పచ్చివాసన పోయాక ఉడికించిన మటన్, కారం, మసాలా పొడి వేయాలి. ● పది నిమిషాలు వేగాక కరివేపాకు, రుచికి సరిపడా ఉప్పు వేసి తిప్పాలి. నూనె పైకి తేలేంత వరకు వేయిస్తే సూకా మటన్ రెడీ.

పల్లి పలయం చికెన్



కావలసినవి: చికెన్ ముక్కలు – అరకేజీ; సాంబారు ఉల్లిపాయలు (చిన్నవి) – పది; వెల్లుల్లి రెబ్బలు – పది; నూనె – రెండు టేబుల్ స్పూన్లు; ఎండు మిర్చి – 12 ; పసుపు – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; పచ్చి కొబ్బరి ముక్కలు – పావు కప్పు (సన్నగా తరగాలి); కరివేపాకు – ఐదు రెమ్మలు; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను.

తయారీ: ● చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. ● ఉల్లిపాయలు, వెల్లుల్లి తొక్కతీసి ముక్కలుగా తరిగి పేస్టుచేసి పక్కనపెట్టుకోవాలి. ● స్టవ్ మీద బాణలి పెట్టి నూనె వేయాలి. కాగిన నూనెలో ఎండుమిర్చిని చిన్నముక్కలుగా చేసి వేయాలి. ● మిర్చి వేగాక, ఉల్లి, వెల్లుల్లి పేస్టుని వేసి పచ్చి వాసన పోయేంత వరకు వేయించాలి. ● ఇప్పుడు చికెన్, పసుపు, కరివేపాకు, రుచికి సరిపడా ఉప్పువేసి తిప్పాలి. ఐదు నిమిషాల తరువాత కొబ్బరి ముక్కలు వేసి కలపాలి. ● మూతపెట్టి సన్నని మంట మీద చికెన్‌లో వచ్చిన నీరంతా ఇగిరి పోయే వరకు ఉడికించాలి. ● దాదాపు అరగంట తరువాత చికెన్ ముక్కలు చక్కగా పొడిపొడిగా వేగుతాయి. ఇప్పుడు కొత్తిమీర చల్లుకుని దించేస్తే పల్లిపలయం చికెన్ ఫ్రై రెడీ.



● ఇంగ్లీష్ ఇడియమ్స్

రాక్ యువర్ బ్రెయిన్స్/ రాక్ యువర్ బ్రెయిన్
ఏదైనా పేరు, సంఘటన గుర్తు చేసుకోవడానికి, మరేదైనా విషయంలోగానీ మెదడుకు గట్టిగా పనిచెప్పే సందర్భంలో వాడతారు.
ఉదా: ఐయామ్ ర్యాకింగ్ మై బ్రెయిన్. బట్ ఐ జస్ట్ కాంట్ థింక్ ఆఫ్ హిజ్ నేమ్.



బాల్‌పార్క్ ఫిగర్/ ఏ బాల్‌పార్క్ ఎస్టిమేట్
ఏదైనా పని, నిర్మాణానికి సంబంధించి 'ఇంత ఖర్చు ఉండవచ్చు' అని సుమారుగా చెప్పే సందర్భంలో ఉపయోగిస్తారు.
ఉదా: వుయ్ డోన్ట్ నో ది ఎగ్జాక్ట్ కాస్ట్. బట్ ఏ బాల్‌పార్క్ ఫిగర్ వుడ్ బీ ఎరౌండ్ సిక్స్ మిలియన్ డాలర్స్

జంప్ ఔట్ ఆఫ్ స్కిన్
ఏదైనా ఆకస్మిక, ఆశ్చర్యకరమైన సంఘటన జరిగినప్పుడు వాడుతారు. ఉదా: ది లౌడ్ నాయిస్ మేడ్ మీ జంప్ ఔట్ ఆఫ్ మై స్కిన్

ఉత్తమ చిత్ర పురుషోత్తమన్

న్యూయార్క్‌లోని టైమ్స్‌స్క్వేర్ బిల్‌బోర్డ్‌పై ప్రదర్శించిన ఆ ఆర్ట్‌వర్క్ ప్రేక్షకులను బాగా ఆట్టుకుంటుంది. సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసుకొంటూ 'వావ్' అన్నారు. ప్రేక్షకులే కాదు కళావిమర్శకులు కూడా 'బ్రహ్మాండం' అన్నారు. ఆ ఆర్ట్‌వర్క్‌ను సృష్టించింది బెంగళూరుకు చెందిన అజయ్ పురుషోత్తమన్...

మోస్ట్ పాపులర్



● అజయ్ పురుషోత్తమన్

బెంగళూరులోని ఒక ఎడ్వర్‌టైజింగ్ కంపెనీలో ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అజయ్ పురుషోత్తమన్‌కు చిన్నప్పుడు చాలామంది పిల్లలలాగే బొమ్మలు వేయడం అంటే ఇష్టం. కార్టూన్ క్యారెక్టర్లు అంటే బోలెడు ఇష్టం. తన అభిమాన క్యారెక్టర్‌లను గీయడంలో ప్రాక్టిస్ చేస్తుండేవాడు. ఈ ఆసక్తి స్కూల్ రోజుల నుంచి కాలేజి రోజుల వరకు వచ్చింది.

2డీ ఆర్ట్, త్రీడి ఆర్ట్‌లతో ప్రయోగాలు చేస్తుండేవాడు. తనకు తెలిసిన కథలను యానిమేషన్ మరియు త్రీడి మోడలింగ్‌లోకి తీసుకువచ్చాడు.

ఎన్నో సొంత ప్రాజెక్ట్‌లు చేసేవాడు.

నాన్-ఫంగిబుల్ టోకెన్స్ (ఎన్‌ఎఫ్‌టీ)లు చిత్రకళ, సంగీతం, క్రీడా ప్రపంచంలోకి వచ్చాక ఎన్నో అవకాశాలకు దారులు తెరుచుకున్నాయి. ఈ అవకాశాన్ని, ట్రెండ్‌ను అందిపుచ్చుకొని మన దేశంలోని 'మోస్ట్ పాపులర్ ఎన్‌ఎఫ్‌టీ క్రియేటర్'లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నాడు అజయ్ పురుషోత్తమన్. తనకు వచ్చే కంటెంట్ ఐడియాలతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీ మొదలుపెట్టాడు. తనలోని సృజనకు సంబంధించి అవతలి కోణాన్ని చూపెట్టే ప్రయత్నం చేశాడు. తాను రూపొందించిన ఎన్‌ఎఫ్‌టీలను రకరకాల డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై అమ్మకం మొదలు పెట్టాడు. తన ఆర్ట్ మన దేశానికి మాత్రమే పరిమితం కావాలని అజయ్ అనుకోలేదు. 'అక్కడ ఏం జరుగుతుంది' అంటూ అంతర్జాతీయ ఆర్ట్‌పై దృష్టి పెట్టాడు. ట్రెండ్ ఏమిటో తెలుసుకున్నాడు. హాలీవుడ్ కలెక్షన్స్‌కు శ్రీకారం చుట్టాడు. అంతర్జాతీయంగా ప్రసిద్ధులైన గాయకుల త్రీడీ బాటిల్ ఆర్ట్‌ను రూపొందించాడు. ప్రయాణాలు అంటే అజయ్‌కు ఇష్టం. ఎందుకంటే స్థానిక సంస్కృతి, సంప్రదాయలను తెలుసుకోవచ్చు. అలా తెలుసుకున్నది తన కళలోకి వచ్చి చేరుతుంది. బలాన్ని ఇస్తుంది.

న్యూయార్క్‌లో జరిగే 'ఎన్‌ఎఫ్‌టీ ఎన్‌వైసీ' ప్రదర్శన 'ఎన్‌ఎఫ్‌టీ'పై ఆసక్తి, ఉత్సాహం ఉన్న వారిని ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చే వేదిక. ఈ ఉత్సవానికి అజయ్ హాజరు కానప్పటికీ అతడి చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. ప్రశంసలు అందుకున్నాయి.

'మన ఆర్ట్‌ను ప్రపంచ వేదిక మీదికి తీసుకువచ్చినందుకు సంతోషంగా ఉంది' అంటాడు అజయ్. న్యూయార్క్ టైమ్స్‌స్క్వేర్ బిల్‌బోర్డ్‌పై తన ఆర్ట్‌వర్క్ ప్రదర్శించడం అజయ్ పురుషోత్తమన్‌ని ఎంతో సంతోషానికి గురిచేసింది. మొదట దీని గురించి విన్నప్పుడు 'కలా నిజమా!' అనుకున్నాడు.

ఆ దృశ్యాన్ని కళ్లారా చూడాలనుకున్నాడు. సన్నిహితుల సహాయంతో న్యూయార్క్‌కు వెళ్లి 'ఇంతకు మించిన ఆనందం ఏమున్నది!' అనుకున్నాడు.

గత సంవత్సరం అజయ్ మొదలుపెట్టిన 'టాయ్ స్టోరీస్ ప్రొఫైల్' చాలామందిని ఆకట్టుకుంది. ఈ యానిమేషన్ సిరీస్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒక హిప్-హప్ పాటకు డ్యాన్స్ చేస్తాడు. 'షోలే' సినిమాలోని క్యారెక్టర్లు అన్నీ కలిసి ఒక పాటకు డ్యాన్స్ చేస్తాయి! నిజజీవితంలోని ప్రముఖ వ్యక్తులు ఈ సిరీస్‌లోని క్యారెక్టర్లు. ప్రతి క్యారెక్టర్‌కు తనదైన ప్రత్యేకత ఉంటుంది. రాబోయే ప్రాజెక్ట్‌ల విషయానికి వస్తే వెబ్3, ఎన్‌ఎఫ్‌టీకి సంబంధించి ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్ కోసం అర్జెంటీనా ఆర్టిస్ట్‌తో కలిసి పనిచేస్తున్నాడు.

'ఇది సవాళ్లతో కూడిన ప్రయాణం' అంటున్నాడు అజయ్. సాధారణ ఆర్టిస్ట్ నుంచి అంతర్జాతీయ స్థాయికి చేరుకున్న అజయ్ పురుషోత్తమన్ ఆ సవాళ్లను అధిగమించి మరింత పేరు తెచ్చుకోవాలని ఆశిద్దాం.

వివో ఎక్స్ ఫ్లిప్



డిస్‌ప్లే: 6.74 అంగుళాలు
వోఎస్ : ఆండ్రాయిడ్ 13
ఫ్రంట్ కెమెరా : 32 ఎంపీ
బ్యాటరీ : 4400 ఎంఏహెచ్
కనెక్టివిటీ : 5జీ డ్యూయల్ సిమ్
బరువు : 198గ్రా. మెమరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్

● టెక్.. టాక్

గో ప్రో హీరో 11 కెమెరా



- సినిమాటిక్ 5.3కె60 + 2.7కె240 వీడియో
- రీఛార్జబుల్ బ్యాటరీ
- వాటర్ ప్రూఫ్
- ఆటోమేటిక్ హైలైట్ వీడియో
- లార్జర్ న్యూ ఇమేజ్ సెన్సర్
- హైపర్‌స్మూత్ 5.0 స్టెబిలైజేషన్
- డ్యూయల్ ఎల్‌సీడీ స్క్రీన్స్

గూగుల్‌లో కొత్త ఎడిటింగ్ ఆప్షన్స్

ఫొటోస్.గూగుల్.కామ్‌లో కొత్త ఎడిటింగ్ ఆప్షన్స్...



పోట్రాయిట్‌లైట్	:	లైట్ సోర్స్‌ను ఎడ్జెస్ట్ చేసుకోవచ్చు.
పోట్రాయిట్ బ్లర్	:	బ్లర్‌డ్ బ్యాక్‌గ్రౌండ్‌ను క్రియేట్ చేయడానికి.
కలర్ పాప్	:	బ్యాక్‌గ్రౌండ్ కలర్‌ను ఫేడింగ్ చేయడం ద్వారా ఫొటోలో ముందు వైపు రంగును ప్రత్యేకంగా కనిపించేలా చేయడం.
హెచ్‌డీఆర్	:	బ్రైట్‌నెస్, ఇమేజ్‌లోని కాంట్రాస్ట్ లెవెల్స్‌ను బూస్ట్ చేయడానికి.
స్కై	:	ఎన్నో రకాల కలర్ స్కీమ్స్‌ను ఎంచుకోవచ్చు.

గార్మిన్ వాచ్



అమెరికన్ మల్టీ స్పోర్ట్ వాచ్ బ్రాండ్ గార్మిన్ కొత్త ఆప్షన్‌లతో ఫెనిక్స్ 7 ప్రొ. ఎఫిక్స్2 ప్రొ సిరీస్‌లను తీసుకు వచ్చింది. వీటిలో కొత్త మ్యాపింగ్, ట్రైనింగ్ ఫీచర్స్, హ్యాండ్-ఫ్రీ ఫ్లాష్‌లైట్‌లు, హార్ట్‌రేట్ సెన్సర్‌లు ఉన్నాయి. ఎఫిక్స్2 మోడల్స్: 42ఎంఎం, 47 ఎంఎం, 51 ఎంఎం

● ఆర్ట్ అండ్ కల్చర్

సూపర్ మోడల్



అయిదు అడుగుల తొమ్మిది అంగుళాల ఎత్తు ఉండే ఆండ్రియా కెవిచూసా పదిహేను సంవత్సరాల వయసులో మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టి, పదిహేడు సంవత్సరాల వయసు వచ్చేసరికి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఎంతోమంది ప్రముఖులతో, ఎన్నో ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్స్ చేసింది.

నాగాలాండ్‌కు చెందిన ఆండ్రియాకు సూపర్ మోడల్ లెనో కెన్స్ రోల్‌మోడల్. నాగాలాండ్ మూలాలు మోడలింగ్‌లో ఆండ్రియాకు స్పెషల్ లుక్ ఇచ్చాయి. 'మోడల్‌లింగ్‌లో ఎంతో మంది పరిచయం అవుతుంటారు. ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. ప్రశంసను ఎలా ఆనందంగా స్వీకరిస్తామో, విమర్శను కూడా అలాగే ఆమోదించాలి. సలహాలు తీసుకోవాలి. మనకంటూ పేరు రావడం మంచిదేగానీ కాళ్లు మాత్రం నేలమీదే ఉండాలి. పరిణతితో కూడిన మనస్తత్వం ఈ ఫీల్డ్‌లోనే కాదు మన జీవితం మొత్తం ఉపయోగపడుతుంది' అంటుంది ఆండ్రియా 'అనేక్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది ఆండ్రియా. ఈ సినిమాలో తాను పోషించిన బాక్సర్ పాత్ర కోసం బాక్సింగ్‌లో కఠిన శిక్షణ తీసుకుంది. బైక్ రైడింగ్ నేర్చుకుంది. తన హిందీని మెరుగుపరుచుకుంది. డ్యాన్స్, యాక్షన్ ట్రైనింగ్ క్లాస్‌లకు హాజరైంది. ఈ శ్రమ వృథా పోలేదు. ఆమె నటప్రతిభ డైరెక్టర్, రైటర్ అనుభవ్ సిన్హాకు ఎంతో నచ్చింది. ఒక పెద్ద దర్శకుడి నుంచి ప్రశంస అందుకోవడాన్ని మించిన పెద్ద అవార్డ్ ఏముంటుంది! 'నా ప్రయాణం నల్లేరు మీద నడక కాదు. విపక్షపూరిత మాటలు ఎన్నో విన్నాను. వాటిని పట్టించుకొని ఉంటే ఎక్కడో ఆగిపోయేదాన్ని' అంటుంది 22 సంవత్సరాల ఆండ్రియా కెవిచూసా.

● గేమింగ్

అర చేతిలో నరకం



యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ 'ఫైనల్ ఫాంటసీ-16' ఈ నెల 22న విడుదల అవుతుంది. 'వాలిస్టియా' అనే కాల్పనిక ప్రపంచంలో జరిగే గేమ్ ఇది. ఎన్నో శక్తులు ఈ ప్రపంచంపై ఆధిపత్యం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. ఈ ప్రపంచంలో ఒకవైపు కారాగారాలు, మరో వైపు విశాలమైన బహిరంగ క్షేత్రాలు ఉంటాయి. గేమ్‌లో 'స్టోరీ మోడ్' 'నార్మల్ మోడ్'లు ఉంటాయి. ఈ గేమ్‌లో ప్రొటాగనిస్ట్ పేరు...క్లైవ్. ఈ క్లైవ్‌కు 'వాలిస్టియా' ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలపై పట్టు ఉంటుంది. 'అంచనాలకు తగినట్లుగా కాదు అంచనాలకు మించి ఆకట్టుకునేలా గేమ్‌ను తీర్చిదిద్దాం' అంటున్నాడు క్రియేటివ్ డైరెక్టర్ కజు టోయో.

జానర్స్	:	యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్, ఫైటింగ్ గేమ్, ఎడ్వెంచర్ గేమ్
మోడ్స్	:	సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్స్	:	ప్లేస్టేషన్ 5

సినిమా



● నాగ చైతన్య

పడతారండి ప్రేమలో మళ్లీ..!

నిన్నమొన్నటివరకూ పాన్ ఇండియా ట్రెండ్‌లో యాక్షన్ సినిమాలొచ్చాయి. అయితే ఇప్పుడు ఇండస్ట్రీలో మళ్లీ లవ్‌ట్రెండ్ మొదలైంది. యాక్షన్ సినిమాలు చేస్తున్న హీరోలు మళ్లీ వెండితెరపై ప్రేమలో పడటానికి ప్రేమకథలు వింటున్నారు. కొందరి ప్రేమకథలు ఆల్రెడీ ఆన్ సెట్స్‌లో ఉన్నాయి. ఈ వెండితెర ప్రేమికుల ప్రేమకథా చిత్రాల గురించి తెలుసుకుందాం.



● ప్రభాస్

● విజయ్ దేవరకొండ

● ప్రభాస్ అనగానే సినిమా లవర్స్ ఎక్కువగా 'బాహుబలి', 'ఛత్రపతి', 'మిర్చి', 'సాహో' వంటి యాక్షన్ మూవీస్ గురించి మాట్లాడుకుంటారు. కాగా ప్రభాస్ కెరీర్‌లో మంచి హిట్స్ సాధించిన 'వర్షం', 'డార్లింగ్', 'మిస్టర్ పర్‌ఫెక్ట్' వంటి ప్రేమకథా చిత్రాలు కూడా ఉన్నాయి. అయితే గడచిన పదేళ్లల్లో ప్రభాస్ 'రాధేశ్యామ్' (2022) తప్ప అన్నీ యాక్షన్ చిత్రాలే చేశారు. ప్రస్తుతం 'సలార్', 'ప్రాజెక్ట్ కె' సినిమాలతో యాక్షన్ మోడ్‌లోనే ఉన్నారు. మళ్లీ ఓ ప్రేమకథ చేయాలని ప్రభాస్ భావిస్తున్నారట. ఇందులో భాగంగా లవ్ స్టోరీస్ స్పెషలిస్ట్ డైరెక్టర్ హను రాఘవపూడి రెడీ చేసిన ఓ ప్రేమ కథను ప్రభాస్ విన్నారని, ఇది పీరియాడికల్ లవ్‌స్టోరీ అనీ సమాచారం.

● '100 పర్సెంట్ లవ్', 'ఏ మాయ చేసావె', 'మనం', 'ఒక లైలా కోసం', 'ప్రేమమ్', 'మజిలీ', 'లవ్‌స్టోరీ'.... ఇలా చెప్పుకుంటూ పోతే నాగచైతన్య కెరీర్‌లోని మేజర్ పార్ట్ అంతా ప్రేమతోనే నిండిపోయి ఉంటుంది. కాగా తన గత చిత్రం 'కస్టడీ'లో నాగ చైతన్య ఎక్కువగా యాక్షన్ చేశారు. అయితే చైతూ తన ప్రేమతో మరోసారి ఆడియన్స్‌ను ప్రేమలో పడేయనున్నారని తెలుస్తోంది. నాగచైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. సూరత్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే ఓ లవ్‌స్టోరీగా ఈ చిత్రం తెరకెక్కనుందని, ఇందులో నాగచైతన్య బోటు డ్రైవర్ పాత్ర చేయనున్నారనీ టాక్.



● అఖిల్

● 'హలో', 'మిస్టర్ మజ్ను', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'... ఇలా కొన్ని ప్రేమకథల్లో నటించారు అఖిల్. అయితే అఖిల్ గత చిత్రం 'ఏజెంట్' ఫుల్ యాక్షన్ ఫిల్మ్. దీంతో తన తర్వాతి చిత్రాన్ని లవ్ జానర్‌లోనే చేయాలనుకుంటున్నారట అఖిల్. ఈ క్రమంలోనే అనిల్‌కుమార్ అనే ఓ కొత్త దర్శకుడి కథకు అఖిల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనీ, ఫ్యాంటసీ లవ్‌స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథనం ఉంటుందని, 'ధీర' టైటిల్‌ను పరిశీలిస్తున్నారనీ టాక్.

● హీరో విజయ్ దేవరకొండ కెరీర్‌లో ప్రేమ, మాస్ కథలు సమానంగా కనిపిస్తాయి. కానీ విజయ్‌కు ఇండస్ట్రీలో మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది మాత్రం మాస్ లవ్‌స్టోరీ 'అర్జున్ రెడ్డి', క్లాస్ లవ్‌స్టోరీస్ 'పెళ్లి చూపులు', 'గీత గోవిందం' వంటి సినిమాలే. దీంతో విజయ్ మరోసారి లవ్‌స్టోరీస్‌పై ఫోకస్ పెట్టినట్లు ఉన్నారు. దర్శకుడు శివ నిర్వాణతో విజయ్ ప్రస్తుతం 'ఖుషి' అనే లవ్‌స్టోరీ చేస్తున్నారు. ఇందులో సమంత హీరోయిన్. అలాగే 'గీత గోవిందం' తర్వాత దర్శకుడు పరశురామ్‌తో మరో సినిమా చేస్తున్నారు విజయ్. ఇది కూడా ప్రేమ కథా చిత్రమేనన్నది ఫిల్మ్‌నగర్ టాక్.

● 'డీజే టిల్లు'తో మరింత పాపులారిటీని సాధించిన సిద్ధు జొన్నలగడ్డ కెరీర్‌లో 'కృష్ణ అండ్ హిజ్ లీల', 'మా వింత గాథ వినుమా' వంటి ప్రేమకథా చిత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం సిద్ధు 'డీజే టిల్లు స్క్వేర్'తో బిజీగా ఉన్నారు. అలాగే దర్శకురాలు నందినీ రెడ్డితో ఓ సినిమా కమిట్ అయ్యారు. ఓ డిఫరెంట్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం తెరకెక్కనుందని టాక్.



● సిద్ధు



● ఆనంద్ దేవరకొండ

● 'దొరసాని' వంటి ప్రేమకథతో పరిచయం అయిన ఆనంద్ దేవరకొండ ఆ తర్వాత 'హైవే' వంటి క్రైమ్ థ్రిల్లర్ చేశారు. ఆనంద్ నటించిన మరో లవ్‌స్టోరీ 'బేబీ'. ప్రేమకథా చిత్రంగా సాయిరాజేష్ తెరకెక్కించిన ఈ చిత్రం జూలై 14న రిలీజ్ కానుంది. మరికొందరు హీరోలు కూడా ఆడియన్స్‌ను ప్రేమలో పడేసేందుకు ప్రేమకథలు వింటున్నట్లు తెలుస్తోంది.

ఆత్మపరిశీలన చేసుకున్నా!
- సమంత



''ఈ ఏడాది ఎప్పుడూ చేయనన్ని పూజలు, ప్రార్థనలు చేశా. నాకు వరాలు ఇమ్మని, దీవెనలు అందించమని కాదు. శక్తిని, ప్రశాంతతను ఇవ్వమని దేవుణ్ణి ప్రార్థించా. మన ప్రార్థనలను ఆలకించడంలో భగవంతుడు కొన్నిసార్లు ఆలస్యం చేస్తాడేమో కానీ, ఎలాంటి స్వార్థం లేని శాంతి, ప్రేమ, సంతోషం, శక్తిని కోరుకుంటే కాదనడు'' అని సమంత పేర్కొన్నారు. మయోసైటిస్ కారణంగా కొన్ని నెలలు షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చిన సమంత కోలుకుని సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. ప్రస్తుతం రాజ్-డీకే ద్వయం తెరకెక్కిస్తున్న 'సిటాడెల్' వెబ్ సిరీస్ షూటింగ్ కోసం సెర్బియాలో ఉన్నారు. ఈ సందర్భంగా అక్కడి 'సెర్బ్ ఆఫ్ సెయింట్ సావా'ను సందర్శించి ప్రార్థనలు చేశారామె. ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి, మయోసైటిస్ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ తన జీవిత ప్రయాణం ఎలా సాగిందో ఓ సుదీర్ఘమైన పోస్టు చేశారామె.

''మయోసైటిస్ వ్యాధి నిర్ధారణ అయి ఏడాది అవుతోంది. ఈ ఏడాదిలో ఎప్పుడూ ఊహించని కొత్త పరిస్థితుల్ని ఎదుర్కొన్నాను. నా శరీరంతో ఎన్నో పోరాటాలు చేశా. ఇష్టమైన ఆహారాన్ని బలవంతంగా వదులుకున్నా. మందులే ఆహారం అయ్యాయి. ఆలోచించడం, ఆత్మపరిశీలన చేసుకోవడంతోనే ఈ ఏడాది సరిపోయింది. వ్యక్తిగతంగానే కాకుండా వృత్తిపరమైన పరాజయాల విషయంలోనూ ఆత్మపరిశీలన చేసుకున్నా. పరిస్థితులను మెరుగుపరచమని కోరుతూ దేవుడికి ఎన్నో ప్రార్థనలు చేశా. అన్నీ మనకు అనుకూలంగానే జరగవన్న విషయం ఈ ఏడాది నేర్పించింది. ముఖ్యంగా ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఫర్వాలేదని తెలుసుకున్నా. నా చేతుల్లో లేనిదాన్ని వదిలేయడం నేర్చుకున్నాను. కొన్నిసార్లు గొప్ప విజయాలు అక్కర్లేదు. పరిస్థితి నుంచి బయటపడటమూ ఒక విజయమే. ప్రతిదీ పరిపూర్ణం కావాలని ఎదురు చూడకూడదు.. గతాన్ని తలుచుకుంటూ అక్కడే ఆగిపోకూడదు. నన్ను ప్రేమించే వారిని ప్రేమిస్తాను.. ద్వేషానికి మాత్రం నన్ను ఇబ్బందిపెట్టే అవకాశం ఇవ్వకూడదనుకున్నా'' అని పోస్ట్ చేశారు సమంత.

పగ.. ప్రతీకారం...



● 'దిల్' రాజు, కళాధర్ కొక్కొండ

కళాధర్ కొక్కొండ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కర్ణ'. మోనా ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. సనాతన క్రియేషన్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాత 'దిల్' రాజు విడుదల చేశారు. కళాధర్ కొక్కొండ మాట్లాడుతూ- ''వాస్తవ ఘటనలతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'కర్ణ'. పగ, ప్రతీకారం నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ చిత్రంలోని ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ బీజే, కెమెరా: శ్రవణ్ జి.కుమార్.

ట్రైలర్ చూస్తే కష్టం అర్థమవుతోంది
- డైరెక్టర్ నాగ్ అశ్విన్

''నా దగ్గర ఓ వెబ్ సిరీస్‌కు సుబ్రమణ్యం అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాడు. 'నెల్లూరి నెరజాణ' సినిమాను తెరకెక్కించటానికి చాలా కష్టపడ్డాడు. ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే టీమ్ అందరూ ఎంత కష్టపడ్డారో అర్థమవుతోంది. ఈ సినిమా మంచి విజయం సాధించి, వారందరికీ గొప్ప జీవితాన్ని ఇస్తుందనే నమ్మకం ఉంది'' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. ఎంఎస్ చంద్ర, హరి హీరోలుగా, అక్షాఖాన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'నెల్లూరి నెరజాణ'. చిగురుపాటి సుబ్రమణ్యం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌ని నాగ్ అశ్విన్ విడుదల చేశారు. ''నెల్లూరి నెరజాణ' సినిమా అంతా నెల్లూరు యాసలో సాగుతుంది'' అన్నారు చిగురుపాటి సుబ్రమణ్యం. ''ఇంత మంచి సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన సుబ్రమణ్యంగారికి కృతజ్ఞతలు'' అన్నారు ఎంఎస్ చంద్ర, హరి, అక్షా ఖాన్.



● నాగ్ అశ్విన్, అక్షా ఖాన్

థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా 1920
- నాగార్జున



● మహేశ్‌భట్, నాగార్జున, అవికా గోర్, కృష్ణ

''నాకు హారర్ సినిమాలు చూడాలంటే భయం. కానీ '1920 హారర్స్ ఆఫ్ ది హార్ట్' సినిమా చూడాలనిపిస్తోంది. చూడాలనిపించేలా ఈ సినిమాను చేశారు'' అన్నారు నాగార్జున. అవికా గోర్, రాహుల్ దేవ్, బర్ఖా బిష్ట్, డానిష్ పండోర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '1920 హారర్స్ ఆఫ్ ది హార్ట్'. దర్శక-నిర్మాత మహేశ్‌భట్ రచన, సమర్పణలో కృష్ణాభట్ దర్శకత్వంలో రాకేష్ జునేజా, శ్వేతాంబరీ భట్ డా.రాజ్‌కిషోర్ ఖవ్రే నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన '1920 హారర్స్ ఆఫ్ ది హార్ట్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ- ''మహేశ్‌భట్‌గారు చాలా స్ఫూర్తినిచ్చే వ్యక్తి. 'తెలుసా మనసా' ('క్రిమినల్') పాటను ఆయన చేయించుకున్న విధానం నాకిప్పటికీ గుర్తు ఉంది. ఇక '1920' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సినిమాలను థియేటర్స్‌లోనే చూడాలి. అవికా కెరీర్‌లో ఈ సినిమా పెద్దహిట్‌గా నిలవాలి. అలాగే ఇవాళ ఒక పెద్ద సినిమా ప్రభాస్ 'ఆదిపురుష్' రిలీజ్ అవుతోంది. ఈ సినిమా అందరినీ మళ్లీ థియేటర్‌లోకి తీసుకురావాలి.. జై శ్రీరామ్'' అన్నారు నాగార్జున. ''నాగార్జునగారి వల్లే '1920 హారర్స్ ఆఫ్ ది హార్ట్'ను తెలుగులో విడుదల చేస్తున్నాం. వాళ్ల నాన్నగారి విలువలు, సంస్కారాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు నాగార్జున. విలువలు, సంస్కారం కాపాడుకోవడం చాలా ముఖ్యం. '1920' సినిమా కథ ఈ అంశాల గురించే'' అన్నారు మహేశ్‌భట్. ''నా తొలి సినిమా 'ఉయ్యాల జంపాల' నుంచి నాగార్జునగారు నన్ను సపోర్ట్ చేస్తున్నారు. ఇప్పుడు హిందీలో నా తొలి చిత్రం '1920' సినిమా ట్రైలర్ లాంచ్‌కు ఆయన రావడం చాలా సంతోషంగా ఉంది. '1920' నా కెరీర్‌లో స్పెషల్ మూవీ'' అన్నారు అవికా గోర్. ''ఇదొక ఎమోషనల్ లవ్‌స్టోరీ. హారర్‌లో ఎమోషన్‌ను ప్రయత్నించడం ఇదే తొలిసారి'' అన్నారు కృష్ణాభట్.

జాగ్రత్త బిడ్డా



● కృష్ణమోహన్, సీతక్క, శ్రీకాంత్

కృష్ణమోహన్, ప్రియాంక రెవ్రి, శ్రీకాంత్ కరణం, ఎమ్‌వై గిరిబాబు, హీనారాయ్, రమ్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'జాగ్రత్త బిడ్డా'. కృష్ణ మోహన్ దర్శకత్వంలో శ్రీకాంత్ కరణం, ఎమ్‌వై గిరిబాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ కానుంది. డిస్ట్రిబ్యూటర్ ఎమ్. అచ్చిబాబు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క 'జాగ్రత్త బిడ్డా' ట్రైలర్‌ని విడుదల చేసి, మాట్లాడుతూ-''డీజే టిల్లు, బలగం' చిత్రాల్లా తెలంగాణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం విజయం సాధించాలి'' అన్నారు. ''తన చెల్లెళ్లకు జరిగిన అన్యాయానికి ఓ అన్న విధించిన శిక్ష నేపథ్యంలో రూపొందిన చిత్రమిది'' అన్నారు కృష్ణ మోహన్.

ఓ వయ్యారి వన్నెలాడి..



● శివ

శివ కోన, ప్రభాకర్, కునల్ కౌశల్, నేహా దేశ్ పాండే ముఖ్య తారలుగా, ప్రాచి కెథర్, అభిలాష్ బండారి, రమ్య దినేష్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రాజుగారి కోడిపులావ్'. శివ కోన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది. అనిల్ మోదుగ మరో నిర్మాత. కాగా ఈ సినిమాలోని 'సునో సునామీ' పాట లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'ఔరౌర కన్నె కోడి.. ఓ వయ్యారి వన్నెలాడి' అంటూ ఈ పాట సాగుతుంది. సంగీత దర్శకుడు ప్రవీణ్ మని స్వరపరచిన ఈ పాటకు మల్లిక్ వల్లభ లిరిక్స్ అందించగా ఎన్సీ కారుణ్య, వైశాలి శ్రీ ప్రతాప్ పాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	311	62,917
నిఫ్టీ ▽	68	18,688

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్	13,718	▲	36
డోజోన్స్	34,357	▲	378
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,628	▲	25
డాక్స్	16,290	▲	21
షాంఘై	3,252	▲	24
నికాయ్	33,486	▽	7

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	58,934	▽	330
బంగారం (99.5 స్వచ్ఛత)	58,698	▽	329
వెండి (కిలో)	71,062	▽	1,043

టిటాగఢ్ నుంచి వందే భారత్ రైళ్లు

- బీహెచ్‌ఈఎల్ కన్సార్షియంకు కాంట్రాక్ట్
- 80 స్లీపర్ రైళ్ల సెట్ తయారీ, నిర్వహణ
- కాంట్రాక్టు విలువ రూ. 24,000 కోట్లు



న్యూఢిల్లీ: దేశీ రైల్వేలు కొత్తగా ప్రవేశపెట్టదలచిన వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీ కాంట్రాక్టును టిటాగఢ్ రైల్ సిస్టమ్స్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్(భెల్) కన్సార్షియం దక్కించుకుంది. తద్వారా మొత్తం 80 స్లీపర్ ట్రెయిన్ల తయారీకి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వీటిని 2029కల్లా అందించవలసి ఉన్నట్లు సంయుక్త ప్రకటనలో టిటాగఢ్, భెల్ తెలియజేశాయి. మొత్తం కాంట్రాక్టు విలువను రూ. 24,000 కోట్లుగా వెల్లడించాయి. దేశీ సంస్థల కన్సార్షియంకు ఈ స్థాయి విలువలో రైల్వే శాఖ కాంట్రాక్టునివ్వడం ఇదే తొలిసారికాగా.. వందే భారత్ స్లీపర్ రైళ్ల డిజైన్, తయారీతోపాటు.. 35 ఏళ్లపాటు నిర్వహణను చేపట్టనున్నాయి. టెండర్ విధానంలో ఏకైక ఆత్మనిర్భర్ కన్సార్షియంగా టిటాగఢ్ రైల్ సిస్టమ్స్, బీహెచ్‌ఈఎల్ కన్సార్షియం నిలిచింది.

రెండేళ్లలో..: వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీ కాంట్రాక్టును ఆరేళ్లలో పూర్తి చేయవలసి ఉన్నట్లు టిటాగఢ్ రైల్ వైస్‌చైర్మన్, ఎండీ ఉమేష్ చౌధరీ తెలియజేశారు. తొలి ప్రొటోటైప్ రైలును రెండేళ్లలోగా డెలివరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తదుపరి మిగిలిన రైళ్లను అందించనున్నట్లు వివరించారు. ప్రతీ రైలుకు 16 కోచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. తద్వారా సుమారు 887 మంది ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. గంటకు 160 కిలోమీటర్ల వేగాన్ని అందుకునేలా డిజైన్ చేయనున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగమవుతున్నందుకు గర్వపడుతున్నట్లు వ్యాఖ్యానించారు. రైళ్ల తయారీలో చివరి దశ అసెంబ్లీ, పరిశీలన, నిర్వహణ వంటివి చెన్నైలోని దేశీ రైల్వే ప్లాంటులో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

4వ నెలా.. ఎగుమతులు మైనస్!

- మేలో 10.3% క్షీణత
- విలువ 34 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: భారత్ వస్తు ఎగుమతులు నిరాశాజనకంగా కొనసాగుతున్నాయి. వరుసగా నాలుగో నెల (మే)లోనూ అసలు వృద్ధిలేకపోగా (2022 మే నెలతో పోల్చి) 10.3 శాతం క్షీణించాయి. విలువలో 34.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

దిగుమతులు ఇలా...

ఇక వస్తు దిగుమతులు సైతం 6.6% తగ్గి 57.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు–దిగుమతుల విలువల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు 5నెలల గరిష్ట స్థాయిలో 22.12 బిలియన్ డాలర్లకు చేరింది. వాణిజ్య మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాల్లో ముఖ్యాంశాలు..

- పెట్రోలియం ప్రొడక్టులు, ఆభరణాలు, ఇంజనీరింగ్ గూడ్స్, రెడీ–మేడ్ దుస్తులు, రసాయనాల రంగాల ఎగుమతుల్లో అసలు వృద్ధిలేకపోగా క్షీణత నమోదయ్యింది.
- పెట్రోలియం ప్రొడక్ట్స్ పరిశీలిస్తే, ఎగుమతులు 30 శాతం తగ్గి, 6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- చమురు దిగుమతులు మేలో 6% పడిపోయి 15.62 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- పసిడి దిగుమతులు సైతం 38.71% పడిపోయి 4 బిలియన్ డాలర్లకు చేరాయి.

రెండు నెలల్లోనూ క్షీణతే

ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో (ఏప్రిల్–మే) ఎగుమతులు 11.41 శాతం క్షీణించి 69.72 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు సైతం 10.24 శాతం పడిపోయి, 107 బిలియన్ డాలర్లకు చేరాయి. వెరసి వాణిజ్యలోటు 37 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. భారత్ వస్తు ఎగుమతులు 2022–23లో 2021–22తో పోల్చితే 6 శాతం పెరిగి 447 బిలియన్ డాలర్లకు చేరాయి.

50 శాతం ఆదాయ వృద్ధి లక్ష్యం

అప్‌స్టాక్స్ సీఈవో రవి కుమార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్రోకరేజీ సంస్థ అప్‌స్టాక్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 50 శాతం ఆదాయ వృద్ధి లక్ష్యంగా పెట్టుకుంది. 25–30 శాతం మేర లాభాల వృద్ధి ఉండగలదని అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ ఆదాయం రూ. 1,000 కోట్లు దాటగా.. బ్రేక్ ఈవెన్ సాధించింది. అప్‌స్టాక్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో రవి కుమార్ గురువారమిక్కడ విలేకరుల సమావేశం సందర్భంగా ఈ విషయాలు తెలిపారు. ప్రస్తుతం తమకు 1.1 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారని, 2030 నాటికి ఈ సంఖ్యను పది కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆయన వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో క్లయింట్ల సంఖ్య గత రెండేళ్లలో 13% పెరిగిందని, వీరిలో 70% మంది యువ ఇన్వెస్టర్లేనని రవి కుమార్ చెప్పారు. డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో దేశ సగటుతో పోలిస్తే ఇక్కడ రెట్టింపు స్థాయిలో ట్రేడర్లు ఉన్నట్లు వివరించారు. అడ్వాన్స్‌డ్ ట్రేడర్ల కోసం రియల్ టైమ్ సమాచారంతో ట్రేడ్ మోడ్, ఇన్వెస్టర్ల కోసం ఇన్వెస్ట్ మోడ్ పేరిట రెండు ఆప్షన్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. 2018 నుంచి ఇప్పటివరకూ 200 మిలియన డాలర్ల నిధులు సమీకరించామని చెప్పారు. అప్‌స్టాక్స్‌లో ప్రస్తుతం 600 మంది పైచిలుకు సిబ్బంది ఉండగా.. హైదరాబాద్‌లో దాదాపు 40 మంది ఉన్నారు. అవసరాన్ని బట్టి స్థానికంగా కార్యాలయం ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు కుమార్ తెలిపారు.

బీ న్యూ స్టోర్లలో రియల్‌మీ 11ప్రో ప్లస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్లు



హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చెయిన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో రియల్‌మీ 11 ప్రో ప్లస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ బీ న్యూ స్టోర్‌లో గురువారం నటి వర్ష బొల్లమ్మ ఈ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేశారు. బజాజ్, టీవీఎస్ క్రెడిట్, హెచ్‌డీబీ, బీనా, క్లైవర్‌పే ద్వారా నెలవారీ వాయిదా పద్ధతిలో ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చు. జీరో ఫైనాన్స్ కూడా అందుబాటులో ఉంది. ఈ అవకాశాన్ని కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని బీ న్యూ స్టోర్ సీఎండీ బాలాజీ చౌదరి కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ సీఈఓ సాయి నిఖిలేశ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్‌తో పాటు రియల్‌మీ సౌతిండియా సేల్స్ హెడ్ వేణు మాధవ్‌లు పాల్గొన్నారు.


హీరో కొత్త ఎక్స్‌ట్రీమ్ బైక్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రీమియం బైక్ ఎక్స్‌ట్రీమ్ 160ఆర్ 4వీ ప్రవేశపెట్టింది. మూడు వేరియంట్లలో లభిస్తుంది. భారత్‌లో 160 సీసీ విభాగంలో అధిక వేగంతో పరుగెత్తే మోడల్ ఇదేనని కంపెనీ తెలిపింది. ధర హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో రూ.1.29 లక్షల నుంచి ప్రారంభమై రూ.1.38 లక్షల వరకు ఉంది. బీఎస్–6 రెండవ దశ, ఈ20 ప్రమాణాలకు అనుగుణంగా సింగిల్ సిలిండర్, ఆయిల్ కూల్డ్, ఫోర్–వాల్వ్ 163 సీసీ ఇంజన్‌ను పొందుపరిచారు. 5 స్పీడ్ గేర్ బాక్స్, 16.6 హెచ్‌పీ పవర్, 14.6 ఎన్‌ఎం టార్క్ కలిగి ఉంది. బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. జూలై రెండవ వారం నుంచి డెలివరీలు ఉంటాయి. 'ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగంలో కొత్త శ్రేణిని నిర్ణయించే ఉత్పత్తులను పరిచయం చేయబోతున్నాం. ఏడాది పొడవునా విడుదల చేసే క్రమంలో ఎక్స్‌ట్రీమ్ 160ఆర్ 4వీ మొదటిది' అని హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా ఈ సందర్భంగా తెలిపారు.

మూడు రోజుల లాభాలకు 'ఫెడ్' బ్రేక్!

- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు
- మళ్లీ 63 వేల దిగువకు సెన్సెక్స్
- 18,700 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ



ముంబై: బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో స్టాక్ సూచీలు గురువారం నష్టాలను చవిచూశాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ.., ప్రస్తుత ఏడాదిలో రెండుసార్లు పెంపు ఉండొచ్చని సంకేతాలిచ్చింది. దీంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లతో పాటు దేశీయ మార్కెట్లపై కూడా ప్రతికూల ప్రభావం కొనసాగింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి క్షీణత కూడా నిరాశపరిచింది. దీంతో సూచీల మూడు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడినట్లైంది. ఉదయం సెన్సెక్స్ 75 పాయింట్ల నష్టంతో 63,154 వద్ద, నిఫ్టీ 18 పాయింట్లు పెరిగి 18,774 వద్ద మిశ్రమంగా ప్రారంభమయ్యాయి. తొలి సెషన్‌లో ఫ్లాటుగా ట్రేడైన సూచీలు.., మిడ్ సెషన్ నుంచి నష్టాల బాట పట్టాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 440 పాయింట్ల పరిధిలో 62,871 వద్ద గరిష్టాన్ని, 63,311 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 311 పాయింట్ల నష్టంతో 63 వేల దిగువున 62,917 వద్ద స్థిరపడింది. నిఫ్టీ రోజంతా 18,669 – 18,794 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 68 పాయింట్లు బలపడి 18,688 వద్ద ముగిసింది. బ్యాంక్స్, ఫైనాన్స్‌తో పాటు రియల్టీ, టెక్, ఐటీ, మెటల్ షేర్లు నష్టాలను చవిచూశాయి. విస్తృత స్థాయి మార్కెట్లో ఫార్మా, ఆటో, ఎఫ్‌ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.30%, 0.12 శాతం చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,086 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.298 కోట్ల షేర్లను విక్రయించారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 14 క్షీణించి 82.19 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కోల్‌కతాలో విలాసవంతమైన నివాస గృహ ప్రాజెక్ట్ నిర్మాణానికి స్థలాన్ని సేకరిస్తున్నట్లు తెలపడంతో గ్రోదేజ్ ప్రాపర్టీస్ నాలుగు శాతం లాభపడి రూ.1569 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఐదున్నర శాతం ర్యాలీ చేసి రూ.1589 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధం నుంచి ఆర్డర్లు పెరగొచ్చనే అంచనాలతో భారత్ డైనమిక్స్ షేరు 2% పెరిగి రూ.1129 వద్ద స్థిరపడింది. ఇటీవలే బ్రోకరేజ్ సంస్థ ఐసీఐసీఐ సెక్యూరిటీ 'బై' రేటింగ్ కేటాయింపుతో పాటు షేరు టార్గెట్ ధరను పెంచింది.
- జేపీ మోర్గాన్ భారత ఐటీ రంగం రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేయడంతో ఐటీ స్టాకులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, ఎంఫసీస్ తదితర సంస్థలను 'ప్రతికూల ప్రభావ పరిశీలన' జాబితాలో చేర్చింది. ఫలితంగా విప్రో 2%, ఇన్ఫీ, కోఫోర్జ్‌లు 1% పతనమయ్యాయి. టీసీఎస్, ఎంఫసీస్ టెక్ మహీంద్రా షేర్లు అరశాతం నష్టపోయాయి.

19న తాజా గోల్డ్ బాండ్ స్కీమ్



న్యూఢిల్లీ: బంగారంలో పెట్టుబడిపెట్టాలనుకునేవారికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మొదటి ఆరు నెలల్లో రెండుసార్లు– జూన్, సెప్టెంబర్‌లో సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ అందుబాటులో రానుంది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. దీనిప్రకారం జూన్ 19 నుంచి 23వ తేదీ వరకూ అలాగే సెప్టెంబర్ 11 నుంచి 15 వ తేదీల్లో గోల్డ్ బాండ్ స్కీమ్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. గోల్డ్ బాండ్లు– షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు (స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మినహా), స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నిర్దిష్ట పోస్టాఫీసులు, డీ–మ్యాట్ అకౌంట్‌తో గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా కొనుగోలు చేయవచ్చు.

మేఘా కంపెనీకి రూ.500 కోట్ల ఆర్డర్

రక్షణ శాఖ నుంచి అందుకున్న ఐకామ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) అనుబంధ కంపెనీ ఐకామ్ టెలి తాజాగా భారత రక్షణ శాఖ నుంచి రూ.500 కోట్ల ఆర్డర్ చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా 5/7.5 టన్నుల రేడియో రిలే కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ కంటైనర్స్ 1,035 యూనిట్లు సరఫరా చేయనుంది. రక్షణ శాఖతో ఈ మేరకు ఒప్పందం కుదిరిందని ఐకామ్ టెలి గురువారం తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే డెలివరీలు ప్రారంభం అవుతాయని వివరించింది.



రక్షణ శాఖ అధికారులతో ఐకామ్ ప్రతినిధులు

సాక్షి స్పోర్ట్స్



అమెరికా మేజర్ లీగ్ క్రికెట్‌లో రాయుడు

ఇటీవల ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన భారత క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు వచ్చే నెలలో అమెరికాలో జరిగే మేజర్ లీగ్ క్రికెట్ టి20 టోర్నమెంట్‌లో బరిలోకి దిగనున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాయుడు మేజర్ లీగ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఐపీఎల్‌లోని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు యాజమాన్యానిదే టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టు. జూలై 13 నుంచి 30 వరకు జరిగే మేజర్ లీగ్ టోర్నీలో ముంబై ఇండియన్స్ న్యూయార్క్ జట్టు, లాస్ ఏంజెలిస్ నైట్‌రైడర్స్, సియాటిల్ ఒర్కాస్, వాషింగ్టన్ ఫ్రీడమ్, శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్ జట్లు కూడా పోటీపడనున్నాయి.

సెమీఫైనల్లో బోపన్న జోడీ

స్టుట్‌గార్ట్‌లో జరుగుతున్న బాస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6–1, 7–5తో ముసెట్టి–సొనెగో (ఇటలీ) జంటపై గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

ఆగస్టు 31 నుంచి ఆసియా కప్ టోర్నీ

పాకిస్తాన్‌లో 4, శ్రీలంకలో 9 మ్యాచ్‌లు



న్యూఢిల్లీ: ఎట్టకేలకు ఆసియా కప్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆధ్వర్యంలో జరగనున్న ఈ టోర్నీని 'హైబ్రిడ్ మోడల్'లో నిర్వహించేందుకు జై షా అధ్యక్షుడిగా ఉన్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 17 వరకు ఈ టోర్నీని నిర్వహిస్తారు. పాకిస్తాన్‌లో 4 మ్యాచ్‌లు... శ్రీలంకలో 9 మ్యాచ్‌లు జరుగుతాయి. భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్, నేపాల్ జట్లు టైటిల్ కోసం పోటీపడతాయి. ఆరు జట్లను రెండు గ్రూప్‌లుగా (మూడు జట్లు చొప్పున) విభజించారు. ఒక గ్రూప్‌లో భారత్, పాకిస్తాన్, నేపాల్... మరో గ్రూప్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ జట్లున్నాయి. గ్రూప్ దశ తర్వాత రెండు గ్రూప్‌ల నుంచి రెండేసి జట్లు 'సూపర్ ఫోర్' దశకు అర్హత సాధిస్తాయి. 'సూపర్ ఫోర్' దశ తర్వాత టాప్–2లో నిలిచిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. పాకిస్తాన్‌లోని నాలుగు మ్యాచ్‌లకు లాహోర్ వేదికగా నిలుస్తుంది. శ్రీలంకలో క్యాండీ, పల్లెకెలెలో మ్యాచ్‌లు ఉంటాయి. ఈ ఏడాది వన్డే వరల్డ్ కప్ ఉండటంతో ఈసారి ఆసియా కప్‌ను వన్డే ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. అయితే మ్యాచ్‌ల షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తారు. గత ఏడాది టి20 వరల్డ్‌కప్ జరగడంతో ఆసియా కప్ టోర్నీని టి20 ఫార్మాట్‌లో నిర్వహించగా... ఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించి శ్రీలంక విజేతగా నిలిచింది.

భారత్, లెబనాన్ మ్యాచ్ 'డ్రా'



భువనేశ్వర్: ఇంటర్‌కాంటినెంటల్ కప్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్ లీగ్ దశను భారత్ 'డ్రా'తో ముగించింది. భారత్, లెబనాన్ జట్ల మధ్య గురువారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్ 0–0తో 'డ్రా'గా ముగిసింది. ఇప్పటికే ఈ రెండు జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ మ్యాచ్‌లో స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రిని 82వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా ఆడించారు. భారత్, లెబనాన్ జట్ల మధ్య ఫైనల్ ఆదివారం జరుగుతుంది.

బ్రిజ్‌భూషణ్‌కు ఊరటనిస్తూ...

- 'పోక్సో'ను తొలగించేందుకు సిద్ధమైన పోలీసులు
- ఇతర సెక్షన్లతో కేసు నమోదు





రెజ్లర్లు బజరంగ్, వినేశ్, సాక్షి మలిక్ (ఫైల్)

న్యూఢిల్లీ: రెజ్లర్లపై లైంగిపు వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై కేసు కీలక మలుపు తిరిగింది. అతనిపై నమోదైన చిన్నారులపై లైంగిక వేధింపుల రక్షణ చట్టం (పోక్సో)ను తప్పించేందుకు ఢిల్లీ పోలీసులు సిద్ధమయ్యారు. 'పోక్సో'కు సంబంధించి బ్రిజ్‌భూషణ్‌పై ఎలాంటి బలమైన ఆధారాలు లభించలేదని, ఈ కేసుకు కారణమైన మైనర్ రెజ్లర్, ఆమె తండ్రి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే ఈ నిర్ణయానికి వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. 'పోక్సో' ఫిర్యాదు ఫైల్‌ను మూసివేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని పటియాలా హౌస్ కోర్టును పోలీసులు కోరారు. దీనిపై జూలై 4న విచారణ జరగనుంది. వెంటనే అరెస్ట్‌కు అవకాశం ఉన్న, బెయిల్ కష్టంగా మారే, రుజువైతే కనీసం మూడేళ్ల జైలు శిక్ష పడే 'పోక్సో' కేసును తొలగించడం అంటే బ్రిజ్‌భూషణ్‌కు ఊరట లభించినట్లే.

అంతా ఎంపీకి అనుకూలంగా...

నిరసనలో పాల్గొన్న భారత అగ్రశ్రేణి రెజ్లర్లు బజరంగ్ పూనియా, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్‌లతో కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ నెల 7న చర్చలు జరిపారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని, ఈ నెల 15లోగా చార్జ్‌షీట్ దాఖలు చేయాలని వారు డిమాండ్ చేశారు. దాంతో తగిన చర్య తీసుకుంటామని ఠాకూర్ వారికి హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే ఢిల్లీ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అయితే చాలా మంది అనుమానించిన విధంగానే కంటితుడుపుగా చార్జ్‌షీట్ దాఖలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తమ పార్లమెంట్ సభ్యుడికి అండగా నిలిచింది. ఆరోపణలు వచ్చిన చాలా రోజులకు కోర్టు ఆదేశాలతో పోలీసులు కేసు దాఖలు చేయడం, కనీసం ఒక్కసారి ప్రశ్నించకుండా, విచారణకు పిలవకుండా కేసును తప్పించేందుకు సిద్ధం కావడం బ్రిజ్‌భూషణ్ ఎంత బలమైన వ్యక్తో చూపిస్తోంది. రెజ్లర్ల ఫిర్యాదు ప్రకారం 354, 354ఎ, 354డి, 506 సెక్షన్ల కింద బ్రిజ్‌భూషణ్‌పై కేసులు నమోదయ్యాయి. ఇవేవీ తీవ్రమైనవి కావు. దీనిపై ఈ నెల 22న విచారణ జరగనుంది. తాజా పరిణామాలపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. క్రీడలకు 'బ్లాక్‌డే' అంటూ పలువురు రాజకీయ నాయకులు వ్యాఖ్యానించారు. 'బేటీ దరావో, బ్రిజ్‌భూషణ్ బచావో' అనేది బీజేపీ కొత్త నినాదమని, భారత బిడ్డల వేదనకు స్పందించకుండా చెత్తబుట్టలో పడేశారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన మైనర్ రెజ్లర్‌కు వ్యతిరేకంగా మొత్తం వ్యవస్థను నిలబెట్టి తమ ఎంపీని వారు రక్షించుకున్నారని ఆ పార్టీ పేర్కొంది.

మరోవైపు బ్రిజ్‌భూషణ్‌పై దాఖలైన చార్జ్‌షీట్‌పై స్పందించేందుకు రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ నిరాకరించారు. తాజా పరిణామాలపై అందరం చర్చించుకున్నాకే, తమ భవిష్యత్ కార్యాచరణను వెల్లడిస్తామని సాక్షి మలిక్ భర్త సత్యవర్త్ కడియాన్ తెలిపాడు.

శ్రీకాంత్, ప్రణయ్ జోరు

- క్వార్టర్ ఫైనల్లోకి భారత స్టార్ షట్లర్లు
- వరుసగా తొమ్మిదోసారి తై జు యింగ్ చేతిలో ఓడిన సింధు



శ్రీకాంత్



ప్రణయ్

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో ప్రపంచ 22వ ర్యాంకర్ శ్రీకాంత్ 21–17, 22–20తో ప్రపంచ 20వ ర్యాంకర్, భారత్‌కే చెందిన లక్ష్య సేన్‌ను ఓడించగా... ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 21–18, 21–16తో ప్రపంచ 16వ ర్యాంకర్ ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)పై గెలుపొందాడు. గతంలో లక్ష్య సేన్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన శ్రీకాంత్‌కు ఈసారి గట్టిపోటీనే లభించింది. ప్రతి పాయింట్‌కు ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. అయితే కీలకదశలో శ్రీకాంత్ సంయమనంతో ఆడి పైచేయి సాధించాడు. తొలి గేమ్‌లో స్కోరు 17–17తో సమంగా ఉన్నదశలో శ్రీకాంత్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి గేమ్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్ 20–14తో విజయానికి పాయింట్ దూరంగా నిలిచాడు. అయితే లక్ష్య సేన్ వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి స్కోరును 20–20తో సమం చేశాడు. వరుసగా ఆరు పాయింట్లు కోల్పోయినా శ్రీకాంత్ ఏకాగ్రత కోల్పోకుండా ఆడి వరుసగా రెండు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత యువతార ప్రియాన్షు రజావత్ 22–20, 15–21, 15–21తో ప్రపంచ రెండో ర్యాంకర్ జిన్‌టింగ్ (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

మహిళల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. మూడో ర్యాంకర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో 14వ ర్యాంకర్ సింధు 18–21, 16–21తో ఓడిపోయింది. ఓవరాల్‌గా తై జు యింగ్ చేతిలో సింధుకిది 19వ ఓటమికాగా వరుసగా తొమ్మిదో పరాజయం. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చివరిసారి తై జు యింగ్‌ను ఓడించిన సింధు ఆ తర్వాత వరుసగా తొమ్మిది మ్యాచ్‌ల్లో ఈ చైనీస్ తైపీ ప్లేయర్ చేతిలో ఓడిపోయింది.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–17, 21–15తో హి జి టింగ్–జౌ హావో డాంగ్ (చైనా) జంటపై గెలిచింది.

ధీరజ్ బృందానికి కాంస్యం

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలో భారత్‌కు మూడో పతకం



మెడెలిన్ (కొలంబియా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–3 టోర్నీలో భారత్ ఖాతాలో మూడో పతకం చేరింది. బుధవారం కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు కాంస్య పతకాలు సాధించాయి. గురువారం భారత పురుషుల జట్టు రికర్వ్ టీమ్ విభాగంలో కాంస్య పతకం గెల్చుకుంది. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు బొమ్మదేవర ధీరజ్, తుషార్ ప్రభాకర్ షెల్కే, మృణాల్ చౌహాన్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతక మ్యాచ్‌లో 5–3తో చైనా జట్టుపై విజయం సాధించింది. అంతకుముందు తొలి రౌండ్‌లో 'బై' పొందిన భారత్ రెండో రౌండ్‌లో 6–2తో కెనడాపై, క్వార్టర్ ఫైనల్లో 5–1తో కొలంబియాపై గెలిచాయి. అనంతరం సెమీఫైనల్లో భారత్ 0–6తో దక్షిణ కొరియా చేతిలో ఓడిపోయి కాంస్య పతకానికి పోటీపడింది. మహిళల టీమ్ రికర్వ్ విభాగంలో భజన్ కౌర్, సంగీత, తనీషా వర్మలతో కూడిన భారత జట్టు రెండో రౌండ్‌లో 3–5తో ఫ్రాన్స్ జట్టు చేతిలో ఓడిపోయింది.

'టాపర్'గా భారత్



చెన్నై: ప్రపంచకప్ స్క్వాష్ టీమ్ టోర్నీలో గురువారం జరిగిన పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3–1తో జపాన్ జట్టును ఓడించి 'టాపర్'గా నిలిచింది. సెమీఫైనల్లో మలేసియాతో భారత్ తలపడుతుంది. జపాన్ తో తొలి మ్యాచ్‌లో భారత ప్లేయర్ అభయ్ సింగ్ 6–7, 6–7, 2–7తో టొమొటకె చేతిలో ఓడిపోయాడు. రెండో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 2–7, 7–4, 3–7, 7–5, 7–5తో సటోమి వతనాబెను ఓడించి స్కోరును 1–1తో సమం చేసింది. మూడో మ్యాచ్‌లో సౌరవ్ ఘోషాల్ 7–6, 6–7, 7–4, 3–7, 7–5తో సుకుయెపై గెలిచి భారత ఆధిక్యాన్ని 2–1కి పెంచాడు. నాలుగో మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 7–4, 7–1, 7–1తో మిదోరికవాను ఓడించింది.

బంగ్లాదేశ్‌కు భారీ ఆధిక్యం



ఇబాదత్

మిర్పూర్: అఫ్గానిస్తాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టుపై బంగ్లాదేశ్ జట్టు రెండో రోజే పట్టు బిగించింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 362/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 20 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 382 పరుగులవద్ద ఆలౌటైంది. అనంతరం బంగ్లాదేశ్ బౌలర్లు ఇబాదత్ హుస్సేన్ (4/47), షోరిఫుల్ ఇస్లాం (2/28), తైజుల్ ఇస్లాం (2/7), మిరాజ్ (2/15) విజృంభించి అఫ్గానిస్తాన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే ఆలౌట్ చేశారు. 236 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన బంగ్లాదేశ్ ప్రత్యర్థికి ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ ఒక వికెట్ నష్టానికి 134 పరుగులు చేసింది. ప్రస్తుతం బంగ్లాదేశ్ ఓవరాల్‌గా 370 పరుగుల ఆధిక్యంలో ఉంది. జకీర్ హసన్ (54 బ్యాటింగ్; 6 ఫోర్లు), నజ్ముల్ హుస్సేన్ షాంతో (54 బ్యాటింగ్; 8 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీలతో క్రీజులో ఉన్నారు.

క్లుప్తంగా...

తెలంగాణ ఈసెట్‌లో 'గైస్' విద్యార్థుల హవా

కెమికల్ బ్రాంచిలో మొదటి ఆరు ర్యాంకులు మనవే..

మురళీనగర్(విశాఖ ఉత్తర): తెలంగాణ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ ఈసెట్)లో విశాఖపట్నంలోని కంచరపాలెంలో ఉన్న ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) విద్యార్థులు రికార్డు స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం విడుదలైన తెలంగాణ ఈసెట్ కెమికల్ బ్రాంచిలో మొదటి ఆరు ర్యాంకులు గైస్ విద్యార్థులు కైవసం చేసుకుని సత్తా చాటారు. పదో ర్యాంకర్ కూడా గైస్ విద్యార్థి కావడం విశేషం. వి.శంకర్ (1వ ర్యాంకు), కె.కార్తీక్ కుమార్ (2వ ర్యాంకు), వీఎస్ఎన్ కేశవ (3వ ర్యాంకు), ఇ.యోచనకుమార్ (4వ ర్యాంకు), ఎ.సాయిచరణ్ (5వ ర్యాంకు), జ్యోత్స్న ప్రియాంక (6వ ర్యాంకు) సాధించారు. తమ విద్యార్థులు మొదటి ఆరు ర్యాంకులు సాధించడంపై గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ హర్షం వ్యక్తంచేశారు. గత ఏడాది కూడా గైస్ విద్యార్థులు మొదటి పది ర్యాంకుల సాధించినట్లు చెప్పారు.

పద్మావతి మహిళా వర్సిటీ వీసీగా భారతి

సాక్షి, అమరావతి/తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ (వీసీ)గా ఆచార్య దేపూరు భారతి నియమితులయ్యారు. ఆమె నియామకానికి గురువారం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం భారతి ఆ వర్సిటీలోనే బయోసైన్సెస్, సెరికల్చర్ విభాగం ఆచార్యులుతున్నారు. మూడేళ్లు ఆమె వీసీగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు వీసీగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్న వేంకటేశ్వర వర్సిటీ వీసీ ఆచార్య కె.రాజారెడ్డిని రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

వ్యాన్ బోల్తా.. ముగ్గురి మృతి

- 20 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- అల్లూరి జిల్లాలో ప్రమాదం

కొయ్యూరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో గురువారం వ్యాన్ బోల్తాపడిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. కొయ్యూరు మండలంలోని పోతవరం నుంచి ఎం.భీమవరం వస్తున్న వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మరణించగా 20 మంది గాయపడ్డారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న నలుగురిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల్లో చీడికోటకు చెందిన కాకూరి ముత్యాలమ్మ (50), డబ్బకోటకు చెందిన గొల్లూరి లైసన్ (45), గుర్తేడుకు చెందిన కె.ముత్యాలమ్మ (40) ఉన్నారు.

భారతీయులు.. పుస్తక ప్రియులు



పుస్తక పఠనానికే భారతీయుల మొదటి ప్రాధాన్యత

సామాజిక మాధ్యమాలతో పాటు పుస్తక పఠనానికే ఆసక్తి	వారంలో 10 గంటలకు పైగా పుస్తకాలతో కాలక్షేపం	సోషల్ మీడియా వినియోగంలో 13వ స్థానంలో ఇండియన్స్

కేజీ రాఘవేంద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఏదైనా సమాచారం కావాలంటే.. ఒకప్పుడు ఠక్కున గుర్తొచ్చేది గ్రంథాలయం, అందులోని పుస్తకాలే. కాలం స్మార్ట్‌గా మారిన నేపథ్యంలో ఇప్పుడు మునివేళ్లని కదిలిస్తే.. సమస్త సమాచారం కళ్లముందు కనిపిస్తోంది. స్మార్ట్ ఫోన్లు, గూగుల్, చాట్‌జీపీటీలు రాజ్యమేలుతున్న కాలంలోనూ భారతీయులు మాత్రం మిగిలిన ప్రపంచంతో పోలిస్తే.. పుస్తక ప్రియులుగానే ఇంకా కొనసాగుతున్నారు. స్మార్ట్‌కు స్థానం కల్పిస్తూనే.. మన జీవితంలో పుస్తక పఠనం కూడా ఒక భాగమే అన్నట్టుగా జ్ఞాన సముపార్జనలో ముందు వరుసలో ఉన్నారు. ప్రపంచ దేశాల్లో సోషల్ మీడియా సామ్రాజ్యంలో గడుపుతున్న వారితో పోలిస్తే.. ఇండియన్స్ కాస్త వెనుకంజలో ఉన్నా.. బుక్ రీడింగ్‌లో మాత్రం టాప్‌లో ఉన్నారు. కజికిస్తాన్‌కు చెందిన వరల్డ్ ఆఫ్ స్టాటిస్టిక్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ విషయం తేలింది.

బుక్ రీడింగ్.. బెస్ట్ ఆప్షన్

ఉదయం లేచింది మొదలు నిద్రపోయే క్షణం వరకు గ్యాప్ ఇవ్వకుండా జనం చేసే పనేదైనా ఉందంటే.. స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోవడమే. అందులోనూ సోషల్ మీడియాలో విహరించడమేనన్నది జగమెరిగిన సత్యం. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరికీ ఇదే పనిగా మారిపోయింది. దాదాపు అన్ని దేశాల ప్రజలూ సోషల్ మీడియాలోనే బతికేస్తున్నారు. ఒకప్పుడు ఖాళీ సమయాల్లో పుస్తక పఠనంతో కాలం గడిపేవారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. పుస్తకాల ప్రపంచం నుంచి దూరంగా వచ్చేసిన జనం సోషల్ మీడియా మానియాలో మునిగి తేలుతున్నా భారతీయులు మాత్రం.. ఆ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తున్నారు. ఊసుపోవడానికి.. విజ్ఞానాన్ని సంపాదించుకోవడానికి.. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోడానికి కూడా పుస్తకం మంచి నేస్తంగా దారి చూపుతుందన్న సూత్రాన్ని నమ్ముతున్న భారతీయులు తమ నిత్య జీవితంలో ఏదో ఒక సమయంలో బుక్ రీడింగ్‌ను బెస్ట్ ఆప్షన్‌గా ఎంచుకుంటున్నారు.

డిజిటల్ బుక్స్ ఉన్నా.. ప్రింటెడ్ బుక్స్‌పైనే మక్కువ

ఆన్‌లైన్‌లో పీడీఎఫ్, డిజిటల్ పుస్తకాలు దొరుకుతున్నా.. చేతితో పుస్తకాన్ని పట్టుకుని దానిని ఆస్వాదిస్తూ చదివితేనే ఆనందం ఉంటుందన్నది భారతీయుల ముఖ్య సూత్రం. అందుకే.. ప్రతి రోజూ ఎంతో కొంత సమయాన్ని ప్రింటెడ్ పుస్తకాలకు కేటాయిస్తున్నారు. రోజుకు 90 నిమిషాలకు పైగా పుస్తక పఠనం కోసం కేటాయిస్తున్నారు. టెక్ ప్రపంచంలో ముందు వరుసలో ఉన్న చైనా కూడా బుక్ రీడింగ్‌లో బెస్ట్‌గానే ఉంది. అమెరికా ప్రజలు మాత్రం రోజుకు కనీసం గంట కూడా పుస్తకంతో కాలక్షేపం చేయకపోవడం గమనార్హం.

సర్వే ఏం చెప్పిందంటే..

వివిధ దేశాల ప్రజలు వారంలో సగటున పుస్తక పఠనానికి కేటాయిస్తున్న సమయం

దేశం	కేటాయిస్తున్న సమయం (గంటల్లో)
భారత్	10.42
థాయ్‌లాండ్	9.24
చైనా	8.00
ఫిలిప్పీన్స్	7.36
ఈజిప్ట్	7.30
రష్యా	7.06
స్వీడన్	6.54
ఫ్రాన్స్	6.54
హంగేరీ	6.48
సౌదీ అరేబియా	6.48
హాంగ్‌కాంగ్	6.42
పోలాండ్	6.30
వెనుజులా	6.24
సౌత్ ఆఫ్రికా	6.18
ఆస్ట్రేలియా	6.18
ఇండోనేషియా	6.00

సోషల్ మీడియాలో రోజుకు గడుపుతున్న సమయం

దేశం	కేటాయిస్తున్న సమయం (గంటల్లో)
నైజీరియా	4.20
బ్రెజిల్	3.44
సౌత్ ఆఫ్రికా	3.44
ఫిలిప్పీన్స్	3.42
కొలంబియా	3.35
ఘనా	3.32
కెన్యా	3.22
అర్జెంటీనా	3.18
మెక్సికో	3.17
ఇండోనేషియా	3.07
యూఏఈ	2.50
టర్కీ	2.47
ఇండియా	2.44
పోర్చుగల్	2.22
రష్యా	2.17
యూఎస్‌ఏ	2.11
స్వీడన్	2.08
ఐర్లాండ్	2.02
చైనా	2.01

పుస్తకంతో పెనవేసుకున్న బంధం

మనవాళ్లు పుస్తకాల ప్రియులే తప్ప.. సోషల్ మీడియా పులులు కాదని స్పష్టమవుతోంది. సోషల్ మీడియాలో గడిపే విషయంలో భారతీయులు 13వ స్థానంలో ఉండగా.. నైజీరియా అగ్రభాగంలో ఉంది. మన దేశంలో ఒక వ్యక్తి రోజుకు సగటున 2.44 గంటలు మాత్రమే సోషల్ మీడియాకు సమయం కేటాయిస్తున్నారు. ఇన్‌స్టాగామ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌కు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. నైజీరియన్లు మాత్రం ఏకంగా రోజుకు 4.20 గంటల పాటు సోషల్ మీడియాతో బంధాన్ని పెనవేసుకుంటున్నారు. ట్రెండ్ మారినా.. టెక్నాలజీ కొత్త దారులు తొక్కినా పుస్తక పఠనానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్న భారతీయులు మాత్రం పాత ట్రెండ్‌నే కొనసాగిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నేతల దాడి





అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న తదితరులు

- తీవ్రంగా గాయపడిన ఐదుగురు వైఎస్సార్‌సీపీ వర్గీయులు
- బెళుగుప్ప మండలం కాలువపల్లిలో టీడీపీ నేతల దౌర్జన్యకాండ

బెళుగుప్ప: అనంతపురం జిల్లాలో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. గ్రామాల్లో ఘర్షణలకు దిగుతూ ప్రజలను భయభ్రాంతుల్ని చేస్తున్నారు. ముఖ్యంగా పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో టీడీపీ నేతల ఆగడాలు శ్రుతిమించిపోతున్నాయి. తాజాగా నియోజకవర్గంలోని బెళుగుప్ప మండలం కాలువపల్లిలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ వారిపై టీడీపీ నేతలు దాడిచేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఐదుగురు వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజునాయక్ గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నారు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన టీడీపీ నాయకులు సాయి, సుంకన్న, మహేంద్ర తదితరులు నాగరాజునాయక్‌తో గొడవకు దిగారు. కావాలనే ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్‌చేసి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నావా అంటూ దుర్భాషలాడారు. దీంతో నాగరాజునాయక్ అక్కడి నుంచి ఇంటికి వచ్చి విషయం గ్రామస్తులకు తెలిపారు. దీంతో గ్రామస్తులు వెళ్లి టీడీపీ నాయకులను ప్రశ్నించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి, నాగరాజునాయక్‌కు ఏం సంబంధమంటూ నిలదీశారు. మాటామాటా పెరగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈక్రమంలో టీడీపీ నాయకులు సాయి, సుంకన్న, మహేంద్ర తదితరులు వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజునాయక్, కార్యకర్తలు సాలమ్మ, వీరానాయక్, చిన్నలక్ష్మన్న, రవినాయక్‌లపై దాడిచేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఐదుగురు చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజనాస్పత్రిలో చేరారు. బాధితులను వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, గ్రామ సర్పంచ్ ఎండీ పెద్దన్న, మైనార్టీ విభాగం నాయకుడు ఫకృద్దీన్ తదితరులు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యాధికారి ఆత్మారాంను అడిగి తెలుసుకున్నారు. నాగరాజునాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణయ్య తెలిపారు.

ఫ్రీఫైర్ గేమ్ చిచ్చు

- రెండుగ్రామాల యువకుల ఘర్షణ
- కర్రలు, కత్తులతో పరస్పరం దాడులు
- పదిమందిపై కేసు నమోదు



గాయపడిన ఠాగూర్

మహానంది: మొబైల్ గేమ్ నంద్యాల జిల్లాలో రెండు గ్రామాల యువకుల మధ్య చిచ్చురేపింది. గెలిచిన వారు ఓడినవారిని హేళన చేయడం ఘర్షణ, కత్తిపోట్లకు దారితీసింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్.. పదిమందిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ తెలిపిన మేరకు.. గాజులపల్లె మజరా గ్రామమైన బసవాపురం గ్రామానికి చెందిన ఠాగూర్ అలియాస్ రంగస్వామి, అతడి మిత్రులు.. గాజులపల్లెకు చెందిన అర్షద్, అతడి మిత్రులు మొబైల్స్‌లో ఫ్రీఫైర్ గేమ్ ఆడుతున్నారు. గెలిచినవారు ఓడిపోయిన వారిని హేళన చేయడంతో గొడవ జరిగింది. కర్రలు, కత్తులతో పరస్పరం దాడులకు దిగారు. ఠాగూర్‌కు కత్తిపోటు గాయాలయ్యాయి. అర్షద్ కూడా గాయపడ్డాడు. ఈ ఇద్దరి ఫిర్యాదు మేరకు పదిమందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గ్రామంలోని ఓ టీస్టాల్ వద్ద ఫ్రీ వైఫై అందుబాటులో ఉండటంతో యువకులంతా అక్కడ గుమికూడటం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని గ్రామంలో చర్చ జరుగుతోంది.

ఈ యాప్‌లో సినిమాలు రిలీజ్

- రూపకల్పన చేస్తున్న ఏపీఎస్‌ఎఫ్‌ఎల్
- జూన్ 16న రూ.39 కే 'లవ్ యూ టూ'ప్రదర్శన
- ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: త్వరలోనే ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్‌ఎఫ్‌ఎల్) ఒక యాప్‌ను రూపొందిస్తుందని, ఇకపై ఆ యాప్ ద్వారా పాత, కొత్త సినిమాలను కూడా వీక్షించే అవకాశం లభిస్తుందని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి గురువారం చెప్పారు. ఇటీవల విశాఖలో 'నిరీక్షణ'అనే సినిమాతో రిలీజ్ రోజే థియేటర్‌లో మాదిరిగా కొత్త సినిమాను ఫస్ట్ డే ఫస్ట్ షోని కుటుంబమంతా కలిసి ఇంట్లోనే కూర్చొని వీక్షించే విధానాన్ని ప్రవేశపెట్టామని..దానికి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. ఈ స్ఫూర్తితో ఏపీ ఫైబర్‌నెట్ జూన్ 16న రూ.39 కే 'లవ్ యూ టూ' చిత్రాన్ని అందిస్తోందని, దీన్ని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు వివరించారు. సబ్‌స్క్రైబ్ చేసుకున్న తర్వాత 24 గంటల వరకు ఈ సినిమాను చూడవచ్చని చెప్పారు. చిన్న చిత్రాల నిర్మాతలను ప్రోత్సహించి, వీక్షకుడికి అతి తక్కువ ధరకే నేరుగా సినిమాను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని ఇది ఓటీటీలకు, థియేటర్ల యాజమాన్యానికి పోటీ కాదన్నారు. రూ.100 కోట్ల బడ్జెట్ మూవీకి మొదటి వారంపాటు టికెట్ ధరను పెంచుకునే వెసులుబాటు కల్పించే విధంగా ప్రభుత్వం జీవో 13ను తీసుకువచ్చిందని గుర్తు చేశారు. రూ.20 కోట్లలోపు నిర్మించిన సినిమాలను చిన్న చిత్రాలుగా భావిస్తూ వాటిని కూడా పండుగ రోజుల్లో ప్రతి థియేటర్‌లో పెద్ద చిత్రంతో పాటు ఒక షో చిన్న చిత్రానికి కేటాయించే అవకాశం కల్పించామన్నారు. రాబోయే రోజుల్లో థియేటర్లలో ప్రదర్శించే ప్రతి చిత్రాన్ని ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా వీక్షించే అవకాశం కల్పిస్తామన్నారు.

సూర్యనారాయణకు దెబ్బ మీద దెబ్బ..

- ఒకే రోజు న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి కేసులో తదుపరి చర్యల నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ
- వ్యాపారుల వాంగ్మూలాలను పరిశీలించిన కోర్టు
- మధ్యంతర ఉత్తర్వులు సాధ్యం కాదన్న హైకోర్టు న్యాయమూర్తి
- సూర్యనారాయణ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన విజయవాడ కోర్టు

సాక్షి, అమరావతి: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణకు గురువారం న్యాయస్థానాల్లో దెబ్బ మీద దెబ్బ తగిలింది. వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయానికి గండికొట్టారంటూ విజయవాడ పటమట పోలీసులు నమోదు చేసిన కేసులో మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. ఈ కేసు కొట్టేయాలని తన అరెస్ట్‌తో సహా తదుపరి చర్యలన్నీ నిలిపివేయాలన్న సూర్యనారాయణ అభ్యర్థనను తోసిపుచ్చింది. సూర్యనారాయణ తమతో కుమ్మక్కయినట్లు వ్యాపారులు ఇచ్చిన వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల జారీకి విముఖత వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సూర్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన అరెస్ట్‌తో సహా తదుపరి చర్యలన్నీ నిలిపేయాలని కోరుతూ ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఈ అనుబంధ పిటిషన్‌పై జస్టిస్ శ్రీనివాసరెడ్డి గురువారం విచారణ జరిపారు. పోలీసుల తరఫున పబ్లిక్ పీపీ యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ సూర్యనారాయణ ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని, తద్వారా అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. వ్యాపారులతో కుమ్మక్కై నోటీసుల ప్రకారం వారు చెల్లించాల్సిన పన్ను కన్నా తక్కువ వసూలు చేశారన్నారు. ఈ ప్రక్రియలో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారిందన్నారు. సూర్యనారాయణ ఏ రకంగా లబ్ధి చేకూర్చారో వ్యాపారులు వాంగ్మూలం రూపంలో పూసగుచ్చినట్లు పోలీసులకు చెప్పారని నాగిరెడ్డి కోర్టుకు నివేదించారు. పోలీసులు నమోదు చేసిన ఆ వాంగ్మూలాలను కోర్టు ముందుంచారు. సూర్యనారాయణ చాలా తీవ్రమైన నేరానికి పాల్పడ్డారన్నారు. అందుకు అన్ని ఆధారాలున్నాయని వివరించారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని ఆయన కోర్టును అభ్యర్థించారు. అంతకు ముందు సూర్యనారాయణ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్, న్యాయవాది పీవీజీ ఉమేష్ చంద్ర వాదనలు వినిపించారు. ఈ కేసులోని మిగిలిన నిందితులతో పిటిషనర్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసినందుకు కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసు నమోదైందన్నారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేసి సస్పెండ్ చేసేందుకే ఆయనకు బెయిల్ రాకుండా అవినీతి నిరోధక చట్టం కింద కూడా కేసు పెట్టారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి.. వ్యాపారుల వాంగ్మూలాలను పరిశీలించిన తరువాత ఈ కేసులో పిటిషనర్ కోరిన విధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదన్నారు.

ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కృతి

ఇదిలా ఉంటే, పటమట పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందుస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సూర్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడ 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు తోసిపుచ్చింది. సూర్యనారాయణపై అవినీతి నిరోధక చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసిన నేపథ్యంలో, అతని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదని న్యాయాధికారి స్పష్టం చేశారు.

డిజైన్‌కు తగ్గట్టుగానే పోలవరం గైడ్ బండ్ నిర్మాణం



ఈసీఆర్‌ఎఫ్ సమీపంలో గోతుల్ని పూడ్చుతున్న దృశ్యం

అయినా కొంత భాగం కాస్త జారడంపై మరింత అధ్యయనం

- దాని ఆధారంగా గైడ్ బండ్‌ను పూర్తి స్థాయిలో పటిష్టవంతం చేసే పనులు
- ఈలోగా తాత్కాలిక మరమ్మతులు
- రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులకు సీడబ్ల్యూసీ నిపుణుల కమిటీ ఆదేశం
- పరిమితికి లోబడే ఎగువ కాఫర్ డ్యామ్‌లో లీకేజీలు ఉన్నాయని నిర్ధారణ
- ప్రధాన డ్యామ్ వద్ద అగాధాల పూడ్చివేతపై కమిటీ సంతృప్తి
- నేడు రాష్ట్ర అధికారులతో మరోసారి కమిటీ సమీక్ష
- అనంతరం సీడబ్ల్యూసీకి నివేదిక



ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదించిన డిజైన్‌కు తగ్గట్టుగా, నిర్దేశించిన ప్రమాణాల మేరకు పోలవరం ప్రాజెక్టు గైడ్ బండ్‌ను నాణ్యంగా నిర్మించినట్లు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నిపుణుల కమిటీ తేల్చింది. కానీ.. గైడ్ బండ్ కొంత భాగం కాస్త జారిందని, ఈ సమస్య ఎందుకు ఉత్పన్నమైందనే విషయంపై మేధోమథనం జరిపింది. మట్టి పరీక్షల నివేదికలను పరిశీలించింది. గైడ్ బండ్ జారిన ప్రాంతానికి తాత్కాలిక మరమ్మతులపై నాలుగు రోజుల్లోగా ప్రతిపాదన ఇస్తే.. దాన్ని సరిచూసి సీడబ్ల్యూసీకి నివేదిస్తామని పేర్కొంది. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ ప్రకారం తక్షణం మరమ్మతుల చేయాలని, ఆ తర్వాత గైడ్ బండ్‌ను పూర్తి స్థాయిలో పటిష్టం చేసే పనులు చేపట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏబీ పాండ్య నేతృత్వంలో సీడబ్ల్యూసీ డైరెక్టర్ ఎస్కే సిబాల్, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) డైరెక్టర్ చిత్ర, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్ సభ్యులుగా సీడబ్ల్యూసీ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ గురువారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించింది. అనంతరం రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు, ఎస్ఈ నరసింహమూర్తి, కాంట్రాక్టు సంస్థ మేఘా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించింది. స్పిల్ వే, గేట్లు, స్పిల్ చానల్ పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేసింది. గైడ్ బండ్‌ను సమగ్రంగా పరిశీలించింది.

పరిమితికి లోబడే ఎగువ కాఫర్ డ్యామ్ లీకేజీలు

గతేడాది గోదావరికి భారీ స్థాయిలో వచ్చిన వరదలను దీటుగా ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎగువ కాఫర్ డ్యామ్ ఎత్తును 44 మీటర్లకు పెంచింది. దీన్ని నిపుణుల కమిటీ పరిశీలించింది. ఎగువ కాఫర్ డ్యామ్‌లో లీకేజీలను రీచ్‌లవారీగా ఎప్పటికప్పుడు అధునాతన హైడ్రాలిక్ డాప్లర్ టూల్‌తో కొలుస్తున్నామని రాష్ట్ర అధికారులు కమిటీకి వివరించారు. హైడ్రాలిక్ డాప్లర్ టూల్‌లో రికార్డయిన గణాంకాలను విశ్లేషించిన నిపుణుల కమిటీ.. ఎగువ కాఫర్ డ్యామ్‌లో లీకేజీలు పరిమితికి లోబడే ఉన్నాయని పేర్కొంది. వరదల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ కాఫర్ డ్యామ్ భద్రతను పర్యవేక్షించాలని సూచించింది.

యథాస్థితికి తెచ్చే పనులపై సంతృప్తి

గత ఫిబ్రవరి 15 నాటికి 31.5 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసిన దిగువ కాఫర్ డ్యామ్ నాణ్యతపై కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య ప్రధాన డ్యామ్ వద్ద వరద ఉధృతికి ఏర్పడిన అగాధాల పూడ్చివేత పనులను పరిశీలించింది. ఈ పనులు పూర్తయ్యాక డయాఫ్రం వాల్ దెబ్బతిన్న చోట్ల కొత్తగా డయాఫ్రం వాల్ వేసే పనులు చేపడతామని రాష్ట్ర అధికారులు వివరించారు. శుక్రవారం నిపుణుల కమిటీ మరో సారి రాష్ట్ర అధికారులతో సమావేశమై.. సాంకేతిక అంశాలపై చర్చించనుంది. క్షేత్ర స్థాయి పర్యటన.. అధికారుల సమీక్షలో వెల్లడైన అంశాల ఆధారంగా సీడబ్ల్యూసీకి నివేదిక ఇవ్వనుంది.

ఔషధ విక్రయాల్లో అక్రమాలను అరికట్టాలి

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని



సాక్షి, అమరావతి: ఔషధాల క్రయవిక్రయాల్లో అవకతవకలు, నకిలీ, నాణ్యత లేని మందుల చెలామణి, మెడికల్ షాపుల్లో అక్రమాలను అరికట్టడానికి డీజీ స్థాయిలో తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. ఔషధ నియంత్రణా విభాగంపై గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఔషధ నియంత్రణా విభాగం మరింత సమర్థంగా పనిచేయాలని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది ఖాళీల భర్తీకి నివేదిక తయారుచేయాలని చెప్పారు. కేంద్ర ఔషధ నియంత్రణ శాఖకు సంబంధించిన ప్రాంతీయ కార్యాలయాన్ని మన రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులకు లేఖ రాయాలన్నారు. సీఆర్‌యూ ఫిర్యాదుల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్యశాఖ ప్రత్యేక, ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఔషధ నియంత్రణ డీజీ కొల్లి రఘురామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన 'జెట్రో' సీనియర్ ప్రతినిధులు



జెట్రో ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ప్రతినిధులు

వరదయ్యపాళెం (తిరుపతి జిల్లా): జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో)కు చెందిన డైరెక్టర్ జనరల్ (చెన్నై) కొరు షిరైషి, డైరెక్టర్ జనరల్ (అహ్మదాబాద్) తకేహికో పురుకావా, డైరెక్టర్ (న్యూఢిల్లీ) టాకు హిరోకి తదితర ఏడుగురు ఉన్నతస్థాయి ప్రతినిధులు గురువారం శ్రీసిటీని సందర్శించారు. వీరికి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ స్వాగతం పలుకగా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) శివశంకర్ శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలతో పాటు ఇక్కడ పెట్టుబడిదారుల అనుకూల పర్యావరణ వ్యవస్థ గురించి వివరించారు. మౌలిక సదుపాయాలపై షిరైషి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న చాలా మంది జపనీస్ ఎంటర్‌ప్రైజెస్ తమ తయారీ కేంద్రాలను విస్తరించడంపై హర్షం వ్యక్తం చేశారు. విదేశీ పారిశ్రామిక ప్రతినిధుల కోసం నిర్మితమవుతోన్న సర్వీస్డ్ అపార్ట్‌మెంట్‌లు, రెస్టారెంట్లు, విద్యా సంస్థలు, వినోద సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించగల సామర్థ్యంతో, దేశంలోని పది గొప్ప తయారీ ప్రదేశాలలో ఒకటిగా అవతరించిన శ్రీసిటీ గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవడం వీరి పర్యటన ఉద్దేశం. ఈ బృందం శ్రీసిటీ పరిసరాలతో పాటు కొన్ని జపాన్ పరిశ్రమలను సందర్శించింది. కాగా, జెట్రో అనేది జపాన్, ఇతర దేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను ప్రోత్సహించే జపాన్ ప్రభుత్వ మద్దతు గల ప్రత్యేక సంస్థ.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943